

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 184

శనివారం 24-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్‌దే రెండో టీ20

నాగపూర్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 6 వికెట్లతో ఘన విజయం - 13లో



మార్కెట్లకు డాలర్ షాక్

సెన్సెక్స్ 1,021 పాయింట్లు పతనం.. నిఫ్టీ 302 పాయింట్లు డౌన్ - 13లో

వైఎస్సార్ చేయూత నిధుల విడుదల సందర్భంగా కుప్పంలో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



జగనన్న చేయూతకు జేజేలు

కుప్పంలో సీఎం పర్యటనకు అపూర్వ స్పందన.. అంచనాలకు మించి వచ్చిన జనం

> చంద్రబాబును 33 ఏళ్లుగా గెలిపించినా కూడా ఇక్కడ సొంత ఇల్లు లేదు. ఓటు కూడా లేదు. కుప్పం తన సొంతం అని ఆయన ఏనాడూ భావించ లేదు. హైదరాబాద్‌లో ఇంద్ర భవనం కట్టుకున్న ఆయన అక్కడ లోకల్, కుప్పంకు నాన్ లోకల్.

> నా దృష్టిలో పులివెందుల ఎంతో.. కుప్పం కూడా అంతే. ఈ ప్రాంత ప్రజల కోసం రూ.250 కోట్లతో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తాం. పాలారు ప్రాజెక్టుకు న్యాయ, పర్యావరణ సమస్యలు తొలగ్గానే రూ.120 కోట్లతో ఆ ప్రాజెక్టు నిర్మాణం దిశగా అడుగులు వేస్తాం. ఇప్పటికే కుప్పం మున్సిపాలిటీ కోసం రూ.66 కోట్లు మంజూరు చేశాం. మిగిలిన నాలుగు మండలాల అభివృద్ధికి రూ.100 కోట్లు అవసరం అని భరత్ అడిగాడు. నువ్వు నియోజకవర్గంలో తిరుగు.. ఆ నిధులు ఇస్తానని చెబుతున్నా.

- కుప్పం సభలో సీఎం వైఎస్ జగన్



సాక్షి, చిత్తూరు, కుప్పం: ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా కుప్పంలో పర్యటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతల అంచనాలకు మించి జనం భారీగా తరలివచ్చారు. కుర్చీల్లో కూర్చున్న వారి కంటే నిలుచున్న వారి సంఖ్య అంతకు మించి ఉండటం విశేషం. ఇక సభా ప్రాంగణం బయట, పట్టణమంతా జనసంద్రమే. బహిరంగ సభలో సీఎం ప్రసంగం ప్రజలను కట్టిపడేసింది. చంద్రబాబు గురించి ప్రస్తావించిన ప్రతిసారీ జనం కేరింతలు కొడుతూ నిజమేనంటూ కోరస్ పలికారు. బాబు మూడు దశాబ్దాల పాలనలో మగ్గిన కుప్పంలో మూడున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని చూస్తున్నారు కదా.. అనగానే జనం ఒక్కసారిగా కేకలు వేశారు. నాటి ప్రభుత్వానికి.. నేటి మన ప్రభుత్వానికి తేడాను గమనించారా? అనగానే చేతులు ఊపుతూ మద్దతు పలికారు. 'ఇక్కడి ఎమ్మెల్యే హైదరాబాద్‌కు లోకల్.. కుప్పానికి నాన్‌లోకల్' అనగానే నవ్వులు, కేకలు మిన్నంటాయి. 33 ఏళ్లుగా కుప్పంలో ఇల్లు కట్టుకోవాలనిపించ లేదా అని ప్రశ్నిస్తూ.. అసలు కుప్పంలో ఆ పెద్దమనిషికి ఓటు కూడా లేదని చెప్పడంతో జనం పెద్దపెట్టున కేకలు వేశారు. ప్రధానంగా బీసీలు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఒక్కసారి కూడా ఎమ్మెల్యేగా వారికి అవకాశం ఇవ్వలేదన్నప్పుడు కేకలే కేకలు. ఇలా చంద్రబాబును విమర్శించిన ప్రతిసారీ ప్రజలు కేరింతలు కొట్టారంటే.. బాబు తీరుపై ఎంతగా విసిగిపోయారో ఇట్టే స్పష్టమవుతోంది. కాగా, అంతకు ముందు సీఎం వైఎస్ జగన్ కొంత మంది 'చేయూత' పథకం లబ్ధిదారులతో ముచ్చటించి, వారితో కలిసి ఫోటో దిగారు. ఆ తర్వాత కుప్పంలో రూ.66 కోట్లతో చేపట్టిన మున్సిపల్ ఆఫీసు, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆర్కే రోజా, కేవీ ఉషశ్రీ చరణ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

వెన్నుపోటు, దొంగ ఓట్లకు

బాబు కేరాఫ్

- కేంద్రంలో చక్రం తిప్పానని చెప్పే ఆయన కుప్పానికి మంచి నీళ్లైనా ఇచ్చారా!
- కుప్పం వేదికగా మూడో విడత వైఎస్సార్ చేయూత నిధులు విడుదల చేస్తూ సీఎం జగన్
- 26,39,703 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.4,949.44 కోట్లు జమ
- వారం రోజుల పాటు మండలాల్లో చేయూత పండుగ
- చంద్రబాబు ఇంత కాలం కుప్పం నుంచి తనకు కావాల్సింది పిండుకున్నారు
- అత్యధికంగా బీసీలుండే ఈ నియోజకవర్గ సీటు ఒక్కసారి కూడా వారికి ఇవ్వలేదు
- ఇన్నేళ్లూ ఏమీ చేయలేక చివరకు రెవిన్యూ డివిజన్ కోసం నాకు లేఖ రాశాడు
- ఈ నియోజకవర్గానికి మనందరి ప్రభుత్వం ఇచ్చిన మొత్తం రూ.1,149 కోట్లు

2లో

జనవరి నుంచి పింఛన్

రూ.2,750

కుప్పం సభలో సీఎం జగన్ వెల్లడి

2లో

సీఎం చెప్పినవన్నీ

అక్షర సత్యాలే



- ప్రభుత్వం చేసిన లావాదేవీల నిబద్ధతను కాగ్ ప్రశ్నించనేలేదు
- కేవలం విధానపరమైన అభ్యంతరాలనే వ్యక్తంచేసింది
- రాష్ట్ర విభజన, టీడీపీ అస్తవ్యస్త పాలన, కోవిడ్‌వల్లే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నది
- యనమల అబద్ధాలపై మంత్రి బుగ్గన మండిపాటు

10లో

భూ హక్కుకు.. శ్రీరామరక్ష!

ధ్రువీకరించిన భూ యాజమాన్య హక్కులతో ప్రత్యేక రిజిస్టర్

- వివాదాల్లేని భూముల టైటిల్‌తో రిజిస్టర్ నిర్వహణ.. ఈ రిజిస్టర్ నిర్వహణకు ప్రత్యేక ప్రాధికార సంస్థ
- భూ హక్కు యాజమాన్య చట్టంలో కీలక మార్పులు
- రీ సర్వేతో సమూలంగా మారనున్న భూముల నిర్వహణ వ్యవస్థ

2లో



పనసపొట్టు.. షుగర్ ఆటకట్టు!

- పచ్చి పనసపొట్టు పిండితో మధుమేహాన్ని నియంత్రించొచ్చని శాస్త్రీయ పరిశోధన
- శ్రీకాకుళం మెడికల్ కాలేజీలో జరిగిన అధ్యయనంలో వెల్లడి
- అధ్యయన ఫలితాలను ప్రకటించిన జాక్‌ఫ్రూట్365 సంస్థ

14లో

ఐఎన్ఎస్ అధ్యక్షుడిగా

కేఆర్‌పీ రెడ్డి

- తెలుగు పత్రికలకు తొలిసారి దక్కిన అవకాశం
- ఏడాది పాటు పదవీకాలం

6లో





పీఎఫ్ఐ హర్తాళ్ హింసాత్మకం

ఎన్ఐఏ సోదాలకు నిరసనగా కేరళలో ఇస్లామిక్ అతివాద సంస్థ పీఎఫ్ఐ చేపట్టిన హర్తాళ్ హింసాత్మకంగా మారింది .

వివరాలు 6లో



కరోనా కథ ముగిసింది

కోవిడ్‌లో భయంకరమైన. ప్రపంచ దేశాల వెన్నులో వణుకు పుట్టించిన దశ ముగిసి పోయినట్టేనని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది.

వివరాలు 6లో

ఎంఐజీ లేఅవుట్లలో.. 60% ధరకే విక్రయ ఒప్పందం

సాక్షి, అమరావతి : పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ఎంఐజీ లేఅవుట్లు, జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లలో భూమి ధరలను రెండు భాగాలుగా విభజించుకోవడానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇక నుంచి పట్టణాభివృద్ధి సంస్థలు భూమి ధరను మొత్తం విక్రయ ధరలో 60 శాతం, అభివృద్ధి రుసుములు కింద మొత్తం విక్రయ ధరలో 40 శాతంగా విభజించుకోవడానికి అనుమతిస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా స్థాయి కమిటీలు నిర్ణయించిన ధర ఆధారంగా ఈ విభజన ఉండాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. గతంలో పూర్తి విక్రయ ధర చెల్లిస్తే గానీ కొనుగోలు ఒప్పందం చేసుకోవడానికి అవకాశం ఉండేది కాదని.. కానీ, ఇప్పుడు మొత్తం విక్రయ ధరలో 60 శాతం చెల్లించడం ద్వారా ఒప్పందం చేసుకోవచ్చు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంవల్ల రిజిస్ట్రేషన్ శాఖకు ఎటువంటి నష్టం ఉండదని.. సేల్‌డీడ్ ఇచ్చేటప్పుడు మొత్తం విక్రయ ధర అంటే భూమి ధర 60 శాతం, అభివృద్ధి రుసుము 40 శాతం చెల్లించిన తర్వాతే జరుగుతుందని ఆ ఉత్తర్వుల్లో వై. శ్రీలక్ష్మి స్పష్టంచేశారు.

వెసువియస్ పరిశ్రమకు శంకుస్థాపన

పరవాడ సమీపంలో ఏర్పాటు

పరవాడ (పెందుర్తి): విశాఖలో వెసువియస్ మూడో పరిశ్రమను ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆ సంస్థ చైర్మన్ జాన్ మెక్‌డోనగ్ చెప్పారు. అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని ఈదులపాక బోనంగి దరి ఇండస్ట్రియల్ పార్కులో రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమ నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కోల్‌కతాలో తొలి పరిశ్రమను ప్రారంభించామని చెప్పారు. ఆ పరిశ్రమ రూ.1000 కోట్ల టర్నోవర్ సాధించిందని తెలిపారు. కంపెనీ భారత్ చైర్మన్ బిశ్వదీప్‌గుప్తా మాట్లాడుతూ విశాఖలో రెండు వెసువియస్ పరిశ్రమలు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉన్నాయని చెప్పారు. ఈ మూడో పరిశ్రమలో ఫ్లక్స్‌ప్లాంట్ ద్వారా కొత్త ఉత్పత్తులు తయారుచేస్తామన్నారు.

భూ హక్కుకు.. శ్రీరామరక్ష!

సాక్షి, అమరావతి: భూముల హక్కుదారుల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగులేస్తోంది. భూమిపై కచ్చితమైన యాజమాన్య హక్కులను నిర్ధారించేందుకు సరికొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తోంది. ధ్రువీకరించిన భూ యాజమాన్య హక్కుల(కన్‌ఫర్మ్‌డ్ టైటిల్ విధానం) వివరాలతో ప్రత్యేక రిజిస్టర్ల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం భూ హక్కు యాజమాన్య చట్టంలో కేంద్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా కీలక మార్పులు చేసింది. కొత్తగా రూపొందించిన భూ హక్కు యాజమాన్య చట్టానికి శాసనసభ ఆమోదం తెలిపింది.

వివాదాల పరిష్కారానికి సరికొత్త మార్గం

పలు వివాదాలతో ప్రస్తుతం భూముల యాజమాన్యం అత్యంత సంక్లిష్టంగా మారిన విషయం తెలిసిందే. వివాదాలు లేకుండా ఉన్న కచ్చితమైన భూ హక్కుదారుల వివరాలు తెలుసుకోవడం క్లిష్టంగా మారింది. కన్‌ఫర్మ్‌డ్ టైటిల్ విధానంలో ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) సాయిప్రసాద్ చెప్పారు. దేశంలో భూమిపై హక్కుల్ని నిర్ధారించే అధికారం సివిల్ కోర్టులకు మాత్రమే ఉంది. ఒక వ్యక్తి అంతా సక్రమంగా ఉందని భావించి భూమి కొనుగోలు చేశాక, దానిపై తనకూ హక్కు ఉందని ఎవరైనా కోర్టుకు వెళితే అది వివాదంలో కూరుకుపోతోంది. అన్ని ఆధారాలు పరిశీలించి సివిల్ కోర్టు చేసిన నిర్ధారణే ఇలాంటి కేసుల్లో అంతిమం. ఆ భూమిపై పలానా వ్యక్తికి మాత్రమే హక్కు ఉందని కచ్చితంగా చెప్పే వ్యవస్థ రెవెన్యూ శాఖలో లేదు. రెవెన్యూ రికార్డులు, ఆస్తుల్ని రిజిస్టర్ చేసే విధానం కూడా ఇలాంటి వివాదాలకు పరష్కారాలు సూచించేలా లేదు. వీటన్నింటికీ కన్‌ఫర్మ్‌డ్ టైటిల్ విధానం పరిష్కారం చూపనుంది.

భూ యాజమాన్య హక్కుల రిజిస్టర్లు

భూముల రీ సర్వే జరుగుతున్న క్రమంలో ప్రతి గ్రామంలో ధ్రువీకరించిన భూ యాజమాన్య హక్కుల రిజిస్టర్లు తయారవుతాయి. ఆ రిజిస్టర్లలో ఆ గ్రామానికి చెందిన పక్కా యాజమాన్య హక్కులున్న భూముల వివరాలుంటాయి. ఎవరైనా ఆ భూములపై వివాదాలు సృష్టించేందుకు కోర్టుకెళ్లినా.. ఈ రిజిస్టర్ల ఆధారంగా కోర్టు వాటిని కొట్టేస్తోంది. దీనివల్ల భూ యజమానులకు భద్రత ఏర్పడుతుంది. ఇందుకోసమే అనేక మార్పులతో కొత్త భూ హక్కు యాజమాన్య చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ప్రకారం రాష్ట్రంలో ఉన్న స్థిరాస్తుల రికార్డులను తయారు చేసి వాటిని పక్కాగా నిర్వహిస్తారు. ఈ హక్కుల రికార్డుల ఆధారంగా భూముల రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగేందుకు వీలవుతుంది. భూములకు సంబంధించిన డిజిటల్ రికార్డులు తయారవుతాయి. ఈ రికార్డుల నిర్వహణ బాధ్యతలు చూసేందుకు కొత్తగా రాష్ట్ర స్థాయిలో భూ ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయనున్నారు. దీని చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి హోదాకు తగ్గని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిని ప్రభుత్వం నియమిస్తుంది. ఈ సంస్థ భూమి హక్కుల రియల్ టైమ్ డేటాను తయారు చేసి వాటిని నిర్వహిస్తుంది. హామీతో కూడిన హక్కుల యాజమాన్య విధానం అమల్లోకొస్తుంది.

జనవరి నుంచి పింఛన్ రూ.2,750

కుప్పం సభలో సీఎం వైఎస్ జగన్ వెల్లడి

- మేనిఫెస్టోలో చెప్పినట్టుగా రూ.3 వేల వరకూ తీసుకెళతాం
- చేయూత పథకం ద్వారా మూడు విడతల్లో రూ.14,110 కోట్ల సహాయం
- 60 ఏళ్లు దాటగానే పింఛన్ ద్వారా సహాయం
- 45 ఏళ్లు నిండిన వారికి కొత్తగా వర్తింపు
- అమ్మ ఒడి, ఆసరా, చేయూత, సున్నా వడ్డీ ద్వారానే రూ.51 వేల కోట్లు
- అన్ని పథకాల ద్వారా రూ.3.12 లక్షల కోట్లు
- నాడు, నేడు అదే బడ్జెట్.. మరి అప్పుడు ఎందుకిలా చేయలేదు?
- అప్పుడు దోచుకో.. పంచుకో.. తినుకో.. ఇప్పుడు నేరుగా మీ ఖాతాల్లోకే నగదు


చేయూత లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

కుప్పం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి :ప్రస్తుతం రూ.2,500 చొప్పున ఇస్తున్న అవ్వాతాతల పింఛన్‌ను వచ్చే జనవరి నుంచి రూ.2,750కి పెంచబోతున్నామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆ తర్వాత మేనిఫెస్టోలో చెప్పినట్టుగా రూ.3 వేల వరకు తీసుకుపోతామని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కుప్పంలో వైఎస్సార్ చేయూత పథకం మూడో విడత నిధుల జమ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఈ ఏడాది అందిస్తున్న రూ.4,949.44 కోట్లతో కలిపి ఈ పథకం కింద ఇప్పటి దాకా మొత్తం రూ.14,110.62 కోట్ల ఆర్థిక సహాయం అందజేశామని చెప్పారు. మూడు విడతలలో కలిపి ఒక్కొక్కరికీ ఇప్పటికే రూ.56,250 అందజేశామన్నారు. అత్యంత బాధ్యతాయుతమైన 45–60 ఏళ్ల మధ్య ఉన్న అక్క చెల్లెమ్మలు కుటుంబాన్ని ఒక బాధ్యతతో మోస్తున్నారని.. వాళ్ల చేతిలో డబ్బులు పెడితే ఆ కుటుంబం ఎదుగుతుందని విశ్వసించామన్నారు. 60 ఏళ్లు నిండిన వారు పెన్షన్ జాబితాలోకి వెళ్లిపోతారని, కొత్తగా 45 ఏళ్లు నిండిన వారు ఈ పథకంలోకి చేరుతారని చెప్పారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

అమ్మ కడుపులో బిడ్డ మొదలు అవ్వ వరకు..

- అమ్మ కడుపులోని బిడ్డ మొదలు అవ్వ వరకు అందరికీ ఈ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అక్కచెల్లెమ్మల సాధికారతే లక్ష్యంగా ఈ ప్రభుత్వం అడుగులు ముందు కేసింది. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, పొదుపు సంఘాల వైఎస్సార్ సున్నా వడ్డీ.. ఈ నాలుగు పథకాల ద్వారానే కేవలం 39 నెలల్లో ఈ ప్రభుత్వం రూ.51 వేల కోట్లు ఇచ్చింది.
- అమ్మ ఒడి ద్వారా 44.5 లక్షల మందికి రూ.19,617 కోట్లు ఇచ్చాం. వైఎస్సార్ ఆసరా ద్వారా 78.74 లక్షల మందికి రెండు విడతల్లో రూ.12,757 కోట్లు ఇప్పటికే ఇచ్చాం. మూడో దఫా జనవరి నెలలో ఇవ్వనున్నాం. చేయూత ద్వారా 26.4 లక్షల మందికి రూ.14,111 కోట్లు, సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.3,615 కోట్లు ఇచ్చాం. ఇందులో ఎక్కడా లంచాలు, వివక్షకు తావే లేదు. మొత్తంగా ఈ 39 నెలల్లో అన్ని రకాల పథకాల ద్వారా బటన్ నొక్కి మహిళలకు అందించిన సొమ్ము రూ.1,17,667 కోట్లు. అన్నదమ్ములకు కూడా ఇచ్చింది కలుపుకుంటే రూ.1.71 లక్షల కోట్లు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా పథకాలన్నీ అమలు చేస్తున్నాం.
- ఆరు నాన్ డీబీటీ పథకాలైన ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం, సంపూర్ణ పోషణ, గోరుముద్ద, విద్యా కానుక, జగనన్న తోడు ద్వారా ఇచ్చిన రూ.1.41 లక్షల కోట్లు కలుపుకుంటే.. మొత్తం రూ.3,12,764 కోట్లు. ఇందులో అక్కచెల్లెమ్మలకే రూ.2.39 లక్షల కోట్లు నేరుగా లబ్ధి చేకూరింది. రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఇళ్లపట్టాలు ఇచ్చాం. 21 లక్షల ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఇళ్లు పూర్తయితే ఒక్కో ఇంటి విలువ కనీసం రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల ఆస్తి ఇచ్చినట్టు అవుతుంది. ఇళ్ల ద్వారా అక్క చెల్లెమ్మలకు రూ.2.3 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చినట్టు అవుతుంది.

అప్పుడు, ఇప్పుడు అదే బడ్జెట్

- ఇంతకు ముందు పరిపాలనలో ముఖ్యమంత్రి ఉన్నారు. అప్పుడూ, ఇప్పుడూ అదే బడ్జెట్. అప్పుడు చేసిన అప్పుల కన్నా, ఇప్పుడు చేసిన అప్పులు తక్కువే. కానీ అప్పటి ప్రభుత్వంలో ఇంతగా లబ్ధి ఎందుకు జరగలేదు.. ఇప్పుడు ఎలా జరుగుతోంది.. మీరే ఆలోచించండి.
- ఆ రోజుల్లో దోచుకో.. పంచుకో.. తినుకో.. పద్ధతి ఉండేది. కేవలం నలుగురు.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్తపుత్రుడు.. వారికి తోడు గ్రామాల్లో జన్మభూమి కమిటీలు ఉండేవి. అప్పుడు ప్రజలకు డబ్బు పోయేది కాదు. ఇవాళ బటన్ నొక్కుతున్నాం.. నేరుగా మీ (లబ్ధిదారుల) ఖాతాల్లోకి డబ్బులు వస్తున్నాయి.

చేయూతతో 5.82 లక్షల మందికి ఆర్థిక సాధికారత

- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ప్రభుత్వం అందజేసే డబ్బుతో చిన్న వ్యాపారాలు పెట్టుకోవాలా? జీవనోపాధికి వాడుకోవాలా? అన్నది పూర్తిగా మహిళల నిర్ణయానికే వదిలేశాం. అయితే, చిన్న వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి సాంకేతిక, బ్యాంకుల పరంగా మార్కెటింగ్ పరంగా ప్రభుత్వం సహకారం అందిస్తోంది.
- కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారికి ఐటీసీ, హిందుస్థాన్ లీవర్, ప్రాక్టర్ అండ్ గాంబెల్, రిలయన్స్ లాంటి కార్పొరేట్ కంపెనీలతో టై అప్ చేశాం. మార్కెటింగ్‌లో శిక్షణ ఇవ్వడంతోపాటు బ్యాంకులతో రుణాలు అందించేలా చేస్తున్నాం. ప్రతి అక్కా, చెల్లెమ్మ రూ.7 వేల నుంచి రూ.10 వేలు ప్రతినెలా ఆదాయం పొందడానికి మార్గాన్ని చూపిస్తున్నాం.
- ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల కొనుగోలుకు సహకరిస్తున్నాం. వీరిని ప్రోత్సహించేందుకు అమూల్ సంస్థతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాం. గతంలో కన్నా కనీసం లీటర్ పాలకు రూ.5–15 ఎక్కువ రేటుకు అమూల్ సంస్థ కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అమూల్ రంగ ప్రవేశం చేశాక ఇప్పుడు హెరిటేజ్ సంస్థ కూడా రేట్లు పెంచక తప్పని పరిస్థితి కూడా వచ్చింది.
- వైఎస్సార్ ఆసరా, చేయూత ద్వారా అందిన డబ్బుతో 1.10 లక్షల మంది మహిళలు కిరాణా దుకాణాలు పెట్టారు. మరో 60,995 మంది వస్త్ర వ్యాపారం చేసుకుంటున్నారు. 2.96 లక్షల మంది ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు పెంచుకుంటూ సంపాదిస్తున్నారు. 1.15 లక్షల మంది ఇతర జీవనోపాధి మార్గాల్లో ఉపాధి పొందుతున్నారు. మొత్తం 5,82,662 మంది ఆర్థిక సాధికారత సాధించడానికి వైఎస్సార్ చేయూత పథకం ఉపయోగపడింది.



ప్రజల జేజేల మధ్య చేయూత సభకు చేరుకుంటున్న సీఎం వైఎస్ జగన్... చేయూత పథకం లబ్ధిదారులతో సీఎం జగన్, చిత్రంలో మంత్రి రోజా, ఎమ్మెల్సీ భరత్..


సభలో మాట్లాడుతున్న సీఎం జగన్

వెన్నుపోటు, దొంగ ఓట్లకు బాబు కేరాఫ్

కేంద్రంలో చక్రం తిప్పానని చెప్పే ఆయన కుప్పానికి మంచి నీళ్లైనా ఇచ్చారా!

కుప్పం వేదికగా మూడో విడత వైఎస్సార్ చేయూత నిధులు విడుదల చేస్తూ సీఎం వైఎస్ జగన్


కుప్పంలో చేయూత బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఒక భాగం

కుప్పం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: కేంద్రంలో చక్రం తిప్పానని చెప్పే చంద్రబాబు.. తాను 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 33 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండడానికి కారణమైన కుప్పం నియోజకవర్గంలో ప్రజలు పంపులు తిప్పితే తాగడానికి నీరు వచ్చే పరిస్థితిని మాత్రం తీసుకురాలేకపోయారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రపతులను.. ప్రధాన మంత్రులను కూడా తానే నియమించానని చెప్పుకునే ఆయన సొంత నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబు అనుభవం అంతా ప్రతి ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించడానికి మాత్రం బాగా ఉపకరించిందని ఈ జిల్లాలో కథలు కథలుగా చెబుతారని ఎద్దేవా చేశారు. వెన్నుపోటు, దొంగ ఓట్లకు 30 ఏళ్లుగా కేరాఫ్ అడ్రస్ చంద్రబాబే అని చెప్పారు. రాష్ట్రంలో 45–60 ఏళ్ల మధ్య ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు అందించే వైఎస్సార్ చేయూత పథకం మూడో విడత నిధులను చిత్తూరు జిల్లా కుప్పంలో శుక్రవారం ఆయన విడుదల చేశారు. కంప్యూటర్‌లో బటన్ నొక్కి 26,39,703 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.4,949.44 కోట్లు నేరుగా జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలంలో తమ బతుకులు బాగుపడ్డాయని లబ్ధిదారులు స్వయంగా చెప్పే ఈ చేయూత పండుగ కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు. ఈ వేదికపై నుంచి సీఎం వైఎస్ జగన్ ఇంకా ఏం చెప్పారంటే..

కుప్పంపై కూడా బాబుకు వెన్నుపోటు ప్రేమే

- సొంత మామ మీద చంద్రబాబు చూపించే వెన్నుపోటు ప్రేమే కుప్పం మీద కూడా చూపారు. ఇంతకాలం కుప్పం నుంచి తనకు కావాల్సింది పిండుకున్నాడు. ప్రజలకు ఏం చేయాలన్న దానిపై మాత్రం ఆలోచించ లేదు. 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా కుప్పంలో కరువుకు పరిష్కారం చూపలేకపోయారు.
- కుప్పంలో కరువు, నీటి సమస్య నివారణకు హంద్రీ–నీవా జలాలను తీసుకురావడం ఒక్కటే పరిష్కారం అని తెలిసినా.. అది చేస్తే ప్రజలు తన మాట వినరని భయపడిపోయారు. అందుకే ఆ హంద్రీ–నీవా పనులకు ఆయనే అవరోధంగా మారారు. ఎన్నికలు వచ్చేసరికి తన పార్టీకి చెందిన వారికి మాత్రం కాంట్రాక్టు ఇచ్చి వందల కొద్దీ ట్రాక్టర్లతో నియోజకవర్గంలో తాగునీరు సరఫరా చేశానని చెప్పుకొని, దొంగ అకౌంట్లతో దోచేశారు.

కుప్పంతో మొదలు ప్రతి చోటా బీసీలకు అన్యాయమే..

- కుప్పం నియోజకవర్గంలో అత్యధికులు బీసీలే ఉన్నారు. ఈ నియోజకవర్గం ఓసీలు పోటీ చేయాల్సిన సీటు కాకపోయినా.. బీసీలకు ఇవ్వకుండా అన్యాయం చేస్తూ తనే లాక్కొన్నారు. బీసీలకు న్యాయం చేశానని రెండు రోజుల క్రితం చంద్రబాబు పెద్ద పెద్ద డైలాగ్‌లు చెప్పాడు.
- 1983 నుంచి 2019 వరకూ ఈ 36 సంవత్సరాల్లో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కుప్పం అసెంబ్లీ టికెట్‌ను బీసీలకు ఇవ్వలేదు. ఇది బాబు మార్కు సామాజిక న్యాయం. కుప్పంతో మొదలు పెడితే బీసీలకు ప్రతిచోటా అన్యాయం చేశారు. బీసీలను వాడుకుని, విడిచి పెడుతున్నది ఎవరో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి.

బాబు చేయలేనిది మేం చేస్తున్నాం

- కుప్పానికి చంద్రబాబు ఏం చేశాడో చెప్పడానికి ఏమీ లేదు. ఏం చేయలేదో చెప్పడానికి చాలా ఉన్నాయి. ఆరు నెలల్లో హంద్రీ–నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేస్తున్నాం. కుప్పంను మున్సిపాలిటీ చేయడంతో పాటు.. దాని అభివృద్ధి కోసం రూ.66 కోట్లు ఇచ్చింది మీ బిడ్డ జగనే.
- 55 ఏళ్లుగా కలగా మిగిలిపోయిన ఆర్డీఓ కార్యాలయాన్ని ఈ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. రూ.6.5 కోట్లతో రెడ్డిపల్లి– రామకుప్పం విద్యుత్ సబ్‌స్టేషన్ ఇచ్చాం. కొత్తపేట నుంచి డీకే పల్లి రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తి చేశాం. రూ.10 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ పూర్తి చేశాం. ఒకేషనల్ జూనియర్ కాలేజీ పనులు పూర్తి చేసింది.. రాళ్లమడుగూరు జూనియర్ కాలేజీ పనులు పూర్తి చేసింది.. కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయానికి రూ.20 కోట్లు కేటాయించింది కూడా ఈ ప్రభుత్వమే.
- నవరత్నాల పథకాలన్నీ కులం, మతం, ప్రాంతం, రాజకీయం చూడకుండా.. కుప్పంలో అంతా నావాళ్లే అని అమలు చేశాం. రాష్ట్రమంతటితో పాటు కుప్పం నియోజకవర్గానికి వివిధ డీబీటీ పథకాల ద్వారా రూ.866 కోట్లు.. నాన్ డీబీటీ పథకాల ద్వారా మరో రూ.283 కోట్లు.. మొత్తంగా ఈ నియోజకవర్గ ప్రజలకు రూ.1,149 కోట్లు పంపిణీ చేసింది మీ బిడ్డ జగనే.
- ఎమ్మెల్సీగా ఉంటూనే తన ద్వారా కుప్పానికి నాతో అన్నీ చేయిస్తున్న భరత్‌ను ఈసారి ఎన్నికల్లో గెలిపించండి. మంత్రిగా మీ ముందుకు పంపిస్తాను.


ఈ ప్రభుత్వానికీ, ఆ ప్రభుత్వానికి తేడా గమనించండి

- సమాజాన్ని చంద్రబాబు చూస్తున్న విధానానికీ, మీ ఈ ముఖ్యమంత్రి చూస్తున్న విధానానికీ మధ్య తేడాను ప్రజలు గమనించాలి. అభివృద్ధి అన్నది ప్రతి ఇంట్లో పిల్లల చదువులో, రైతుల్లో, ఆరోగ్య రంగంలో, అక్కచెల్లెమ్మల సాధికారతలో, అవ్వాతాతల సంక్షేమంలో కనిపించాలి. సామాజిక వర్గాల ఆర్తిని ఈ ప్రభుత్వం అర్థం చేసుకుని అడుగులు వేస్తోంది. బీసీలంటే బ్యాక్ బోన్ క్లాస్ అని గుర్తించిన ప్రభుత్వం ఇది.
- నవరత్నాలు అమలు, డీబీటీ, పదవులు, కాంట్రాక్టులు.. ఇలా ఏది తీసుకున్నా పారదర్శకత కనిపిస్తుంది. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలకు ఏకంగా చట్టాలు చేసి మేలు చేశాం. కానీ, చంద్రబాబు మాత్రం తనకు కావాల్సిన ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్తపుత్రుడిని చూసుకుంటే చాలనుకున్నారు. ఎవరూ చూపరు, రాయరు.. ప్రజలకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోరని భావించారు.
- చంద్రబాబు చేస్తున్న మోసానికి, అన్యాయానికి ఇక తల వంచేది లేదని కుప్పం ప్రజలు నిర్ణయించుకొని అభివృద్ధికి మద్దతిస్తే ఎలా ఉంటుందో మొన్న జరిగిన స్థానిక ఎన్నికల్లో చూపించారు. అన్నింటా కూడా వైఎస్సార్‌సీపీనే క్లీన్ స్వీప్ చేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే, కుప్పం ప్రజలు దోచుకో.. పంచుకో.. తినుకో.. డీపీటీకి వ్యతిరేకంగా ఓటు వేశారు.

చేతకానితనమా.. చేయకూడదనే దుర్బుద్ధా..

- చంద్రబాబు మాత్రం కుప్పం మున్సిపాలిటీలో కనీసం డబుల్ రోడ్డు కూడా వేయలేకపోయారు. కృష్ణగిరి నుంచి పలమనేరు హైవేకు లింక్ ఇస్తానన్నాడు. అది చేయలేదు. ఎన్నిసార్లు సీఎం అయినా కుప్పంలో రోడ్డు వేసే మనసు లేదు. అయితే ఎన్నికలప్పుడు మాత్రం ఏకంగా కుప్పంలో ఎయిర్‌పోర్టు కడతానని ప్రజల చెవిలో పువ్వు పెట్టాడు.
- జాబు కావాలంటే.. బాబు రావాలని ఈయనే అంటాడు. ఈ నియోజకవర్గం నుంచి నిత్యం 5 వేల మంది ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లొస్తుంటారు. వీరికి సొంత నియోజకవర్గంలో ఉద్యోగాలు, ఉపాధి చూపించాలన్న ఆలోచన ఈయనకు రాదు. చంద్రబాబు ఏ రోజూ ఈ నియోజకవర్గంలో ఉండరు. ఇక్కడకు రారు. పట్టించుకోరు.
- 14 ఏళ్లు సీఎంగా ఉండేందుకు తనకు కుప్పం సహకరించినా, చివరకు రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు చేయలేకపోయారు. చివరకు రెవెన్యూ డివిజన్ కోసం జగన్‌కు లేఖ రాస్తాడు. మీ కోసం కుప్పంను రెవిన్యూ డివిజన్ చేశాం. చంద్రబాబు కంటే చేతకాని నాయకుడు ఎక్కడైనా ఉంటాడా? చేయకూడదనే నాయకుడు ఎక్కడైనా ఉంటాడా? దీన్ని చేతకానితనం అనాలా? లేక చేయకూడదనే దుర్బుద్ధి అనాలా? కుప్పంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ లేదు.. మెడికల్ కాలేజీ లేదు.


పుట్టింటోళ్లు కూడా ఇలా ఆదుకోలేదు



మూడేళ్ల క్రితం వరకు మా కుటుంబంలో నేను కూలీ పనులే చేసుకునేదాన్ని. చేయూత పథకంలో నాకు మొదటి విడతలో రూ.18,750 ఇచ్చారు. దానికి బ్యాంకు లోన్ కలిపి ఒక ఆవును కొనుక్కున్నాను. రెండో విడత వచ్చిన డబ్బులతో గడ్డి కటింగ్ మెషిన్ తీసుకొన్నాను. మా మహిళా సంఘం గ్రూప్ సీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్‌కు వచ్చింది. బ్యాంకు వారు మాకు రూ.20 లక్షలు ఇస్తే నాకు రూ.2 లక్షలు వచ్చాయి. దాంతో మరో నాలుగు ఆవులు కొనుక్కున్నా. స్త్రీనిధి డబ్బులు కూడా వచ్చాయి. మా పాపకు విద్యా దీవెన డబ్బులు వచ్చాయి. తను బీఎస్సీ (హార్టికల్చర్) చదువుతోంది. ఇవాళ నేను మొత్తం 10 ఆవులతో రోజుకు 110, 120 లీటర్ల పాలు పోస్తున్నాను. ఖర్చులు పోను నెలకు రూ.60 వేలు మిగులుతున్నాయి. ఈ ఘనత మా జగన్‌మోహన్‌రెడ్డిదే. నా పుట్టింటి వాళ్లు కూడా ఇలా సాయం చేయలేదు. మళ్లీ మళ్లీ జగన్‌నే సీఎంగా గెలిపించుకుందాం.

– సుబ్బమ్మ, గుడిపల్లె మండలం, మహాలక్ష్మి గ్రూపు సభ్యురాలు


ఈసారి కూడా జగనే సీఎం..



గతంలో మేం కూలికి వెళ్లే వాళ్లం. మాకు మొదటి విడత చేయూత పథకం కింద ఇచ్చిన డబ్బుతో ఆవును కొనుక్కున్నా. రెండో విడతలో వచ్చిన డబ్బుతో మరో ఆవును కొనుక్కుని నెలకు రూ.15 వేలు సంపాదిస్తున్నా. ఇప్పుడు మా ముఖ్యమంత్రి అన్న ఉన్నారన్న ధైర్యం మాకు ఉంది. నేను, మా ఆయన.. ఇద్దరం ప్రతి రోజూ మిమ్మల్ని తలుచుకుంటాం. వాళ్ల మేనమామ (సీఎం) వల్ల పిల్లలు కూడా పెద్ద చదువులు చదువుతున్నారు. ఇప్పుడు మూడో విడత వచ్చే డబ్బులతో మరో ఆవును కొనుక్కుంటాను. మీ వల్ల పాలకు కూడా మంచి ధర వస్తోంది. మా మహిళలతో పాటు ప్రతి ఒక్కరూ మీతోనే ఉంటారు. మళ్లీ కూడా మీరే సీఎం.

– మరియమ్మ, బంగారుపాళ్యం, చిత్తూరు జిల్లా


ప్రజల కష్టాలన్నీ తీరేలా మంచి పాలన



జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఇప్పుడు నేను ప్రాతినిధ్యం వహిస్తున్న విశాఖపట్నం జిల్లా మాడుగుల నియోజకవర్గం కే.కోటపాడులో వైఎస్సార్ చేయూత పథకం ప్రకటించారు. ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వెంటనే సంతృప్త స్థాయిలో కులం, మతం, రాజకీయాలు చూడకుండా అందరికీ పథకాలు వర్తింప చేస్తూ అండగా నిలుస్తున్నారు. బటన్ నొక్కి లక్షలాది మంది మహిళలకు వారి అకౌంట్లలోకి నగదు జమ చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల కష్టాలన్నీ తీరేలా మంచి పరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కు రాష్ట్ర ప్రజలందరి తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

టీడీపీ వాళ్లకూ లబ్ధి కలిగించాం



చంద్రబాబూ.. నువ్వు పులివెందులకు వెళ్లొచ్చు కానీ, సీఎం కుప్పం రాకూడదా? మీ మామ దయాదాక్షిణ్యాలతో ఇక్కడ రంగస్వామినాయుడనే పెద్ద మనిషి ఎమ్మెల్యేగా ఉంటే ఆయనతో బలవంతంగా రాజీనామా చేయించి, సులువుగా గెలవచ్చని ఇక్కడ పాతుకుపోయావు. ఇక్కడి బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలకు అన్యాయం చేశావు. వైఎస్ జగన్ ప్రభుత్వం కులం, మతం, పార్టీలు, రాజకీయాలు చూడకుండా టీడీపీ నాయకులకు సైతం సంక్షేమ పథకాలు వర్తింప చేసింది. అందుకే ఈ రోజు కుప్పం ప్రజలు సీఎం జగన్‌కు మంగళ హారతులతో స్వాగతం పలికారు. తప్పనిసరిగా కుప్పంలో విజయం సాధిస్తాం. ఇన్నేళ్లలో చంద్రబాబు ఏం చేశాడని మీరంతా ఆలోచించాలి.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూగర్భ వనరుల శాఖా మంత్రి

బాబు ఎప్పుడూ అందుబాటులో లేరు



33 ఏళ్లుగా చంద్రబాబు ఎమ్మెల్యేగా ఉంటూ.. అందులోనూ 14 ఏళ్లు సీఎంగా పని చేసినప్పటికీ.. ఇక్కడి వారికి ఎప్పుడూ అందుబాటులో లేరు. ఎమ్మెల్యేగా ఇక్కడ ఇల్లు కూడా కట్టుకోలేదు. పైగా సీఎం జగన్ కుప్పంకు ఏం చేశారని అడుగుతున్నారు. మీతోనే (చంద్రబాబు) ఇక్కడ ఇల్లు కట్టుకుంటానని ప్రకటన చేయించారు. ఇది చాలదా.. ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం ఎంతగా కృషి చేస్తున్నారో చెప్పడానికి.

– భరత్, ఎమ్మెల్సీ

దేశంలో రాజ్యాంగ విరుద్ధ పాలన

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్



పుట్టపర్తి టౌన్: మోదీ ప్రభుత్వం వచ్చాక దేశంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగుతోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ విమర్శించారు. మోదీ విధానాల వల్ల ప్రజలకు కరోనా కంటే ఎక్కువ నష్టం వాటిల్లిందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం 'దేశ రక్షణ' పేరిట శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని హనుమాన్ కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బృందాకారత్ హాజరయ్యారు. మొదట సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలతో స్థానిక విద్యాగిరి ఆర్చి నుంచి హనుమాన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ దేశ సంపద కొద్ది మంది చేతుల్లోనే ఉందన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా విభజించు–పాలించు అనే బ్రిటీష్ వారి సూత్రాన్ని పాటిస్తున్నారని విమర్శించారు. ఈ రోజు ఆదాని, అంబానీల సంపద పెరిగిపోతుంటే సామాన్యులు, పేదలు అధిక ధరలు, నిరుద్యోగంతో ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఫాసిస్ట్, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను ప్రజలపై రుద్దుతోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నేతలు వెంకటేశ్వర్లు, రాంభూపాల్, ఓబుళు, ఉమ్మడి జిల్లా నేతలు పాల్గొన్నారు.

శ్రీశైలం, సాగర్ గేట్ల మూత

గోదావరిలో పెరుగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్/పోలవరం రూరల్: కృష్ణానదిలో వరద ప్రవాహం బాగా తగ్గిపోగా గోదావరి వరద పెరుగుతూనే ఉంది. కృష్ణానదిలో వరద తగ్గిపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల గేట్లను శుక్రవారం మూసేశారు. శ్రీశైలం జలాశయానికి 52,368 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. రెండు విద్యుత్ కేంద్రాలలో ఉత్పాదన అనంతరం 67,074 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఎనిమిదివేల క్యూసెక్కులు, హంద్రీ–నీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 885 అడుగుల మట్టంలో 215.8070 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలో 589.70 అడుగుల మట్టంలో 311.1486 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి నీటిమట్టం 31.450 మీటర్లకు చేరింది. స్పిల్‌వే నుంచి 4,84,771 క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు వరద నీటిలో మునిగిపోయాయి.

17న కృష్ణా బోర్డు ఆర్ఎంసీ భేటీ

శ్రీశైలం, సాగర్ నిర్వహణ నియమావళి ముసాయిదా ఖరారే అజెండా



సాక్షి, అమరావతి: కృష్ణా నదీ జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య తరచూ వివాదానికి కారణమవుతోన్న అంశాలను పరిష్కరించడానికి విధివిధానాలను రూపొందించేందుకు కృష్ణా బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్ ఏర్పాటు చేసిన రిజర్వాయర్స్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) అక్టోబర్ 17న సమావేశం కానుంది. హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ఏ ప్రాజెక్టుకు ఎప్పుడు నీటిని విడుదల చేయాలనే అంశంపై నియమావళి (రూల్ కర్వ్), విద్యుత్ ఉత్పత్తి, వరద జలాల మళ్లింపుపై విధివిధానాలను రూపొందించి ముసాయిదా నివేదిక ఇవ్వడానికి ఏర్పాటు చేసిన ఆర్ఎంసీ ఇప్పటికే నాలుగు సార్లు సమావేశమైంది. ముసాయిదా నివేదికను ఖరారు చేసేందుకు ఆగస్టు 23న సమావేశం కావాలని ఆర్ఎంసీ చైర్మన్ ఆర్కే పిళ్లై తొలుత నిర్ణయించారు. కానీ, ఆ సమావేశం వాయిదా వేయాలని రెండు రాష్ట్రాలు కోరడంతో ఇప్పటికే నాలుగుసార్లు వాయిదా వేశారు. తాజాగా ఈ నెల 27న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణ సర్కార్ మళ్లీ వాయిదా వేయాలని కోరింది. దీంతో అక్టోబర్ 17వ తేదీకి సమావేశాన్ని వాయిదా వేసింది. ఈ సమావేశంలో ముసాయిదా నివేదికను ఖరారు చేసి కృష్ణా బోర్డుకు పంపనుంది. బోర్డు ఆమోదం తెలిపిన తర్వాత ఆ నివేదిక మేరకు ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లను బోర్డు నిర్వహించనుంది.

'ఫ్యామిలీ డాక్టర్'తో ప్రజలకు వైద్యసేవలు చేరువ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి: గ్రామీణ పేదలకు వైద్య సేవలను చేరువ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రూపొందించారని వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన సముదాయంలో ఉన్న వైద్య శాఖ కార్యాలయంలో శుక్రవారం ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లకు ఇంటెన్సివ్ ట్రైనింగ్ నిర్వహించారు. వైద్య శాఖలోని వివిధ విభాగాల పనితీరు, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం, ఇతర ఆరోగ్య కార్యక్రమాలను కృష్ణబాబు వివరించారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయడం కోసం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రతి క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, నలుగురు ఆశా వర్కర్‌లు పని చేస్తారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ప్రతి గ్రామాన్ని పీహెచ్‌సీ వైద్యుడు నెలలో రెండుసార్లు సందర్శిస్తారని తెలిపారు. గ్రామ స్థాయిలో నయం కాని ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తామన్నారు. ఈ బాధ్యతను విలేజ్ ఆరోగ్య మిత్ర చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య కార్యదర్శి రవిచంద్ర, ఆరోగ్యశ్రీ సీఈవో హరేందిరప్రసాద్ పాల్గొన్నారు.

20 వేలమందికి ఉచిత అప్రెంటీస్‌షిప్

ఉన్నత విద్యామండలి, టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ లిమిటెడ్ ఎంవోయూ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 20 వేలమంది విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్‌లను ఉచితంగా అందించడం కోసం టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ లిమిటెడ్‌తో శుక్రవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత అప్రెంటీస్‌షిప్‌తో పాటు విద్యార్థులకు రూ.మూడువేల ఉపకారవేతనం ఇస్తారని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్–1 ప్రొఫెసర్ రామమోహనరావు సమక్షంలో తాను, టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ లిమిటెడ్ రీజినల్ హెడ్ రోహిత్ డోగ్రా ఈ ఎంవోయూపై సంతకాలు చేసినట్లు వివరించారు.

తండాల్లో కిడ్నీ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు



సాక్షి, అమరావతి: గిరిజన తండాల్లో కిడ్నీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు చెప్పారు. కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండలంలోని తండాల్లో కిడ్నీ సమస్యలు తీవ్రంగా ఉన్నట్టు గుర్తించామని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం ఎ.కొండూరు మండలంలోని చీమలపాడు పెద్ద తండా, మాన్‌సింగ్ తండా, మత్రియ తండా తదితర తండాల్లో పర్యటించి కిడ్నీ బాధితుల సమస్యలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. అక్కడ భూగర్భ జలాల కారణంగా ప్రజలు కిడ్నీ రోగాల బారిన పడుతున్నట్లు తేలిందన్నారు. ఎ.కొండూరు మండలంలోని తండాల్లో కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. కృష్ణా నది నుంచి ఎ.కొండూరు తండాలకు పైప్ లైన్ ద్వారా నేరుగా మంచినీరు అందించే ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు చెప్పారు. ఇందుకోసం రూ.38 కోట్లు అవుతుందని తెలిపారు. ఈ అంశం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన చేపట్టి కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చూపేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. కృష్ణా జలాలు పైప్‌లైను ద్వారా అందించే వరకు ట్యాంకర్లతో మంచినీరు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్ర నిధులను బాబు ప్రభుత్వం దిగమింగేసింది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

రేణిగుంట(తిరుపతి): రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధులను చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లో దిగమింగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆరోపించారు. జనపోరు యాత్రలో భాగంగా రేణిగుంటలో ఆయన ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాని మోదీ 8 ఏళ్లుగా చేస్తోన్న సుపరిపాలన దేశ రాజకీయాల్లో చారిత్రాత్మకమన్నారు. అనంతరం తపాలా కార్యాలయంలో నూతన పోస్టు కార్డును ఆవిష్కరించారు.

కామ, క్రోధ, లోభములు ఆత్మను నాశమును చేయును. అవి నరకప్రాప్తికి హేతువులు కావున, వానిని వదలి వేయవలెను.

– భగవద్గీత

సాక్షి

శనివారం, సెప్టెంబర్, 24

పీఎఫ్‌ఐపై కొరడా!

గత కొన్నేళ్లుగా ఉగ్రవాద ఆరోపణలు ఎదుర్కొంటున్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)ను నిషేధించడానికి కేంద్రం సిద్ధపడినట్టు కనబడుతోంది. ఆ సంస్థ కార్యాలయాలపై, నేతల ఇళ్లపై దేశవ్యాప్తంగా జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), ఈడీ గురువారం ఏకకాలంలో దాడులు చేశాయి. మొత్తంగా 15 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఈ సోదాలు చోటు చేసుకున్నాయి. 93 చోట్ల సాగిన దాడుల్లో మొత్తం 109 మందిని అదుపులోకి తీసుకోవటంతోపాటు కీలకమైన పత్రాలు, నగదు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని ఆ విభాగాలు అంటున్నాయి. దాడులను నిరసిస్తూ పీఎఫ్ఐ కార్యకర్తలు కేరళ, కర్ణాటకల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు, ఉగ్రవాదం ఆరోపణలు వచ్చినప్పుడు దర్యాప్తు విభాగాలు రంగంలోకి దిగడం సర్వసాధారణమే. అయితే పీఎఫ్ఐ ఇతర ఉగ్రవాద సంస్థల మాదిరి రహస్య కార్యకలాపాలు సాగించటం లేదు. సోషలిస్టు డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) అనే పార్టీకి అనుబంధంగా ఉంటోంది. అలాగని ఆ సంస్థపై వచ్చిన ఆరోపణలు సాధారణమైనవి కాదు. 2011లో మహమ్మద్ ప్రవక్తపై కేరళలోని ఒక ప్రొఫెసర్ ప్రశ్నపత్రంలో అనుచితమైన ప్రశ్న ఇచ్చాడని ఆరోపిస్తూ పీఎఫ్ఐ కార్యకర్తలు ఆయన చేయి నరికారు. కేరళలో ఒక హత్య కేసులో పీఎఫ్ఐ కార్యకర్తలకు యావజ్జీవ శిక్ష పడింది. మొత్తం 30 హత్యల్లో పీఎఫ్ఐ ప్రమేయం ఉన్నట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. కర్ణాటకలో ఆరెస్సెస్ కార్యకర్తనూ, బజరంగ్‌దళ్ కార్యకర్తనూ 2016లో హతమార్చిన కేసుల్లోనూ, 2019లో తమిళనాడులో ఒకరిని హత్యచేసిన ఉదంతంలోనూ పీఎఫ్ఐ కార్యకర్తలు అరెస్టయ్యారు. బలవంతపు మత మార్పిడికి ప్రయత్నించినట్టు కేరళలో 2016లో కేసు నమోదైనా తగిన సాక్ష్యాధారాలు లభించలేదు. కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో పని చేసే మూడు సంస్థలు విలీనమై 2007లో పీఎఫ్ఐగా ఏర్పడగా అదెప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ సంస్థనుంచే మరో రెండేళ్లకు రాజకీయ పక్షం ఎస్‌డీపీఐ ఆవిర్భవించింది. ముస్లింలు, దళితులు, ఇతర అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు ఆ రెండు సంస్థలూ ప్రకటించుకున్నాయి. కర్ణాటకలో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంపై మాత్రమే కాదు, గతంలో కాంగ్రెస్, జేడీఎస్‌ల పాలన సాగినప్పుడు కూడా వాటి విధానాలపై పోరాడిన చరిత్ర పీఎఫ్ఐకి ఉంది. అయినా పీఎఫ్ఐతో అంటకాగుతున్నట్టు ఆ మూడు పక్షాలూ పరస్పరం ఆరోపించుకుంటూ ఉంటాయి.

ఏ పార్టీ అయినా, సిద్ధాంతమైనా అప్పుడున్న దేశకాల పరిస్థితుల్లో, అప్పుడు తలెత్తిన సమస్యలకు జవాబుగా తెరమీదికొస్తాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత, అనంతర హింసాకాండ, ముస్లిం మైనారిటీల్లో ఏర్పడిన అభద్రతా భావన పర్యవసానంగా పీఎఫ్ఐ వచ్చింది. 2001లో సిమి నిషేధం తర్వాత పీఎఫ్ఐగా ఆ సంస్థకు చెందినవారు సమీకృతులయ్యారని కేరళ ప్రభుత్వం 2012లో ఆరోపించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింస, ప్రతిహింసలకు తావులేదు. సమాజంలో ఒక సమూహానికి అన్యాయం జరుగుతున్నదని భావించినప్పుడు దానిపై చట్టబద్ధ విధానాల్లో పోరాడాలి తప్ప ఉద్రిక్తతలు రెచ్చగొట్టి, అరాచకం సృష్టించే ప్రయత్నం చేయకూడదు. పీఎఫ్ఐపై మొదటి నుంచీ ఇటువంటి ఆరోపణలు వస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు 2010లోనే పీఎఫ్ఐ కార్యకలాపాలపై నిఘా మొదలైంది. అస్సాం, మణిపూర్‌వంటి ఈశాన్య రాష్ట్రాలతోసహా మొత్తం 22 రాష్ట్రాల్లో ఆ సంస్థ కార్యాలయాలున్నాయి. ఢిల్లీలో ప్రధాన కార్యాలయం ఉంది. ఈ స్థాయిలో సంస్థ విస్తరించినా కేరళ, కర్ణాటకల్లో ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో తప్ప ఇతరచోట్ల గణనీయమైన బలం లేదు. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా, ఉడిపి ప్రాంతాల్లో పీఎఫ్ఐ మద్దతుతో 2018 స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన ఎస్‌డీపీఐకి 121 స్థానాలు వచ్చాయి. ఉడిపి జిల్లాలో మూడు పురపాలక సంస్థలు ఆ పార్టీ ఖాతాలో పడ్డాయి. 2013లో మైసూర్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో రెండో స్థానంలో నిలిచినా 2018 నాటికి అది మూడో స్థానంలోకి పోయింది. ఇతరచోట్ల అత్యంత స్వల్ప శాతం ఓట్లు వచ్చాయి. ఈ ధోరణి ఏం చెబుతోంది? అణగారిన వర్గాలు, మైనారిటీల కోసం పోరాడుతున్నట్టు పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ చెప్పుకుంటున్నా ఆ వర్గాల నుంచి పెద్దగా మద్దతు లభించడంలేదు సరిగదా అది క్రమేణా తగ్గుతున్నదని రుజువవుతోంది.

ఎన్ఐఏ, ఈడీల ఆరోపణలు సరికాదని పీఎఫ్ఐ అంటున్నది. సంఘ్ పరివార్‌ను సంతోషపెట్టడానికే తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తోంది. అందులో నిజానిజాల సంగతెలా ఉన్నా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇతర పార్టీల, ప్రజాస్వామిక సంస్థల మద్దతు తమకెందుకు లభించడంలేదో పీఎఫ్ఐ సమీక్షించుకోవాలి. ఇదే పీఎఫ్ఐతో సంబంధాలున్నాయన్న ఆరోపణతో కేరళకు చెందిన పాత్రికేయుడు సిద్దిఖీ కప్పన్‌ను రెండేళ్లక్రితం యూపీ సర్కారు అరెస్టు చేసినప్పుడు అది అక్రమమని దాదాపు అన్ని పక్షాలూ ఖండించాయి. ఆయనకు ఈమధ్య బెయిల్ లభించింది. నిషేధం ఒక్కటే అన్నిటికీ పరిష్కారం కాదనీ, అది అప్రజాస్వామికమనీ కేంద్రం కూడా గుర్తించాలి. నేరాలకు పాల్పడే సంస్థలన్నిటిపైనా కఠినంగా వ్యవహరిస్తూనే వాటి తీరుతెన్నులను బట్టబయలు చేయాలి. పీఎఫ్ఐకి ప్రజానీకంలో పెద్దగా మద్దతు లేదని తెలుస్తూనే ఉంది. అటువంటి సంస్థను నిషేధిస్తే ప్రజల్లో ఎంతోకొంత సానుభూతి రావడం తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదని గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీశుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి: బ.చతుర్దశి రా.2.35 వరకు తదుపరి అమావాస్య, నక్షత్రం: పుబ్బ తె.5.46 వరకు (తెల్లవారితే ఆదివారం) తదుపరి ఉత్తర, వర్జ్యం: ప.12.44 నుండి 2.24 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.53 నుండి 7.29 వరకు అమృతఘడియలు: రా.10.56 నుండి 12.38 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

భారత్ జోడో... కాంగ్రెస్‌కు తాడో పేడో

విశ్లేషణ



ప్రవీణ్ రాయ్

పన్నెండు రాష్ట్రాల గుండా 150 రోజుల పాటు సాగేలా కాంగ్రెస్ పార్టీ 'భారత్ జోడో యాత్ర' చేస్తోంది. బీజేపీ హిందుత్వ రాజకీయాల నుంచి దేశాన్ని రక్షించేందుకు దీన్ని చేపట్టినట్టుగా పార్టీ చెబుతోంది. కానీ ప్రజాస్వామ్య ప్రస్తుత పోకడలను చర్చకు పెట్టడం... తద్వారా బీజేపీ ఇమేజ్‌ను దెబ్బతీసి రాజకీయ ప్రయోజనాలను పొందడం; బీజేపీని ఓడించాలంటే ఏ కూటమికైనా తమ మద్దతు తప్పనిసరన్న సంకేతాలను పంపడం; కాంగ్రెస్‌ను గద్దెనెక్కించడం రాహుల్ గాంధీకి మాత్రమే సాధ్యమన్న భ్రమను కార్యకర్తల్లో కల్పించడం అనే మూడు లక్ష్యాలు ఇందులో ఉన్నాయి. పడిపోతున్న రాజకీయ గ్రాఫ్ మళ్లీ ఎగబాకడం మాత్రం పార్టీ వ్యవస్థ ఎంత సమర్థంగా వ్యవహరిస్తుందన్న అంశంపై ఆధారపడి ఉంటుంది.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' సరైన దిశగానే వెళుతున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రాల ఎన్నికల్లో వరుస ఓటములతో కుదేలైన పరిస్థితుల్లో కాంగ్రెస్ ఈ భారత్ జోడో యాత్రతో తన రాజకీయ భవిష్యత్తును వెతుక్కునే పనిలో పడింది. దేశంలోని మొత్తం 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల గుండా వెళ్లే ఈ పాదయాత్ర భారతీయ జనతా పార్టీ 'హిందుత్వ' అజెండా నుంచి దేశాన్ని రక్షించేందుకని కాంగ్రెస్ చెప్పుకుంటోంది. బీజేపీ ప్రభుత్వ విధానాలు, ఆ పార్టీ హిందుత్వ అజెండా రెండూ భారత సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఏటికేడాదీ క్షీణిస్తున్న తన ప్రాభవాన్ని పౌర సమాజం, మేధోవర్గం సాయంతో మళ్లీ పొందేందుకు జరుగుతున్న ప్రయత్నమే కాంగ్రెస్ చేస్తున్న ఈ భారత్ జోడో యాత్ర అని చెప్పక తప్పదు.

స్థానిక ఎన్జీవోలు, ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీపై వారిలో నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ పాలన మొత్తం నిరంకుశ ధోరణితోనే నడిచిందనీ, అత్యవసర పరిస్థితులను తలపించేదేననీ కాంగ్రెస్ చెబుతోంది. తద్వారా 1978 నాటి ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమాన్ని సృష్టించే ప్రయత్నం జరుగుతోంది. ఎంతో ముందుచూపుతో, పక్కా ప్రణాళికతో కాంగ్రెస్ ఈ 'భారత్ జోడో యాత్ర' చేపట్టినా... పడిపోతున్న రాజకీయ గ్రాఫ్ మళ్లీ పైకి ఎగబాకడం మాత్రం ఆ పార్టీ నాయకత్వం, పార్టీ వ్యవస్థ ఎంత సమర్థంగా వ్యవహరిస్తాయన్న అంశంపై ఆధారపడి ఉంటుంది.

నిరాసక్త నేత... పాదయాత్ర!

కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ లేమి ఉందన్నది నిర్వివాద అంశం. 2019 లోక్‌సభ ఎన్నికల ఓటమి నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన ప్రభావం రాహుల్‌గాంధీ యాత్రపై కూడా పడే అవకాశం ఉంది. అలాగే ఈ పాదయాత్ర ద్వారా కాంగ్రెస్‌కు పెద్దగా ప్రయోజనం చేకూరదనేందుకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిగా చెప్పుకోవాల్సింది, అధ్యక్ష పదవిని మళ్లీ చేపట్టే విషయంలో రాహుల్ గాంధీ చూపిన మొండితనం. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలన్న పార్టీ సీనియర్ నేతలు పదేపదే చేస్తున్న విజ్ఞప్తులను తోసిపుచ్చుతూండటం కూడా రాహుల్ గాంధీ నేతృత్వంపై అనుమానాలను రేకెత్తిస్తోంది. రాహుల్ ఆలోచనా ధోరణి ఫలితంగా రాజకీయంగా అతడికి నష్టం చేకూర్చేదిగా పరిణమిస్తోంది.

ఇక రెండో కారణం... తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియాగాంధీ కొనసాగడం వల్ల పార్టీలో రెండు అధికార కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇది పార్టీ కార్యకర్తల్లోనూ, సంప్రదాయ మద్దతుదారుల్లోనూ కొంత గందరగోళాన్ని ఏర్పరుస్తోంది. పూర్తిస్థాయి నేతగా బాధ్యతలు చేపట్టే విషయంలో రాహుల్ గాంధీ ఇప్పటికీ విముఖంగా ఉండటం, అధికార బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఏదీ లేకపోవడం కూడా



రాహుల్‌గాంధీని మాటల నేతగానే మార్చాయే తప్ప... ప్రజలను భారీ ఎత్తున ఆకర్షించే చరిష్మా ఉన్న నేతగా, పార్టీకి అట్టడుగు స్థాయి నుంచి మద్దతు కూడగట్టగల స్థాయి గలవాడిగా మార్చలేకపోయాయి.

నేతృత్వం విషయాన్ని కాసేపు పక్కనబెట్టినా భారత్ జోడో యాత్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించే వనరులు, దానికి తగ్గ ప్రతిష్ఠ కూడా కాంగ్రెస్‌కు లేవనే చెప్పాలి. 2014 ఎన్నికల తరువాత రాజకీయంగా తన ఆధిపత్యాన్ని సాంతం కోల్పోయేందుకు ఉన్న కారణాల్లో ఒకటి వారసత్వ రాజకీయాలు కొనసాగడమైతే... రెండోది మైనార్టీలను బుజ్జగించే విధానాలు. రాజకీయంగా, సైద్ధాంతికంగా ఏర్పడ్డ స్తబ్ధత, పట్టూవిడుపుల్లేని పద్ధతి, పార్టీ వ్యవస్థ కుప్పకూలడం, కీలక నేతలు తండోపతండాలుగా ఇతర పార్టీలకు వెళ్లిపోవడం వంటివి ఇతర కారణాలు. దేశాద్యంతం ఆధిపత్యం చలాయించగలిగే స్థాయిని కూడా కాంగ్రెస్ పార్టీ కోల్పోయింది. సమాజానికీ, పార్టీకీ మధ్య ఉన్న సమాచార వ్యవస్థ కూడా కుప్పకూలిపోయింది. ఈ నేపథ్యంలో 150 రోజుల పాటు సాగే సుదీర్ఘ పాదయాత్ర ఒకటి చేపట్టే ప్రయత్నం చేయడం కొంచెం అమాయకంగానూ, మరికొంచెం అవాస్తవంగానూ అనిపించక తప్పదు.

బీజేపీని ఎదుర్కొగలదా?

భారత్ జోడో యాత్ర ప్రజా ఉద్యమం అని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. పార్టీ లోపలా, బయటా ఉన్న మేధావులు, ఎన్జీవోల మద్దతుతో సాగుతోందని కూడా చెబుతోంది. ఇలాంటి ప్రకటనలే పౌర సమాజపు నిష్పాక్షికత, స్వతంత్రతలపై అనుమానాలు రేకెత్తిస్తాయి. లెఫ్ట్ లిబరల్ పార్టీలతో అంటకాగుతూండే ఎన్జీవోలు, విద్యావేత్తల ముసుగులు తొడుక్కున్న నేతలు కొందరు రాహుల్ గాంధీ యాత్రలో పాల్గొంటూండటం వారి కృత్రిమత్వాన్ని బయటపెడుతోంది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణే లక్ష్యంగా వీరు పని చేస్తున్నారు. తద్వారా అధికారాన్ని, వ్యక్తిగత ప్రయోజనాలను పొందవచ్చునని వీరు భావిస్తున్నారు.

సాక్షికి ప్రత్యేకం

బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత చాలా ఎన్జీవోల జాతకాలు బట్టబయలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఎన్జీవోలు కొన్ని మనీలాండరింగ్‌కు, ఇతర ఆర్థిక అపసవ్యతలకు, భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమైంది. అలాంటి సంస్థలిప్పుడు భారత్ జోడో యాత్రకు మద్దతుగా నిలవడం కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న మర్యాదను మరింత తగ్గించేదిగా మారుతుంది. అది రాజకీయంగా మరింత దిగజారేలా చేస్తుంది. సగం భారతదేశాన్ని చూసేందుకు రాహుల్‌గాంధీ యాత్ర చేపట్టిన సమయమూ అంత ఉచితంగా ఏమీ లేదు. ఎందుకంటే సొంతింట్లో బోలెడన్ని సమస్యలున్నాయి మరి. వాటిని చక్కదిద్దుకోకుండానే... కాసుల కట్టలతో కళకళలాడుతున్న... విస్తృత స్థాయి కార్యకర్తల మద్దతున్న బీజేపీని ఎదుర్కునేందుకు సిద్ధమవడం ఎంతవరకూ సబబు? పోనీ రాజకీయంగా అందరినీ ఆకర్షించే విధానం, కథనం ఏదైనా ఉందా అంటే అదీ లేదు. అందరికీ ఆమోదయోగ్యమైన నేత, కాషాయ పార్టీకి చెక్ పెట్టగల వ్యవస్థాగత నిర్మాణం, అన్ని వర్గాల ఓట్లను కూడగట్టగలిగే చాతుర్యమూ కరవే.

రాహుల్ ఇమేజ్ పెంచేందుకే...

ఆధిపత్య ధోరణలు, ఈగోలపై ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ దృష్టి కేంద్రీకృతమై ఉంది. భారత్ జోడో యాత్ర మొత్తాన్నీ కొంచెం నిశితంగా పరిశీలిస్తే కాంగ్రెస్ మూడు అంశాలను చెప్పేందుకు ప్రయత్నిస్తోందని అర్థమవుతుంది. ఒకటి.. భారతీయ ప్రజాస్వామ్య ప్రస్తుత పోకడలనూ, పెరిగిపోతున్న ఒంటెత్తు పోకడలనూ అంతర్జాతీయ స్థాయిలో చర్చకు పెట్టడం... తద్వారా భారతీయ జనతా పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీసి రాజకీయ ప్రయోజనాలను పొందడం. రెండోది... మీడియా సాయంతో క్షేత్రస్థాయిలో తనకు మద్దతు పెరుగుతోందన్న భ్రమ కల్పించడం ద్వారా... బీజేపీని ఓడించాలంటే ఏ పార్టీ, కూటమికైనా తమ మద్దతు తప్పనిసరి అన్న సంకేతాలను పంపడం. కార్యకర్తల్లో రాహుల్‌గాంధీకి ఉన్న ఇమేజ్‌ను పెంచడం, అందుకోసం ప్రజామద్దతును ఉన్నదానికంటే ఎక్కువ చేసి చూపడం, కాంగ్రెస్ పార్టీని మళ్లీ గద్దెనెక్కించడం రాహుల్‌కు మాత్రమే సాధ్యమన్న భ్రమను కార్యకర్తల్లో కల్పించడం మూడో ఉద్దేశం. అయితే నాయకత్వం పరంగా ఇప్పటివరకూ ఏమీ సాధించని రాజకీయ వారసుడు రాహుల్ గాంధీ కేంద్రంగా కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో యాత్రను చేపట్టడం ఏమంత సత్ఫలితాలు ఇవ్వకపోగా... నష్టం చేకూర్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి!

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు, సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్, న్యూఢిల్లీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇతర భాషలు వాడాలి



కోర్టుల భాష ఇంగ్లీషే. అయినప్పటికీ 75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత, మారాల్సిన అవసరాన్ని నెమ్మదిగా మనం గుర్తించాల్సి ఉంది.

– సంజయ్ ఘోష్, న్యాయవాది

ఇరాన్ మీద కక్ష?



ఎవరైనా జైనాబ్ ఎస్సామ్ అల్-ఖజాలీ గురించి మాట్లాడుతున్నారా? ఈ పదిహేనేళ్ల ఇరాక్ బాలికను అమెరికా దళాలు కాల్చిచంపాయి (21 సెప్టెంబర్). ఆమె ఇరాన్ చేతిలో చనిపోలేదు, కాబట్టి ఆమె కథనం పాశ్చాత్య మీడియాను ఆకర్షించదు.

– హాదీ నస్రల్లా, లెబనాన్ విశ్లేషకుడు

అదేనా మతం చెప్పింది?



వాళ్లు ఇరాన్‌లో మహిళలను చంపేస్తున్నారు. ఇస్లాం ప్రకారం వాళ్లు నిజానికి రక్షించాలి. కానీ వాళ్లదైన ఇస్లాం ప్రకారం స్వేచ్ఛ కోరుకునే మహిళలను చంపుతారు; యెమెన్, లెబనాన్, సిరియా, ఆఫ్రికా, ఇంకా ఇతర చోట్ల తీవ్రవాదానికి నిధులు సమకూరుస్తారు.

– హెంద్ ఫైజల్ అల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

వేరే పేరు పెట్టాలి



రెండు నెలల తర్వాత తన కరోనా టీకా డోసు వేసుకున్నానని, మిగతావారు కూడా తమ గడువు దాటిపోతే వేసుకోవాలనీ సీడీసీ(వ్యాధి నియంత్రణ, నిరోధకత కేంద్రం- అమెరికా) డైరెక్టర్ రోషెల్ వాలెన్స్కీ ట్వీట్ చేశారు. ప్రతి రెండు నెలలకోసారి మీరు తీసుకొమ్మంటున్న 'టీకా' అనేది టీకా కాదు. అదేమిటో నాకు తెలీదు, కానీ అది మాత్రం టీకా కాదు.

– అలెక్స్ బెరెన్సన్, రచయిత

రెండో పని చేయొచ్చా?



విప్రో కంపెనీ 300 మందిని తొలగించింది. 'మూన్‌లైటింగ్' (రెండోపని చేయడం), అదీ ప్రత్యక్ష పోటీదారులకు పని చేస్తున్నారన్న కారణంగా. రెండో పని గురించి పారదర్శక చర్చ జరిపివుండాల్సిం దని కంపెనీ అంటోంది. ఎన్ని కంపెనీలు ఇలాంటి చర్చను ప్రోత్సహిస్తాయి? మూన్‌లైటింగ్ సరైనదేనా? మనకు దీనిమీద నియంత్రణలు ఉండాలా? అసలు ఉద్యోగులకు అర్థవంతమైన చర్చలు జరిపే శక్తి ఉంటుందా?

– పాల్కీ శర్మ, జర్నలిస్ట్

కోల్పోయిన జీవితం



హిజాబ్ పోలీసుల చేతిలో హత్యకు గురైన మహసా అమీనీ కోసం ఇరాన్ వీధుల్లో నిరసన చేస్తున్న గజలే చెలాబీ కూడా భద్రతా బలగాల చేతిలో చనిపోయింది. అమోల్ నగరంలో ఆమె తలలో కాల్చారని తన స్నేహితురాలు నాకు చెప్పింది. ఎంతో జీవితం ముందున్న 32 ఏళ్ల గజలే పర్వతారోహకురాలు.

– మసీహ్ అలినెజాద్, జర్నలిస్ట్

మాయమైనట్టుందే!



డియర్ జేపీ నడ్డాజీ (బీజేపీ అధ్యక్షుడు), మదురై (తమిళనాడు)లో 'ఎయిమ్స్' పనులు 95 శాతం పూర్తిచేసినందుకు ధన్యవాదాలు. అయితే నేనూ, మా మదురై ఎంపీ తొప్పూరు సైట్లో దానికోసం గంటసేపు వెతికాం. ఏమీ దొరకలేదు. చూస్తుంటే ఎవరో బిల్డింగును ఎత్తుకెళ్లినట్టున్నారు.

– బి. మాణిక్కం టాగూర్, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌ఛార్జ్

ప్రగతిశీల వైద్య శిఖామణి

మానవతావాది, పూర్వ ఉపకులపతి, ప్రజా వైద్యులు, అభ్యుదయ వాదిగా 86 సంవత్సరాల జీవితాన్ని గడిపిన డాక్టర్ కొమ్మారెడ్డి రాజా రామమోహన్ రావు పశ్చిమగోదావరి జిల్లా పోతునూరులో 1922లో జన్మించారు. 1951 నుండి 1980 వరకు గడిపిన వైద్యరంగ జీవితం చిరస్మరణీయం. సింగరేణి కాలరీస్ వైద్యాధికారిగా 200 పడకల ఆసుపత్రిని నిర్మించి సింగరేణి కాలరీలో పని చేస్తున్న 60 వేల మంది కార్మికులకు ఆధునిక వైద్యాన్ని అందించారు. సింగరేణి బొగ్గు గనుల చుట్టుపక్కల గ్రామాలను దత్తత తీసుకొని ఉచిత వైద్యాన్ని అందించారు. గుంటూరు మెడికల్ కాలేజీ, సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఆయా కళాశాలల అభివృద్ధికి పునాదులు వేశారు.



డాక్టర్ కొమ్మారెడ్డి రాజా రామమోహన్ రావు

1982–86 మధ్య ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా విద్యారంగంలో పలు మార్పులు, సవరణలకు కారకులయ్యారు. దేశంలో ప్రప్రథమంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 'శాస్త్రీయ సోషలిజం అధ్యయన కేంద్రా'న్ని నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుంది. అలాగే 'మహాయాన బౌద్ధ కేంద్రం' కూడా ఆయన పదవీ కాలంలోనే నెలకొల్పబడింది. సర్జన్స్ అంతర్జాతీయ కాలేజ్, ఇంటర్నేషనల్ మెడికల్ స్టడీస్ అకాడమీ, భారత సర్జన్ల సంఘం, భారత యూరోలాజికల్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జెనీటో- యూరినరీ సర్జరీ(అమెరికా) శిక్షణాబోర్డు తదితర సంఘాలలో అనేక బాధ్యతలు నిర్వహించారు. ఇంగ్లండ్, అమెరికా, జపాన్ తదితర చోట్ల జరిగిన వైద్య సభలకు హాజరయ్యారు.

అటు వైద్యరంగానికీ, ఇటు విద్యారంగ వ్యాప్తికీ రామమోహన్ రావు చేసిన కృషికి అనేక అవార్డులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. 1984లో యార్లగడ్డ రాజ్యలక్ష్మి, వెంకన్న చౌదరి కళాపీఠం తరపున జాతీయ అవార్డు లభించింది. సామాజిక, వైద్య సేవ రంగాలలో ఆయన చేసిన కృషికిగాను 1992లో ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ బీసీ రాయ్ అవార్డును పొందారు. శాస్త్రవిజ్ఞానాన్ని గ్రామ సీమలకు చేర్చాలన్న లక్ష్యంతో 'జన విజ్ఞాన వేదిక' ఉపాధ్యక్షులుగా పనిచేశారు.

వీరి నిరాడంబర జీవితం, సరళ స్వభావం, సేవా తత్పరత, ఆపన్నుల పట్ల ఆదరణ, ప్రగతిశీల ఉద్యమాల పట్ల ఆయనకున్న నిబద్ధత వలన ఒకానొక సందర్భంలో భారత రాష్ట్రపతి పదవికి వామపక్ష అభ్యర్థిగా ఆయన పేరును పరిశీలించిన సంగతి కొద్ది మందికి మాత్రమే తెలుసు.

రాజా రామమోహన్ రావు తండ్రి కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి 1937 లోనే శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జరిపిన రైతు రక్షణ యాత్ర చారిత్రాత్మకం. జీవితాన్ని స్వార్థం కొరకు కాక లోకహితం కొరకు ధారపొయ్యాలన్న తండ్రి మాటను శిరోధార్యంగా తీసుకున్నారు రామమోహనరావు. ఆయన ఆశయాలను మనమూ కొనసాగిద్దాం.

– వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, జనచైతన్య వేదిక ఏపీ అధ్యక్షులు । 99499 30670

(రేపు కొమ్మారెడ్డి శత జయంతి సందర్భంగా గుంటూరు, వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సెమినార్ జరుగనుంది.)

చల్నేదో బాల్ కిషన్

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

కతలు జెప్తున్నరు. చెవుల పూలు బెడ్తున్నరు. చెట్టు పేరు జెప్పి కాయలమ్ముకుంటున్నరు. కాయలను గాదు. ఏక్‌దమ్ పండ్లనే అమ్ముకుంటున్నరు.

ఎవలమ్ముకుంటున్నరు? ఎందుకమ్ముకుంటున్నరు? ఎవరంటె మన లీడర్లే. ఇంతకు గా చెట్టేంది? గది ఏందో గాదు. నిజాం చేతుల్లకెల్లి గుంజుకొన్న తెలంగా ననే. బందూకులు బట్కోని రజాకార్ల తోని కొట్లాడినోల్ల గురించి మొన్నటిదాంక తప్పిజారి ఒక్క లీడర్ గుడ్క మాట్లాడలే. గియ్యాల గా లీడర్లే తీస్ మార్ కాన్ లెక్క ఫోజు గొడ్తున్నరు. గాల్లే నిజాం సర్కార్‌ను కూలగొట్టి తెలంగానకు సతంత్రం తెచ్చినట్లు మాట్లాడ్తున్నరు.

గా దినం అయితారం. అంబటాల్లయింది. కడ్పులు ఎల్కలు చెంగడ బింగడ దుంకుతున్నయి. తలె ముంగట గూసున్న. కోడికూర తోని నా పెండ్లాం బువ్వ బెట్టింది. అంచుకు ఎల్లిగడ్డతొక్కు ఏసింది. సరింగ గప్పుడే మా తాత బోన్గిరి కెల్లి వొచ్చిండు. గాయిన పెండెం వాసుదేవ్, జైని మల్లయ్య గుప్త, గుండా కేశవులు, ముత్యం ప్రకాశ్, మాదాసు యాదగిరి అసువంటోల్లతోని గల్సి బందూకు బట్టి రజాకార్లతోని కొట్లాడినోడు.

''తాతా! బువ్వ తిందురాయె'' అన్న. గాయిన కాల్లు చేతులు గడుక్కోని నా పక్క పొంటి వొచ్చి గూసున్నడు. బువ్వ దినుకుంట ముచ్చట బెట్ట బట్టిండు. ''ఇంతకుముందు టీఆర్ఎస్ మోటర్ బోయిన తొవ్వ మీదికెల్లే కద్మ పార్టీలు బొయ్యేటియి. గని గిప్పుడు బీజేపీ ఏసిన తొవ్వ మీది కెల్లే టీఆర్ఎస్ మోటార్ బొయ్యే గతి బట్టింది'' అని అన్నడు.

''తాతా! నువ్వెప్పుడు రాజకీయాలే మాట్లాడ్తవేందే''


''రాజకీయాలు గానిదేమన్న ఉన్నాదిర. బారతం రాజకీయమే. రామాయనం గూడ రాజకీయమే''.

''రామాయనం రాజకీయమెట్ల అయితదే?''

''రాముని దిక్కు దుంకె బట్కి విబీషనుడు లంకకు రాజయిండు. నిజం జెప్పాలంటె పార్టీ ఫిరాయింపులు గాయినతోనే షురువైనయి''

''బీజేపీ ఏసిన తొవ్వ మీదికెల్లే టీఆర్ఎస్ మోటర్ బోయిందంటివి. గదేందో జెర కుల్లకుల్ల జెప్పు తాతా''

''మొన్న 17 తారీకు పరేడ్ మైదాన్ల సెంటర్ల ఉన్న బీజేపీ సర్కార్ తెలంగాన విమోచన దినం జేసింది. గా దాన్కి సెంటర్ హోం మంత్రి అమిత్ షా వొచ్చిండు. 'మా సర్కారొస్తె సెప్టెంబర్ 17 తారీకు నాడు తెలంగాన విమోచన దినం జేస్తమన్నోల్లు గాల్ల సర్కారొచ్చినంక రజాకార్ల బయంతోని తెలంగాన విమోచన దినం జెయ్యలేదు. గియ్యాల మేము జేస్తుంటె అన్ని పార్టీలు జేస్తున్నయి' అన్కుంట గాయిన స్పీచ్ గొట్టిండు''.



''ఇంతకుముందు కేసీఆర్ తెలంగాన విమోచన దినం ఎందుకు జెయ్యలేదు?''

''విమోచన గాదు, మన్నుగాదు. గది జేస్తేంది, చెయ్యకుంటేంది. గదొక పెద్ద ఎజెండనా? గది జెయ్యకుంటె గీ దేసం ఏమన్న మున్గుతదా అని అసెంబ్లీల అన్న కేసీఆర్ ఇయ్యాల బీజేపీ సెట్ జేసిన ఎజెండలకే వొచ్చిండు. సమైక్యత వజ్రోత్సవం అన్కుంట కేసీఆర్ 17 తారీకు పబ్లిక్ గార్డెన్ల మూడు రంగుల జెండ ఎగిరేసిండు. 'మత పిచ్చిగాల్లు దేసంను ఆగమాగం జేస్తున్నరు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు ఇస్తం. దలిత బందు తీర్గనే గిరిజన బందు బెట్టి ఒక్కో గిరిజన కుటుంబానికి పది లచ్చల రూపాయల వొంతున ఇస్తం' అన్కుంట కేసీఆర్ స్పీచ్ గొట్టిండు'' అని మా తాత జెప్పిండు.

''హుజూరాబాద్ బై ఎలచ్చన్లు వొచ్చినప్పుడు దలిత బందు అన్నడు. మునుగోడు బై ఎలచ్చన్లు రాంగనే గియ్యాల గిరిజన బందు అంటున్నడు తాతా!''

''అవ్ ఎలచ్చన్లు వొస్తేనే ముక్యమంత్రికి జెనం యాది కొస్తరురా''

''అమిత్ షాను బీజేపోల్లు అబినవ సర్దార్ పటేల్ అంటె, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ కెసీఆర్‌ను అబినవ అంబేడ్కర్ అని అంటున్నడే''

''వారీ! ఎల్క తోలును ఒక్క తీర్గ యాడాది ఉత్కితె యాడనన్న తెల్లగైతదా? అమిత్ షా సర్దార్ వల్లభాయ్ పటేలైతడా? కేసీఆర్ యాడనన్న అంబేడ్కర్ అయితడా?'' అని మా తాత అడిగిండు.

బువ్వ దిన్నంక గాయిన మంచం మీద ఒరిగిండు.

తోక: పొద్దు మీకింది. ఎప్పటి లెక్కనే చౌరస్తల ఉన్న పాన్ డబ్బకాడ్కి బోయిన. గాడ పాన్లు దినుకుంట మా దోస్తులు ముచ్చట బెడ్తున్నరు. ''నమీబియాకెల్లి గాలిమోటర్ల ఎన్మిది చిర్తపులులను మనదేసం దెచ్చింగ్రు. గవ్విట్ల మూడు చిర్తపులులను కన్జర్వేషన్ బాక్సులకెల్లి కునో జాతీయ పార్కులకు ప్రదాని మోదీ ఇడ్సి పెట్టిండు'' అని యాద్గిరి అన్నడు. ''నెలొద్దుల ముందుగాలనే గ్యాస్ బండ, పిట్రోలు అనేటి రెండు చిర్తపులులను ప్రదాని జెనం మీద్కి ఇడ్సిపెట్టిండు'' అని మా సత్నారి అన్నడు. నిజ్జమే గదా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఉక్కు అధికారుల సంఘం వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు అధికారుల సంఘ నాయకులు

ఉక్కునగరం (గాజువాక): విశాఖ స్టీల్ ప్లాంట్, ఎన్ఎండీసీ ప్లాంట్‌లను సెయిల్‌లో విలీనం చేయాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డికి ఉక్కు అధికారుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉక్కు అధికారుల సంఘ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు చంద్ర వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.నాయక్ శుక్రవారం న్యూఢిల్లీలో కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్, ఎన్ఎండీసీలను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను మంత్రికి వివరించారు. సెయిల్ సామర్థ్యాన్ని 10 మిలియన్ టన్నులకు విస్తరించబోతున్నారని చెప్పారు. దానికి రూ.లక్ష కోట్లు వ్యయం చేయడం ప్రభుత్వానికి భారీ నష్టమన్నారు. దానికంటే 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన విశాఖ స్టీల్‌ప్లాంట్, మూడు మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన ఎన్ఎండీసీ ప్లాంట్లలో పెట్టుబడుల ఉపసంహరణను నిలిపివేసి సెయిల్‌లో విలీనం చేస్తే మెగా స్టీల్ పీఎస్‌యూగా మారి ప్రభుత్వానికి ప్రయోజనం కలుగుతుందని వివరించారు. జాతీయ ఉక్కు విధానం ప్రకారం 2030 నాటికి 300 మిలియన్ టన్నుల వార్షిక లక్ష్యం నెరవేరడంతోపాటు ముడి పదార్థాల లభ్యత, ఎగుమతి ప్రయోజనాలు, భూమి లభ్యత వంటి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సెయిల్‌లో విలీనం కోసం తనవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఉక్కు అధికారుల సంఘ నాయకులు తెలిపారు.

సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం



- 26 నుంచి అక్టోబర్ 5 వరకు ఇంద్రకీలాద్రిపై నవరాత్రులు
- 10 లక్షల మందకి పైగా భక్తులు వస్తారని అంచనా
- ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దసరా నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కోవిడ్ ఉధృతి లేనందున ఈ ఏడాది 10 లక్షల మందికిపైగా ఉత్సవాలకు హాజరవుతారని ఆలయాధికారుల అంచనా. ఇందుకు అనుగుణంగా ఆలయానికి వచ్చే సామాన్యులకు సంతృప్తికర దర్శనం కల్పించే విధంగా ఏర్పాట్లు చేశారు. మూలా నక్షత్రం రోజు సీఎం వైఎస్ జగన్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వహణలో పాల్గొనే పలు శాఖలకు చెందిన అధికారులతో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, హోంమంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మాల్లాది విష్ణు, దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, కలెక్టర్ ఢిల్లీ రావు, ఈవో భ్రమరాంబ సమీక్ష జరిపి, క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. మొత్తం 5 క్యూలైన్‌ల ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. వీఐపీలకు ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దివ్యాంగులకు దర్శనానికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. దర్శనానంతరం భక్తులు శివాలయం మెట్ల మార్గం ద్వారా కిందకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజు 10,000 మంది భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం 21 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. ఆలయ పరిసరాలను విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు.



ఆలయప్రాంగణంలో భారీగా పందిళ్ల ఏర్పాటు

సామాన్య భక్తులకు పెద్ద పీట...

దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తి అయ్యాయి. సామాన్యులకే పెద్ద పీట వేస్తూ, వారికి సంతృప్తికర దర్శనం కలిగేలా అన్ని చర్యలు తీసుకున్నాం. అన్ని శాఖలతో దేవదాయ శాఖ సమన్వయం చేసుకొని భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నాం.

– కొట్టు సత్యనారాయణ, దేవదాయశాఖ మంత్రి

నవరాత్రుల్లో 3,500 వేల మంది పోలీసులను వినియోగిస్తున్నారు. పార్కింగ్, ఉత్సవాల సమయంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. కాగా, అక్టోబర్ 5న విజయదశమి నాడు సాయంత్రం పవిత్ర కృష్ణా నదిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హంస వాహనంపై దుర్గా మల్లేశ్వరులు కృష్ణా నదిలో జల విహారం గావిస్తారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల దర్భ చాప, తాడు ఊరేగింపు



దర్భ చాప, తాడుతో అటవీ అధికారులు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భ చాప, తాడును టీటీడీ అటవీ విభాగం కార్యాలయం నుంచి శుక్రవారం డీఎఫ్‌వో శ్రీనివాసులు, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయం రంగనాయకుల మండపంలోని శేషవాహనంపై దర్భతో తయారు చేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 27న జరిగే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు. ఈ దర్భ చాప 22 అడుగుల పొడవు, 7.5 అడుగుల వెడల్పు, తాడు 200 అడుగుల పొడవు ఉంటుంది.

శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 29 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సర్వ దర్శనానికి 12 గంటలు పడుతోంది. గురువారం అర్ధరాత్రి వరకు 65,187 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 27,877 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.5.37 కోట్లు వేశారు.

వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

- రెండో ఏడాది జీవితకాల సాఫల్య పురస్కారాలు, అచీవ్‌మెంట్ అవార్డులు
- ఈ నెల 30 వరకు దరఖాస్తులకు గడువు
- నవంబర్ 1న అవార్డుల ప్రదానం

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న 'వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్-2022' అత్యున్నత పురస్కారాల కోసం వివిధ రంగాలు, విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు లేదా సంస్థల నుంచి ఈ నెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలను ఎంపిక చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన హైపవర్ స్క్రీనింగ్ కమిటీ శుక్రవారం విజయవాడలో సమావేశమైంది. ఈ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్) జీవీడి కృష్ణమోహన్, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీలు రేవు ముత్యాలరాజు, అనూరాధ రాజారత్నం, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, పౌర సరఫరాల శాఖ స్పెషల్ సెక్రటరీ, కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి, సాధారణ పరిపాలన శాఖ ఉప కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాలలో అసాధారణ నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలు కలిగి సమాజాన్ని విశేషంగా ప్రభావితం చేసిన వ్యక్తులకు, సంస్థలకు అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత భారతరత్న, పద్మశ్రీ తదితర పురస్కారాల తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ పురస్కారాలను అందిస్తోందన్నారు. అవార్డు ఎంపిక కోసం విద్య, వైద్య, వ్యవసాయ, మహిళాభ్యుదయం, సామాజిక న్యాయం, దేశ-విదేశాల్లో గుర్తింపు పొందిన సామాజిక, సాహిత్య, సాంస్కృతిక తదితర రంగాల్లో రాణిస్తున్న వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, వారి బయోడేటాను secy-political@ap.gov.in కు మెయిల్ చేయాలని తెలిపారు. గతేడాది 59 మందిని సత్కరించినట్లు గుర్తుచేశారు. ఇక వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ కింద రూ.10 లక్షల నగదు, వైఎస్సార్ కాంస్య విగ్రహం, జ్ఞాపిక, ప్రశంసా పత్రం ఇస్తారన్నారు. వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.5 లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందిస్తారని తెలిపారు.

ఏవోబీలో డంప్ స్వాధీనం

సరిహద్దుల్లో ముమ్మరంగా కూంబింగ్



డంప్‌లో లభ్యమైన కోర్టెక్స్ వైర్,నగదు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో మావోయిస్టుల డంప్‌ను పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టు పార్టీ 18వ వార్షికోత్సవం సందర్భంగా రెండు రాష్ట్రాల పోలీసు బలగాలు అప్రమత్తమయ్యాయి. ఏవోబీలో ముమ్మరంగా కూంబింగ్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఒడిశా పోలీసు బలగాలు ముంచంగిపుట్టు మండలం రంగబయలు పంచాయతీ కేంద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను గుర్తించాయి. అందులో రూ.70 వేలు, 17 మీటర్ల కోర్టెక్స్ వైర్, 11ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 31 జెలటిన్ స్టిక్స్, 2 టిఫిన్ బాక్స్ బాంబులు, ఎలక్ట్రిక్ వైర్ బండిల్, ప్రెజర్ కుక్కర్ బాంబ్, టెస్టింగ్ పిన్‌లు ఉన్నాయి. డంప్‌ను పోలీసు బలగాలు స్వాధీనం చేసుకుని ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లా కేంద్రానికి తరలించినట్లు ఎస్పీ వరుణ్ గుంటువల్లి తెలిపారు. డంప్ కనిపించడంతో అప్రమత్తమైన ఆంధ్ర-ఒడిశా పోలీసు బలగాలు సరిహద్దులోని రంగబయలు, బుంగాపుట్టు, బూసిపుట్టు, హనుమల్, అంద్రపల్లి, సింధిపుట్టు, పనసపుట్టు, జోడం తదితర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ ముమ్మరం చేశాయి. కొండ, అటవీ ప్రాంతం గుండా ముందుకు సాగుతున్నాయి. సరిహద్దును ఆనుకుని ఉన్న ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల మండల కేంద్రాల్లో పోలీసులు వాహన తనిఖీలు విస్తృతంగా చేశారు. సరిహద్దులో రాకపోకలపై పూర్తిగా నిఘా ఉంచారు.



భీమిలి నియోజకవర్గంలోని మన్నదొరపాలెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కర్నూలు నగరంలోని బుధవారపేటలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్ద ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజా ప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



ఒంగోలు 49వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

రాష్ట్ర సమగ్రాభివృద్ధికే మూడు రాజధానులు

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యోనారాజు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షించే వారంతా మూడు రాజధానులకే మద్దతు పలకాలని మాల మహానాడు (పీవీరావు) జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి మద్దతుగా ఆయన శుక్రవారం సాక్షి ప్రతినిధితో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ గొప్ప విజన్ ఉన్న నాయకుడన్నారు. అమరావతితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి సాధించాలని సీఎం జగన్ కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి సాధించాలని కోరుకునే మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, విద్యావంతులు, అన్ని వర్గాల వారు సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. అమరావతిని అడ్డుపెట్టుకుని ప్రాంతీయ అసమానతలను రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

‘సీఆర్‌డీఏ’ తప్పుడు చట్టం

726వ రోజు రిలే నిరాహార దీక్షల్లో మండిపడ్డ బహుజన పరిరక్షణ సమితి నేతలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: స్వప్రయోజనాల కోసమే నాడు బాబు అండ్ కో సీఆర్‌డీఏ చట్టం 30 ఏళ్ల వరకూ మార్చకూడదంటూ తప్పుడు చట్టం చేశారని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 726వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రజా ప్రతినిధులు రాజ్యాంగబద్ధంగా సభలో తీసుకున్న నిర్ణయాలు చట్టం రూపంలో అమలు జరుగుతాయని, భారత రాజ్యాంగాన్నే ఇప్పటికి పలుమార్లు సవరించిన విషయాన్ని గుర్తు చేశారు. అమరావతి పేరుతో భారీ అవినీతికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు.. భవిష్యత్తులో సైతం తనకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ముందస్తు వ్యూహంతో చేసిన తప్పుడు చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టేలా అంకబాబు దుష్ప్రచారం

- ఆధారాలు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించినందునే అరెస్టు
- సీఐడీ విభాగం వెల్లడి

సాక్షి,అమరావతి/నగరంపాలెం(గుంటూరువెస్ట్): ముఖ్యమంత్రి కార్యాలయ ప్రతిష్టకు ఉద్దేశపూర్వకంగా భంగం కలిగిస్తూ, సమాజంలో విద్వేషాలు రగిలించేలా దుష్ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందునే కొల్లు అంకబాబును అరెస్టు చేశామని సీఐడీ విభాగం తెలిపింది. తాము ఇచ్చిన 41ఏ సీఆర్‌పీసీ నోటీసులను తీసుకునేందుకు తిరస్కరించడంతో పాటు తన మొబైల్ ఫోన్‌లోని ఆధారాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించడంతో ఆయన్ను అరెస్టు చేయాల్సి వచ్చిందని శుక్రవారం సీఐడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. గతంలో ఈనాడు, ఉదయం పత్రికలు, హెచ్ఎంటీవీలలో జర్నలిస్టుగా చేసిన అంకబాబు ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారని చెప్పింది. 'సీఎంవోలోని ఓ కీలక అధికారి భార్య దుబాయి నుంచి అక్రమంగా బంగారం తీసుకువస్తూ గన్నవరం విమానాశ్రయంలో పట్టుబడినట్టు, ఆమెతో పాటు ఎయిర్ ఇండియా సిబ్బందిని కస్టమ్స్ అధికారులు విచారిస్తున్నట్లు' ఓ అవాస్తవ పోస్టును అంకబాబు ఈనెల 9న సోషల్ మీడియాలో పోస్టు చేశారని సీఐడీ అధికారులు తెలిపారు. వాస్తవానికి విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు జప్తు చేసిన బంగారంతో సీఎంవో అధికారులకు ఎలాంటి సంబంధంలేదని తెలిపింది. అంకబాబు ఉద్దేశపూర్వకంగానే సీఎంవో ప్రతిష్ట దెబ్బతీసేందుకు, సమాజంలో వర్గవిద్వేషాలు సృష్టించేందుకే ఈ విధంగా దుష్ప్రచారం చేసినట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని సీఐడీ విభాగం వివరించింది. అంతేకాకుండా ఈ దుష్ప్రచార పోస్టులను వైరల్ చేయడంలో ఆయన సూపర్ స్ప్రెడర్‌గా వ్యవహరించినట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఫేక్ పోస్టులపై సీఐడీ అధికారులు పలువురిని విచారించినపుడు ఈ విషయం వెలుగుచూసింది. వారందరి మొబైల్‌ఫోన్లకు కూడా ఆ ఫేక్ పోస్టు అంకబాబు మొబైల్ ఫోన్ నుంచే వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. వివిధ వాట్సాప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో కూడా సీఎంవోపై దుష్ప్రచారం వెనుక అంకబాబే కీలకపాత్ర పోషించారని సీఐడీ విభాగం ఆధారాలు సేకరించింది. వీటి ఆధారంగానే కొన్ని టెలివిజన్ చానళ్లలో కూడా ఈ దుష్ప్రచారాన్ని వ్యాప్తిలోకి తెచ్చారు. తద్వారా వివిధ మాధ్యమాల ద్వారా ఒకే సమయంలో పెద్దఎత్తున దుష్ప్రచారం చేసేలా అంకబాబు వ్యవహరించారన్నది స్పష్టమైంది. దాంతో ఆయన్ని విజయవాడలో గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని, అందులోనుంచి పంపిన పోస్టుల వివరాలు సేకరించామని చెప్పింది. ఆర్థిక నేరాలకు సంబంధించి అంకబాబుపై గతంలో కృష్ణా, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాల్లో 20 వరకు కేసులు నమోదయ్యాయని కూడా సీఐడీ విభాగం వెల్లడించింది. కొన్ని మనీ సర్క్యులేషన్ స్కీముల పేరిట కూడా ఆయన మోసాలకు పాల్పడ్డారని సీఐడీ గుర్తించింది.

గుంటూరులో విచారణ

అంకబాబును సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయానికి తరలించి, శుక్రవారం సుదీర్ఘంగా విచారించారు. ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అంకబాబుని వైద్య పరీక్షలు నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రాథమిక వైద్య పరీక్షలు తదుపరి ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా, బెయిల్ మంజూరు చేశారు. అంకబాబుని అరెస్ట్ చేయడంతో టీడీపీ నాయకులు సీఐడీ ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంకబాబు అరెస్టు సరికాదు: చంద్రబాబు

సాక్షి, అమరావతి: సీనియర్ జర్నలిస్ట్ అంకబాబు అరెస్ట్ సరికాదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు హైదరాబాద్ నుంచి శుక్రవారం డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి లేఖ రాశారు. విజయవాడలో అంకబాబు అరెస్టు అక్రమమని, వెంటనే విడుదల చేయాలని కోరారు. వాట్సాప్ పోస్ట్ పేరుతో అరెస్టు చేయడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారని విమర్శించారు. టీడీపీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలతో మొదలైన అక్రమ అరెస్టులు.. ఇప్పుడు ప్రశ్నించే గొంతుకలు, రాజధాని ఉద్యమకారుల వరకు వచ్చాయని తెలిపారు.

గుండె శస్త్రచికిత్స కోసం ముంబైకి మంత్రి విశ్వరూప్



అమలాపురం టౌన్: కొద్ది రోజుల కిందట అస్వస్థతకు గురై, హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది, అక్కడి తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గుండె శస్త్రచికిత్సకు శుక్రవారం ముంబై బయలుదేరి వెళ్లారు. ముంబైలోని ఏషియన్ హార్ట్ సెంటర్‌లో ఆయనకు సోమవారం గుండె శస్త్రచికిత్స చేస్తారని మంత్రి విశ్వరూప్ తనయుడు కృష్ణారెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి మంత్రి విశ్వరూప్ తన కుటుంబ సభ్యులతో కలిసి విమానంలో ముంబై వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం ముంబై ఏషియన్ హార్ట్ సెంటర్ ఆస్పత్రిలో ఆయన అడ్మిట్ అయినట్లు కృష్ణారెడ్డి చెప్పారు.

అది టీడీపీ శవయాత్ర

పాదయాత్రపై మంత్రి జోగి రమేష్ వ్యాఖ్య



మచిలీపట్నం టౌన్: అమరావతి యాత్ర టీడీపీ శవయాత్రగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అభివర్ణించారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. చచ్చిపోయిన తెలుగుదేశం పార్టీకి అమరావతి ఉద్యమం ముసుగు తొడగడం విచారకరమన్నారు. అమరావతి కోసం ఉద్యమం చేస్తే తప్పు లేదు కానీ, ఆ ముసుగులో టీడీపీ వారంతా పాల్గొనటం న్యాయమేనా అని ప్రశ్నించారు. దీనికి ఉద్యమకారులే సమాధానం చెప్పాలన్నారు. విశాఖలో పాలనా రాజధాని వస్తుందన్న ఆశతో ఉన్న ఆ ప్రాంత ప్రజలకు, అమరావతి పాదయాత్ర చేసే వారికి మధ్య విభేదాలు సృష్టించేందుకు చంద్రబాబు పన్నిన కుట్రే పాదయాత్ర అని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నేతలు అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కోట్లు దండుకున్నారన్నారు. అధికారం కోల్పోయినా.. అమరావతికి అన్యాయం జరిగిపోతోందని అభూత కల్పనలు సృష్టిస్తూ మళ్లీ అమరావతి నుంచి అమెరికా దాకా దోచుకుంటున్నారని చెప్పారు. అధికారంలో ఉన్నా లేకున్నా అమరావతిని చంద్రబాబు ఏటీఎంలా వాడుకుంటున్నారని తెలిపారు. అమరావతిలో రాజధానిని తీసేస్తారని ఎవరైనా చెప్పారా అని ప్రశ్నించారు. అమరావతి చుట్టూ ఉన్న 19 గ్రామాలే అభివృద్ధి చెందితే పెడనలో ఉన్న మా రైతన్నలకు నీరు చంద్రబాబు ఇస్తారా అని ప్రశ్నించారు. మరో 25 ఏళ్ల తరువాత మళ్లీ కొట్టుకొనే పరిస్థితి వస్తుందని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలూ అభివృద్ధి చెందితే ప్రాంతీయ అసమానతలు రావనే దూరదృష్టితో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. అమరావతిని కూల్చేస్తున్నారని అమెరికాలో ప్రచారం చేస్తున్నారని, ఇక్కడ ఏం అభివృద్ధి జరిగిందని కూలుస్తామని ఆయన ప్రశ్నించారు. కృష్ణా జిల్లా రాజకీయ నిరుద్యోగులు యాత్రకు స్వాగతాలు పలుకుతూ ప్రజలను పాడు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతమే అభివృద్ధి చెందితే ఎలాగని, ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో మన అన్నదమ్ములు కూడా మూడుపూటలా తినాలి కదా అని అన్నారు.

ఉద్యానవనం.. ఆధ్యాత్మిక పరవశం

తిరుమలలో ఆధునీకరించిన పార్క్ ప్రారంభం



ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దిన పార్కు

తిరుమల: ఉద్యానవనాలను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. తిరుమలలోని మొదటి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ పక్కనే ఆధునీకరించిన పార్కును ఈవో ధర్మారెడ్డితో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడారు. సీఎం ఆదేశాల మేరకు తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తిరుమలలో ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించామన్నారు. దాతల సహకారంతో పార్కులన్నీ ఆధునీకరించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తిరుమలకు నడిచే 10 విద్యుత్ బస్సులను, కరకం బాడి రోడ్డు నుంచి వాసవీ భవన్ వరకు నిర్మించిన శ్రీనివాస సేతును ఈ నెల 27న సీఎం ప్రారంభిస్తారని వెల్లడించారు. తిరుమలలో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం, నూతన పరకామణి భవనాన్ని కూడా సీఎం ప్రారంభిస్తారని చెప్పారు.

బాబు సీఎం కాకముందే నెల్లూరు మెడికల్ కాలేజీ ఏర్పాటు

- విపక్ష నేత నోటి నుంచి అన్నీ అబద్ధాలే వస్తాయి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు నోటినుంచి వచ్చేవన్నీ పచ్చి అబద్ధాలేనని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎలాంటి జంకూ బొంకు లేకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో వైద్య రంగానికి విశేషమైన కృషి చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు హెల్త్ యూనివర్సిటీకి పెట్టడం సముచితమన్నారు. దీనిపై చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. తన హయాంలోనే పలు వైద్య కళాశాలలు నిర్మించినట్లు ఓ జాబితా చంద్రబాబు విడుదల చేశారని, అందులో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి మెడికల్ కళాశాల తామే కట్టామని చెప్పారని, ఇది పచ్చి అబద్ధమని మంత్రి స్పష్టం చేశారు. ఆ మెడికల్ కళాశాలకు 2013, ఏప్రిల్ 3న శంకుస్థాపన చేశారని, జీవోఎంఎస్ నం.141 ద్వారా 2013, ఆగస్టు 24న, ఏసీ సుబ్బారెడ్డి మెమోరియల్ మెడికల్ కళాశాలగా నామకరణం చేశారని మంత్రి వివరించారు. ఆ కాలేజీకి ప్రారంభోత్సవం మినహా చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. కాగా, గతంలో చంద్రబాబు విపక్ష నేతగా ఉన్నపుడు కృష్ణపట్నం పోర్టు వద్దకు వచ్చి ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అక్కడి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు కూల్చేస్తామని చెప్పారనీ, ఆ తర్వాత కృష్ణపట్నం వచ్చి థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంలో తమ వల్లే అభివృద్ధి అంటూ ప్రకటించుకున్నారని మంత్రి తెలిపారు.

టీడీపీని ఎన్టీఆర్ వారసులకు అప్పగించండి

నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే టీడీపీని తన కుమారుడు లోకేశ్‌కు కాకుండా ఎన్టీఆర్ వారసులకు అప్పగించాలని కాకాణి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో టీడీపీ ప్రశ్నలకు తాము సమాధానం చెప్పే సమయంలో వారు సభ నుంచి పారిపోయారని మంత్రి విమర్శించారు. కుప్పంలో ఇక చంద్రబాబు పని అయిపోయిందని, టీడీపీ బంగాళాఖాతంలో కలిసిపోనుందని, ఇక చంద్రబాబు అసెంబ్లీ గడప కూడా తొక్కలేరని మంత్రి చెప్పారు.

ఐఎన్ఎస్ అధ్యక్షునిగా కేఆర్‌పీ రెడ్డి

తెలుగు పత్రికల నుంచి తొలిసారి దక్కిన అవకాశం



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) అధ్యక్షునిగా సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్ కె.రాజాప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎకనామిక్ టైమ్స్‌కు చెందిన మోహిత్ జైన్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగుతారు. సొసైటీ 83వ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. డిప్యూటీ ప్రెసిడెంట్‌గా రాకేశ్ శర్మ (ఆజ్ సమాజ్), వైస్ ప్రెసిడెంట్‌గా ఎంవీ శ్రేయమ్స్ కుమార్ (మాతృభూమి ఆరోగ్య మాసిక), గౌరవ కోశాధికారిగా తన్మయ్ మహేశ్వరి (అమర్ ఉజాలా), సెక్రటరీ జనరల్‌గా మేరీ పాల్‌ను ఎన్నుకున్నారు. 41 మందిని ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. మోహిత్ జైన్ (ఎకనామిక్ టైమ్స్), ఐ.వెంకట్ (అన్నదాత), గిరీశ్‌అగర్వాల్ (దైనిక్ భాస్కర్), వివేక్ గోయంకా (ఇండియన్ ఎక్స్‌ప్రెస్), జయంత్ మమెన్ మాథ్యూ (మలయాళమనోరమ) తదితరులు వీరిలో ఉన్నారు. ప్రతిష్టాత్మకమైన ఐఎన్ఎస్ అధ్యక్ష పదవి ఓ తెలుగు పత్రికకు దక్కడం ఇదే తొలిసారి. గతంలో ఇంగ్లిష్ డైలీ డక్కన్ క్రానికల్‌కు చెందిన వెంకట్రామిరెడ్డి అధ్యక్షునిగా చేశారు. 1939లో ఏర్పాటైన ఐఎన్ఎస్ మన దేశంలో దినపత్రికలు, మేగజైన్లు, పీరియాడికల్స్‌కు సంబంధించి జాతీయ స్థాయిలో అత్యున్నత సంఘం.

క్లుప్తంగా...

'సర్దార్ సరోవర్'ను అడ్డుకున్న... అర్బన్ నక్సల్స్: ప్రధాని మోదీ

అహ్మదాబాద్: నర్మదా నదిపై తలపెట్టిన సర్దార్ సరోవర్ డ్యాం నిర్మాణాన్ని రాజకీయ అండ ఉన్న అర్బన్ నక్సల్స్ (అభివృద్ధి నిరోధక శక్తులు) ఏళ్ల తరబడి అడ్డుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రాజెక్టులకు వ్యతిరేకంగా వారు ఇప్పటికీ ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం పర్యావరణ మంత్రుల జాతీయ సదస్సును గుజరాత్‌లోని నర్మదా జిల్లా ఏక్తా నగర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోదీ ప్రారంభించారు. వివిధ సంస్థల అండతో అర్బన్ నక్సల్స్ సాగిస్తున్న ప్రచారం కారణంగా అభివృద్ధి ప్రాజెక్టులు నిలిచిపోతున్నాయన్నారు. వీరు న్యాయ వ్యవస్థ, ప్రపంచబ్యాంకులను సైతం ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. జాప్యం వల్ల సమయం, పెద్ద మొత్తంలో డబ్బు వృథా అవుతోందన్నారు. వివిధ రాష్ట్రాల్లో పర్యావరణ అనుమతుల కోసం 6 వేల దరఖాస్తులు, మరో 6,500 దరఖాస్తులు అటవీ శాఖ అనుమతుల కోసం పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

ప్రధాని కాంక్షతోనే బీజేపీకి నితీశ్ వెన్నుపోటు: అమిత్ షా

పుర్నియా: జేడీయూ చీఫ్, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌పై హోం మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ప్రధానమంత్రి పదవిని ఆశించే ఆయన బీజేపీకి వెన్నుపోటు పొడిచి, ఆర్జేడీతో చేతులు కలిపారని శుక్రవారం బిహార్లోని పుర్నియాలో జరిగిన ర్యాలీలో మండిపడ్డారు. ''ఏ సిద్ధాంతాలూ లేని నితీశ్ కుర్చీని కాపాడుకునేందుకే కాంగ్రెస్, ఆర్జేడీల పంచన చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నితీశ్, ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమిని బిహార్ ప్రజలు తిరస్కరించడం ఖాయం. అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ ఖాయం'' అన్నారు.

ఉక్రెయిన్‌లో రిఫరెండం షురూ

కీవ్: ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగాలను సంపూర్ణంగా విలీనం చేసుకొనే ప్రక్రియను రష్యా వేగవంతం చేసింది. ఆ ప్రాంతాల్లో శుక్రవారం రిఫరెండం మొదలు పెట్టింది. లుహాన్స్క్, ఖేర్సన్‌తోపాటు జపోరిజియా, డోనెట్స్క్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఓటింగ్ జరుగుతోంది. ఇది మంగళవారం దాకా కొనసాగుతుందని ఉక్రెయిన్‌లోని రష్యా అనుకూల వర్గాలు వెల్లడించాయి. రష్యా ఆక్రమిత ప్రాంతాల్లో రష్యన్ భాష మాట్లాడేవారే ఎక్కువ. వారంతా రష్యాలో చేరడానికి మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. రిఫరెండంపై ఉక్రెయిన్, పశ్చిమ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

వరవరరావుకు చుక్కెదురు

ముంబై: కంటి శస్త్రచికిత్స కోసం హైదరాబాద్ వెళ్తానన్న విప్లవ కవి వరవరరావు (82) అర్జీని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. ఎన్ఐఏ కోర్టు అనుమతి లేకుండా ముంబై దాటొద్దని బెయిల్ సందర్భంగా కోర్టు షరతు విధించడం తెలిసిందే.

అఫ్గాన్‌లో కారు బాంబు పేలి... ఏడుగురి దుర్మరణం

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో శుక్రవారం జరిగిన బాంబు పేలుడులో ఏడుగురు చనిపోయారు. చిన్నారులు సహా 41 మంది గాయపడ్డారు. మసీదుకు సమీపంలో రోడ్డు పక్కన ఉంచిన కారు బాంబు పేలిందని తాలిబన్ ప్రతినిధి ఒకరు తెలిపారు. తర్వాత కాల్పులు వినిపించాయన్నారు. తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్ అఫ్గాన్‌లో తరచూ హింసాత్మక చర్యలకు పాల్పడుతోంది.


మలేరియా వ్యాప్తిని నిరోధించే దోమలు

అభివృద్ధి చేసిన యూకే పరిశోధకులు



లండన్: మలేరియా.. మానవాళికి పెనుముప్పుగా మారిన అతిపెద్ద వ్యాధి. దోమల నుంచి వ్యాపించే మలేరియా కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా లక్షలాది మంది మరణిస్తున్నారు. వ్యాధి నివారణకు ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. మలేరియా వ్యాప్తిని అరికట్టే దోమలను పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఇందుకోసం సాధారణ దోమల్లో జన్యుపరమైన మార్పులు చేశారు. మలేరియాకు కారణమయ్యే పారాసైట్లు జన్యుపరంగా మార్పు చేసిన ఈ దోమల్లో వేగంగా పెరగవని చెబుతున్నారు. మలేరియాను అరికట్టడంలో ఇదొక శక్తివంతమైన ఆయుధం అవుతుందని పేర్కొంటున్నారు. యూకేలోని ఇంపీరియల్ కాలేజీ లండన్‌తోపాటు బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిసీజ్ మోడలింగ్' పరిశోధకులు ఈ ఘనత సాధించారు. ఈ వివరాలను సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్‌లో ప్రచురించారు. మలేరియా సోకిన వ్యక్తిని కుట్టిన ఆడ దోమ మరో వ్యక్తిని కుడితే అతడికి కూడా వ్యాధి సోకుతుంది. అంటే దోమల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. మలేరియా పారాసైట్లు తొలుత దోమ అంత్రంలోకి చేరుకుంటాయి. అక్కడే ఇన్ఫెక్షన్ కలిగించే స్థాయికి ఎదుగుతాయి. అనంతరం లాలాజల గ్రంథుల్లోకి చేరుకుంటాయి. అంత్రంలో పారాసైట్లు ఎదగడానికి ఎక్కువ సమయం పట్టేలా చేశారు. పారాసైట్లు అభివృద్ధి చెంది, మనిషిని కుట్టే లోపే దోమల జీవితకాలం ముగుస్తుందని చెబుతున్నారు. ప్రపంచంలో సగం జనాభాకు మలేరియా రిస్క్ పొంచి ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా 24.10 కోట్ల మలేరియా కేసులు నమోదయ్యాయి. 6,27,000 మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితుల్లో ఎక్కువ మంది చిన్నారులే ఉన్నారు.

కరోనా కథ ముగిసింది!: డబ్ల్యూహెచ్ఓ



న్యూఢిల్లీ: ప్రపంచ దేశాల వెన్నులో వణుకు పుట్టించిన కరోనా కథ ముగిసినట్టేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పేర్కొంది. కోవిడ్–19 తాలూకు అత్యంత భయానకమైన దశ ముగిసిపోయినట్టేనని వెల్లడించింది. ''వైరస్ వెలుగులోకి వచ్చిన రెండున్నరేళ్లకు ఆ మహమ్మారి తోకముడిచే రోజులు వచ్చేశాయి. ఇకపై కేసుల అంతగా పెరుగుదల ఉండదు. అలాగని పూర్తిగా తగ్గి జీరో కేసులకు వచ్చే పరిస్థితి కూడా లేదు'' అని అంచనా వేసింది. ''రెండున్నరేళ్లుగా మనం చీకటి గుహలో బతుకులు వెళ్లదీస్తున్నాం. ఇప్పుడు గుహ చివర్లో వెలుగు రేఖ కనిపిస్తోంది. అయితే అక్కడికి చేరుకోవడానికి ఇంకా చాలా దూరముంది. అప్రమత్తంగా లేకుంటే ఇంకా ఎన్నో అడ్డంకులు వస్తాయి'' అని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అన్నారు. గురువారం ఆయన ఐరాస సర్వప్రతినిధుల సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. కరోనా వైరస్ బలహీనపడిపోయిందని అశోకా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ గౌతమ్ మీనన్ కూడా అన్నారు. ఆయన తొలినుంచీ కరోనా కేసుల్ని ప్రపంచవ్యాప్తంగా ట్రాక్ చేస్తున్నారు. కరోనా వైరస్‌కు మన శరీరాలు అలవాటు పడిపోయాయని, ఇక ఆ వైరస్‌తో ప్రాణాలు కోల్పోవడం జరగదని ఆయన ధీమాగా చెప్పారు.

హిజాబ్ అల్లర్లతో... అట్టుడుకుతున్న ఇరాన్

స్వేచ్ఛ కావాలంటూ వీధుల్లోకి మహిళలు

- నియంతల పీడ పోవాలంటూ నినాదాలు
- హిజాబ్‌లు తగలబెడుతూ ధర్నాలు
- పోలీసులతో ఆందోళనకారుల బాహాబాహీ
- కాల్పుల్లో 30 మందికి పైగా బలి!
- ఇంటర్నెట్ నిలిపివేత, ఇంటింటి తనిఖీలు
- ప్రపంచ దేశాల ధ్వజం, అమెరికా ఆంక్షలు



ప్రభుత్వానికి వ్యతిరేకంగా టెహ్రాన్‌లో నిరసనకారుల ఆందోళనలు



హిజాబ్‌ను కాల్చివేస్తున్న మహిళ

దుబాయ్: ఇరాన్‌లో హిజాబ్ కల్లోలం చినికిచినికి గాలివానగా మారుతోంది. నిర్బంధ హిజాబ్ ధారణ నిబంధనను వ్యతిరేకిస్తూ వారం రోజులుగా దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసనలు నానాటికీ మరింత హింసాత్మకంగా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా మహిళలు హిజాబ్‌లను చేబూని జెండాల మాదిరిగా ఊపుతూ భారీ సంఖ్యలో నిరసనలకు, ధర్నాలకు దిగుతున్నారు. ప్రభుత్వ వైఖరి సిగ్గుచేటంటూ నిరసిస్తున్నారు. 'మాకు స్వేచ్ఛ కావాల్సిందే' అంటూ వీధుల్లోకి వస్తున్నారు. 'నియంత ఖొమేనీకి మరణమే', 'ముల్లాల పీడ వదలాల్సిందే' అంటూ నినాదాలతో హోరెత్తిస్తున్నారు. బహిరంగంగా జుత్తు కత్తిరించుకోవడంతో పాటు హిజాబ్‌లను తగలబెడుతున్నారు. ఈ క్రమంలో రాజధాని టెహ్రాన్‌లో ఆందోళనకారులు ఓ పోలీసు వాహనానికి నిప్పు పెడుతున్న వీడియోలు ఇంటర్నెట్లో వైరల్‌గా మారాయి. పలుచోట్ల ఇరు వర్గాలు బాహాబాహికి దిగుతూ కన్పించారు. పోలీసులతో పాటు పారామిలిటరీ దళాలు కూడా రంగంలోకి దిగి నిరసనకారులపై విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలో నగరంలో పలు ప్రాంతాలు కాల్పుల మోతతో దద్దరిల్లిపోయాయి. 'ఓ దేవుడా! వాళ్లు విచక్షణారహితంగా కాల్చి పారేస్తున్నారు' అని ఆక్రోశిస్తూ జనం చెల్లాచెదురుగా పారిపోతున్న దృశ్యాలు కొన్ని వీడియోల్లో కన్పిస్తున్నాయి. అల్లర్లలో ఇప్పటిదాకా 26 మంది దాకా మరణించారని దేశ అధికారిక మీడియా సంస్థ చెబుతున్నా శుక్రవారమే ఏకంగా 30 మందికి పైగా బలైనట్టు తెలుస్తోంది. ఆందోళనకారుల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరిస్తున్నారంటూ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన వెలిబుచ్చింది. అతి సమీపం నుంచి కాల్పులకు పాల్పడుతున్నారని ఆక్షేపించింది. ఇరాన్‌పై తీవ్ర ఆంక్షలు విధిస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. మరోవైపు అల్లర్లను నిరసిస్తూ ప్రభుత్వ అనుకూల ర్యాలీలు కూడా జరుగుతున్నాయి.

సర్కారు ఉక్కుపాదం

నిరసనలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఇంటర్నెట్ సేవలను నిలిపేసింది. ర్యాలీలు, ఆందోళనల పిలుపుకు ఆందోళనకారులు ప్రధానంగా ఆధారపడుతున్న ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ వంటివాటిపై ఆంక్షలను తీవ్రతరం చేసింది. అనుమానితుల కోసం పోలీసులు ఇంటింటి సోదాలకు దిగుతున్నారు! వందలాది మందిని అదుపులోకి తీసుకుంటున్నారు. హిజాబ్ ధరించలేదంటూ మాసా అమీనీ అనే 22 ఏళ్ల యువతిని మోరల్ పోలీసులు అరెస్టు చేయడం, ఆమె తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మరణించడం తెలిసిందే. దీన్ని నిరసిస్తూ గత శనివారం నుంచి దేశమంతా ఆందోళనలు జరుగుతున్నాయి. మహిళలు రోడ్లెక్కుతున్నారు.

హిజాబ్ ధరిస్తేనే ఇంటర్వ్యూ!

ఇరాన్ పాలకవర్గంలో గూడుకట్టుకుపోయిన సంప్రదాయవాదానికి తార్కాణమీ ఫొటో. కుర్చీలో కూర్చున్నది సీఎన్ఎన్ చీఫ్ ఇంటర్నేషనల్ యాంకర్ క్రిస్టియాన్ అమన్‌పోర్ (64). ఆమె ఎదురు చూస్తున్నది ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ కోసం. ఐరాస సర్వసభ్య ప్రతినిధి సభలో పాల్గొనేందుకు న్యూయార్క్ వచ్చిన రైసీ ఇరాన్‌లో చెలరేగుతున్న హిజాబ్ హింసాకాండపై ఇంటర్వ్యూ ఇచ్చేందుకు అంగీకరించారు. కానీ తీరా సమయానికి ఆమె హిజాబ్ ధరించాలంటూ పట్టుబట్టారు. అందుకు క్రిస్టియాన్ ససేమిరా అన్నారు. 1995 నుంచీ ఇరాన్ అధ్యక్షులందరినీ హిజాబ్ ధరించకుండానే ఇంటర్వ్యూ చేశానని గుర్తు చేశారు. ''ఇంటర్వ్యూ కోసం వారాల ముందునుంచీ ఏర్పాట్లు చేసుకున్నాం. నేను షెడ్యూల్ ప్రకారం సిద్ధమై అధ్యక్షుని కోసం ఎదురుచూస్తూ కూర్చున్నా. కానీ ఆయన జాడే లేదు. 40 నిమిషాల తర్వాత సహాయకుడొచ్చి నేను హిజాబ్ ధరించి తీరాల్సిందేనని ఆయన కోరుతున్నట్టు తెగేసి చెప్పాడు. అందుకు నిరాకరించి ఇంటర్వ్యూనే రద్దు చేసుకున్నా'' అంటూ ఈ అనుభవాన్ని ఆమె ట్విట్టర్లో పంచుకున్నారు. ఇరాన్‌లో పుట్టిన క్రిస్టియానా 11 ఏళ్లొచ్చేదాకా టెహ్రాన్‌లోనే పెరిగారు.



భారత్ జోడో యాత్రలో సోనియా, ప్రియాంక

బెంగళూరు/న్యూఢిల్లీ: కర్ణాటకలో సాగే భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా పాల్గొననున్నారు. రాహుల్ గాంధీ సారథ్యంలో కొనసాగుతున్న ఈ యాత్ర ఈనెల 30వ తేదీన ఉదయం 9 గంటలకు కేరళ సరిహద్దులోని గుండ్లుపేట్ వద్ద కర్ణాటకలో ప్రవేశించనుంది. రాష్ట్రంలో జరిగే యాత్రలో సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా వేర్వేరుగా పాల్గొంటారని కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్ శుక్రవారం చెప్పారు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. కర్ణాటకలో భారత్ జోడో యాత్రకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టే బాధ్యతలను నాయకులకు అప్పగించామని తెలిపారు. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సూర్జేవాలాలతో కలిసి సమీక్షించామన్నారు. ఇలా ఉండగా, కేరళలోని చలకుడి వద్ద భారత్ జోడో యాత్ర శుక్రవారం విశ్రాంతి కోసం నిలిచిపోయిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. యాత్రికుల కోసం కేటాయించిన కంటెయినర్‌లో రాహుల్‌గాంధీ విశ్రాంతి తీసుకున్నారని చెప్పారు. అక్కడే వైద్య శిబిరం నిర్వహించినట్లు వెల్లడించారు. రాహుల్ ఢిల్లీ వెళ్లారంటూ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు.



దేశంలో తగ్గిన నవజాత శిశు మరణాలు

సాక్షి, న్యూఢిల్లీ: నవజాత శిశు, బాలల మరణాల నివారణలో దేశం గణనీయమైన పురోగతిని సాధించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ మేరకు నమూనా రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) స్టాటిస్టికల్ రిపోర్ట్–2020ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసింది. 2014తో పోలిస్తే శిశు మరణాల రేటు (ఐఎంఆర్), నవజాత శిశు మరణాల రేటు (ఎన్ఎంఆర్), ఐదేళ్లలోపు వారి మరణాల రేటు(యూఎంఆర్)లో బాగా తగ్గాయని తెలిపింది. ''నవజాత శిశు మరణాల రేటు 2019లో ప్రతి వెయ్యిమందికి 22 కాగా, 2020 నాటికి 20కి తగ్గింది. మరణాల వార్షిక తగ్గుదల రేటు 9.1%. ఇది పట్టణ ప్రాంతాల్లో 12%, గ్రామీణ ప్రాంతాల్లో 23%. ఐదేళ్ల కంటే తక్కువ వయసు బాలల మరణాలు 2019లో ప్రతి వెయ్యికి 35 కాగా 2020కి 32కి తగ్గాయి. వీటిని 2030 నాటికి 25కు తగ్గించాలన్న లక్ష్యాన్ని తెలంగాణ సహా 11 రాష్ట్రాలు ఇప్పటికే చేరుకున్నాయి'' అని నివేదిక తెలిపింది. ఈ తరహా మరణాల తగ్గింపులో కేరళ (8), తమిళనాడు (13), ఢిల్లీ (14)ముందు వరుసలో ఉండగా తెలంగాణలో ప్రతి వెయ్యి మందికి 23 మరణాలు ఉన్నాయని వెల్లడించింది. శిశు మరణాల రేటు 2019లో ప్రతి వెయ్యి మందికి 30 ఉండగా, 2020 నాటికి అది 28కి తగ్గిందని తెలిపింది.

ఎయిమ్స్ డైరెక్టర్‌గా శ్రీనివాస్



సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఢిల్లీ ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) డైరెక్టర్‌గా డాక్టర్ ఎం.శ్రీనివాస్ శుక్రవారం నియమితులయ్యారు. డాక్టర్ రణదీప్ గులేరియా స్థానంలో ఆయన్ను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ నియమించినట్టు సిబ్బంది శిక్షణ విభాగం తెలిపింది. శ్రీనివాస్ ప్రస్తుతం హైదరాబాద్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ హాస్పిటల్ డీన్‌గా ఉన్నారు. అంతకుముందు ఢిల్లీ ఎయిమ్స్‌లోనే ప్రొఫెసర్‌గా పనిచేశారు. కర్ణాటకలోని మైసూరుకు చెందిన శ్రీనివాస్ అక్కడే ఎంబీబీఎస్, ఎంఎస్, ఢిల్లీ ఎయిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ విభాగంలో పీడియాట్రిక్ సర్జన్ (కార్డియో వ్యాస్కులర్ స్పెషలిస్ట్) కోర్సు చేశారు. 1994 నుంచి 2016 దాకా ఢిల్లీ ఎయిమ్స్‌లోనే పలు హోదాల్లో పని చేశారు.

పీఎఫ్ఐ హర్తాల్ హింసాత్మకం

కేరళలో రెచ్చిపోయిన కార్యకర్తలు

వాహనాలపైకి రాళ్లు, దుకాణాల మూత



తిరువనంతపురం/కొచ్చి: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలకు నిరసనగా ఇస్లామిక అతివాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) శుక్రవారం కేరళలో చేపట్టిన హర్తాల్ హింసాత్మకంగా మారింది. పీఎఫ్ఐ కార్యకర్తలు, మద్దతుదారులు తమకు ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో రెచ్చిపోయారు. ర్యాలీలు నిర్వహించారు. భారీ సంఖ్యలో వీధుల్లోకి వచ్చి విధ్వంసానికి దిగారు. రోడ్లను దిగ్బంధించి, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. తిరువనంతపురం, కొల్లాం, కోజికోడ్, వయనాడ్, అలప్పుజా... ఇలా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బస్సులు, ప్రైవేట్ వాహనాలపై రాళ్లు రువ్వారు. దుకాణాలపై దాడులకు దిగారు. ప్రయాణికులను బెదిరించారు. దుకాణాలను మూసేయించారు. రాళ్ల దాడిలో వాహనాలు, దుకాణాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు, డ్రైవర్లు, ప్రయాణికులు గాయాలపాలయ్యారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. వందలాది మంది పీఎఫ్ఐ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొన్ని పట్టణాల్లో అదనపు బలగాలను మోహరించారు. హింసకు పాల్పడిన సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) కార్యకర్తలను కూడా అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. కన్నూరు జిల్లా పయ్యానూర్‌లో పీఎఫ్ఐ కార్యకర్తలపై స్థానికులు తిరగబడ్డారు. దుకాణాలను మూసివేయిస్తుండగా దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

భద్రత కల్పించడంలో విఫలం

కొట్టాయం జిల్లా ఎరాట్టుపేట, కొల్లాం జిల్లా పల్లిముక్కుతోపాటు కన్నూరులో భారీగా హింస చోటుచేసుకుంది. కన్నూరులోని నారాయణపారాలో ఉదయం న్యూస్‌పేపర్ వెహికిల్‌పై నిరసనకారులు పెట్రోల్ బాంబు విసిరారు. భద్రతా ఏర్పాట్లలో పోలీసులు విఫలమయ్యారని విమర్శలొస్తున్నాయి. పీఎఫ్ఐ హర్తాల్ పిలుపు కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని కేరళ హైకోర్టు తేల్చిచెప్పింది. ఏడు రోజుల ముందస్తు నోటీసివ్వకుండా హర్తాల్ వంటివి చేయొద్దని ఆదేశాలున్న విషయాన్ని గుర్తు చేసింది. ఈ ఉదంతాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఆస్తి నష్టం తదితరాలపై నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది.

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తా

సీఎంగా నా వారసుడిని సోనియా, మాకెన్ నిర్ణయిస్తారు: గెహ్లోట్



ఫలితాల తర్వాత కలిసి నడవాల్సిందే..

కొచ్చి/జబల్పూర్: కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తానని పార్టీ సీనియర్ నేత, రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ ప్రకటించారు. తన తర్వాత రాజస్తాన్ సీఎం ఎవరన్నది కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అజయ్ మాకెన్ నిర్ణయిస్తారన్నారు. పార్టీలో ఇటీవల తెరపైకి వచ్చిన 'ఒక వ్యక్తికి ఒకే పదవి' అంశంపై చర్చ అనవసరమన్నారు. గెహ్లోట్ శుక్రవారం మహారాష్ట్రలోని షిర్డీలో మీడియాతో మాట్లాడారు. గాంధీ కుటుంబం నుంచి ఎవరూ పోటీలో ఉండరని రాహుల్ గాంధీ తనతో చెప్పారన్నారు. నామినేషన్ ఎప్పుడు దాఖలు చేయాలన్నది రాజస్తాన్ వెళ్లాక నిర్ణయించుకుంటానన్నారు. ఎన్నికలో పోటీ చేయడం అనేది ప్రజాస్వామ్యానికి సంబంధించిన అంశమని, నూతన ప్రారంభానికి శ్రీకారం చుడతామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా అధ్యక్ష పోస్టుకి పోటీ పడుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా, గెహ్లోట్ స్పందించారు. ''కాంగ్రెస్ మిత్రులు ఎవరైనా అధ్యక్ష పదవిని కోరుకోవచ్చు. అది పెద్ద విషయం కాదు. ఫలితాల తర్వాత అందరూ కలిసి నడవాల్సిందే. బ్లాక్, గ్రామం, జిల్లా స్థాయిల్లో పార్టీని పటిష్టం చేసుకోవడానికి ఐక్యమత్యంగా పనిచేయాలి. కాంగ్రెస్‌ను బలమైన ప్రతిపక్షంగా మార్చుకోవాలి'' అని ఉద్ఘాటించారు. దేశంలో ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో బలమైన ప్రతిపక్షం తప్పనిసరిగా అవసరమని గెహ్లోట్ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడబోనని రాహుల్ గాంధీ ఇప్పటికే పలుమార్లు స్పష్టంగా చెప్పిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై తనకు ఆసక్తి లేదని పార్టీ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ కూడా తాజాగా తెలిపారు.

హర్తాల్ కోసమే కాంగ్రెస్ యాత్రకు బ్రేక్: బీజేపీ

న్యూఢిల్లీ: కేరళలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) శుక్రవారం హర్తాల్ చేపడితే, భారత్ జోడో యాత్రను కాంగ్రెస్ ఆపేయడం సిగ్గుచేటని బీజేపీ నేత కపిల్ శర్మ ట్వీట్ చేశారు. 'పీఎఫ్ఐ, ఇస్లామిక్ సంస్థలు కేరళలో హర్తాల్‌కు పిలుపివ్వగా కాంగ్రెస్ తన పాదయాత్రను ఆపు చేసింది. ఇంతకంటే చౌకబారుతనం, అవమానకరం మరోటి లేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఘాటుగా స్పందించారు. పీఎఫ్ఐని క్షమాపణలు కోరేందుకే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ముస్లిం నేతలను కలుసుకుంటున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. 'భారత్ జోడో యాత్ర వారానికోసారి విశ్రాంతి కోసం ఆగుతుంది. ఈ నెల 15న విరామం కోసం ఆగింది. మళ్లీ శుక్రవారం నిలిచిపోయింది' అని పవన్ ఖేరా వివరించారు.

ఎందుకీ విద్వేషపు చిచ్చు?

కెనడాలో హిందువులపై వరుస దాడులు



ప్రపంచంలో అత్యంత సురక్షిత దేశాల్లో ఒకటిగా కెనడాకు పేరుంది. గతేడాది ప్రపంచ శాంతి సూచిలో ఆరో ర్యాంకు దక్కింది. నేరాలు, ఘర్షణలూ తక్కువే. రాజకీయంగా సుస్థిరమైన ప్రభుత్వం. అలాంటి దేశంలో భారతీయులకు భద్రత ఎందుకు లేదు? వారిపై విద్వేష నేరాలు ఎందుకు పెరుగుతున్నాయి? కెనడాలో భారతీయులు జాగ్రత్తగా ఉండాలంటూ కేంద్రం హెచ్చరించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది...?

కెనడాలో హిందూ, భారత్ వ్యతిరేక శక్తులు బలపడుతున్నాయి. ఇటీవల అక్కడ హిందూ దేవాలయాలపై వరసగా జరుగుతున్న దాడులు ఆందోళన పెంచుతున్నాయి. టొరంటోలోని స్వామినారాయణ మందిరంపై కొన్నాళ్ల క్రితం కొందరు దుండగులు దాడులు చేస్తూ ఖలిస్తాన్ జిందాబాద్, హిందూస్తాన్ ముర్దాబాద్ అంటూ చేసిన నినాదాలతో భారతీయులు ఉలిక్కిపడ్డారు. జూలైలో గ్రేటర్ టొరంటో ప్రాంతంలోని రిచ్‌మండ్ హిల్‌లో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. వీటి వెనక ఖలిస్తాన్ ఉగ్రవాదుల హస్తముందని ఆధారాలున్నా కెనడా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం భారత్‌కు ఆగ్రహం తెప్పిస్తోంది. అధికార లిబరల్ పార్టీ ఎంపీ, ప్రవాస భారతీయుడు చంద్ర ఆర్య వీటిని పార్లమెంటులో లేవనెత్తారు. భారత్‌పై, హిందూ మతంపై విద్వేషం వెళ్లగక్కుతున్నారన్నారు.

ఖలిస్తానీల అడ్డా?

కెనడా కొన్నేళ్లుగా ఖలిస్తాన్ ఉగ్రవాదులకు అడ్డాగా మారుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత వ్యతిరేక అజెండాతో పని చేస్తున్న వీరంతా ప్రత్యేక ఖలిస్తాన్ ఉద్యమం కోసం కెనడాను వాడుకుంటున్నారు. భారత్ నిషేధించిన సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) సెప్టెంబర్ 18న ఖలిస్తాన్ రిఫరెండాన్ని నిర్వహించింది. దీన్ని నిలిపేయాలని భారత్ కోరినా కెనడా పట్టించుకోలేదు. లౌకిక దేశమైన తాము ప్రజాభిప్రాయ సేకరణలను అడ్డుకోబోమని తేల్చి చెప్పింది. ఖలిస్తాన్ వేర్పాటువాద సంస్థలైన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్, ఖలిస్తాన్ జిందాబాద్ ఫోర్స్ వంటివి కెనడా గడ్డ నుంచి భారత్‌లో మత ఘర్షణలకు ప్రయత్నిస్తున్నాయి. 2018 నుంచి కెనడాలో భారత్ వ్యతిరేక కార్యకలాపాలు పెరిగాయి. బ్రాంప్టన్‌లో గౌరీశంకర్, జగన్నాథాలయం, మిసిసాపలో హిందూ హెరిటేజ్ సెంటర్‌పై దాడులు జరిగాయి. ఇదంతా కెనడాలో ఉంటూ భారత్‌ను అస్థిరపరిచే కుట్రేనని గతేడాది అక్కడ పర్యటించిన జాతీయ దర్యాప్తు సంస్థ తేల్చింది.

కెనడాలో భారతీయం

కెనడాలో మొదట్నుంచి భారతీయుల ప్రాబల్యం ఎక్కువే. ప్రస్తుతం అక్కడ 16 లక్షల మంది (4 శాతం) భారతీయులున్నారు. వీరిలో లక్ష మందికి పైగా శాశ్వత పౌరసత్వముంది. ఎక్కువగా పంజాబీలే కెనడా వెళుతుంటారు. ఆ దేశంలో అత్యధికంగా మాట్లాడే 10 భాషల్లో పంజాబీ కూడా ఉంది. చట్టసభల్లోనూ భారతీయులు సత్తా చాటారు. 2015లో 21 మంది భారత సంతతికి వారు ఎంపీలయ్యారు. 2019లో 23కు పెరిగారు. కెనడా రక్షణ మంత్రి హర్జిత్ సింగ్ సజ్జన్ కూడా భారతీయ మూలాలున్న వ్యక్తే!

జర భద్రం: కేంద్రం

''కెనడాలో జాతి విద్వేష నేరాలు, వర్గ హింస, భారత్ వ్యతిరేక కార్యక్రమాలు విపరీతంగా పెరుగుతున్నాయి. కాబట్టి అక్కడి భారతీయులంతా జాగ్రత్తగా ఉండాలి'' అంటూ విదేశాంగ శాఖ శుక్రవారం హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమైతే ఒట్టావాలోని భారతీయ హైకమిషన్, టొరంటోలో దౌత్య కార్యాలయాలను సంప్రదించాలని సూచించింది. ఇటీవలి నేరాలపై సమగ్ర విచారణ జరపాలని కెనడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్



నెలాఖరులోగా మౌలిక వసతులు

భోగాపురం ఎయిర్ పోర్టు నిర్వాసితులకు సంబంధించిన గృహ నిర్మాణాలను ఈ నెలాఖరులోగా త్వరగా పూర్తి చేయాలని మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవన్ ఆదేశించారు.

- 8లో

నేడు మంత్రి బొత్స పర్యటన

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు నగరంలోని ఘోష ఆస్పత్రి డీఐఈసీ విభాగంలో బధిరుల కోసం నిర్వహిస్తున్న ఈఎన్‌టీ శస్త్ర చికిత్సా శిబిరాన్ని సందర్శిస్తారు. మైక్రో వాటర్ సప్‌లై స్కీమ్‌లు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు రేగిడి ఆమదాలవలస మండలంలోని వైఎస్ఆర్ చేయూత ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

25న డిప్యూటీ స్పీకర్ రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఈ నెల 25న నగరానికి రానున్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు అన్నవరంలో బయలుదేరి ఆనందపురం, మోదవలస మీదుగా ఉదయం 11.45 గంటలకు చెల్లూరు చేరుకుంటారు. అక్కడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు నగరంలోని తన నివాసానికి చేరుకోనున్నారు.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన కమ్యూనికేషన్ ఎస్పీ



ఎస్పీకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రీజనల్ కమ్యూనికేషన్ ఎస్పీ సూర్యకుమార్

విజయనగరం క్రైమ్: రీజనల్ కమ్యూనికేషన్స్ ఎస్పీగా విశాఖలో బాధ్యతలు చేపట్టిన ఎస్.సూర్యకుమార్ ఎస్పీ ఎం.దీపికను జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ వ్యవస్థలో కమ్యూనికేషన్స్ వ్యవస్థ క్రియాశీలకం కావడంతో విజయవాడ నుంచి శ్రీకాకుళం వరకూ గల అన్ని కమ్యూనికేషన్స్ కార్యాలయాల పనితీరును రీజనల్ ఎస్పీగా ఆయన పర్యవేక్షించనున్నారు. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో ఉన్న కమ్యూనికేషన్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఆయన వెంట కమ్యూనికేషన్ ఎస్‌ఐ వెంకట చిట్టి, ఏఎస్‌ఐ సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గానికో సంచార పశువైద్య వాహనం

- జీవీకే ఆర్గనైజేషన్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాస్



ప్రశంసాపత్రాలతో సంచార వాహన సిబ్బంది, అధికారులు

రాజాం సిటీ: ప్రతీ నియోజకవర్గానికి అదనపు సంచార పశువైద్య వాహనం అందుబాటులోకి రానుందని జీవీకే ఆర్గనైజేషన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు మరో వాహనాన్ని, నవంబర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు వివరించారు. రాజాంలో సంచార వైద్య వాహన వైద్యుడు సత్య, అసిస్టెంట్ యోగి, డ్రైవర్ నాగేష్‌లకు జిల్లా మేనేజర్ నారాయణరావు, ఏడీ బొత్స జయప్రకాష్‌తో కలిసి శుక్రవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార పశువైద్య సేవలు రైతులకు చేరువయ్యాయన్నారు. 1962కు ఫోన్ చేసిన వెంటనే వాహనం సంబంధిత రైతు కల్లాం వద్దకు వెళ్లి పశువులకు సేవలందిస్తోందన్నారు. రోజుకు 5 చొప్పున నెలకు సరాసరి 120 పశువులకు సేవలందించిన రాజాం వాహన సిబ్బంది జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది మోహన్, రామ్మూర్తి, రాము తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ వర్సిటీ సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ కార్యదర్శి సౌరబ్ గౌర్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీని రాష్ట్ర ఐటీ కార్యదర్శి సౌరబ్‌గౌర్ శుక్రవారం సందర్శించారు. వీసీ జీఎస్ఎన్ రాజు, రీజనల్ డైరెక్టర్ జేఎం రావు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామ్ తరంగ్‌లోని డేటా సెంటర్, ఐటీ ల్యాబ్, ఎలక్ట్రిక్ వెహికల్స్, టిష్యూ కల్చర్ తదితర ప్రయోగశాలలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, డీన్ కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక స్వావలంబన



- మహిళా సాధికారతకు ప్రాధాన్యం
- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
- వైఎస్సార్ చేయూత కింద జిల్లాలో లక్షా41వేల347 మందికి లబ్ధి
- మూడో విడతలో రూ.265.03 కోట్ల నిధులు విడుదల
- మూడు విడతల్లో రూ.734.27కోట్ల ఆర్థిక ప్రయోజనం



వడ్డీ భారం తప్పింది..

నా పేరు గొంప రమణమ్మ. గంట్యాడ మండలం తాటిపూడిలోని శ్రీ ఉమామహేశ్వరి మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిని. ఇంటి ముందరే ఖాళీ స్థలంలో కొన్నేళ్లుగా పాన్‌షాప్ నిర్వహిస్తున్నాను. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక సున్నావడ్డీ, స్త్రీనిధి రుణాలతో పాటు చేయూత ప్రోత్సాహక సొమ్ముతో వ్యాపారాన్ని విస్తరింప జేశాను. కుటుంబ ఆర్థిక కష్టాలు గట్టెక్కుతున్నాయి.

విడతల వారీగా విడుదలైన సొమ్ము, లబ్ధిదారులు		
వివరాలు	లబ్ధిదారులు	సొమ్ము రూ.కోట్లలో
మొదటి విడత (12-08-2020)	1,27,618	239.28
రెండవ విడత (22-06-2021)	1,22,647	229.96
మూడవ విడత (23-09-2022)	1,41,347	265.03
మూడు విడతల మొత్తం	-	734.27


ఆర్థిక చేయూత



నా పేరు ఆదపరెడ్డి దేముడమ్మ. వేపాడ మండలం. వేంకటేశ్వర మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిని. స్త్రీనిధి, బ్యాంకు రుణం కింద రూ.1 లక్షతో పాటు రెండు విడతల్లో చేయూత పథకం కింద వచ్చిన రూ.37,500 ప్రోత్సాహంతో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాను. డిగ్రీ చదివిన మా అబ్బాయి సహాయం తీసుకుంటున్నాను. నెలకు దాదాపు రూ.22 వేల వరకు ఆదాయం వస్తోంది.

విజయనగరం అర్బన్:

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక స్వావలంబన చేకూరుస్తూ.. మహిళా సాధికారతే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ స్పష్టంచేశారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అనువైన పథకాలను అమలుచేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ చేయూత పథకం కింద మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా కుప్పంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురష్‌బాబు, ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, కంబాల జోగులు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తిలకించారు. అనంతరం వైఎస్సార్ చేయూత కింద విజయనగరం జిల్లాలోని లక్షా 41వేల347 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున ప్రభుత్వం విడుదల చేసిన రూ.265.03 కోట్ల చెక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా ఎదిగి కుటుంబా లకు అం డగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ వైఎస్సార్ చేయూతతో చిరువ్యాపారులు సాగిస్తూ అభివృద్ధి చెందుతున్నామన్నారు. ముఖ్యమంత్రి మేలు మరచిపోలేమని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు ఇస రపు రేవతీదేవి, కోలగట్ల శ్రావణి, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వైవీ రమణ, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటలక్ష్మి, సత్యవతి, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, డీపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



కులాల వారీగా వైఎస్సార్ చేయూత లబ్ధి ఇలా..		
కులం	లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
ఎస్టీ	3,266	6.12
ఎస్సీ	16,148	30.28
బీసీ	1,21,82	228.42
మైనారిటీలు	110	0.21
మొత్తం	1,41,347	265.03

రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి పాలన

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- జేడీవలసలో సచివాలయం ప్రారంభం



జేడీ వలసలో సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

జామి: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జామి మండలంలోని జేడీ వలస గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా సంక్షేమపథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జిల్లాలోని అక్కచెల్లెమ్మలకు మూడోవిడత వైఎస్సార్ చేయూత కింద సుమారు రూ.365 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. జిల్లాలోని అన్ని పదవులు వెనుకబడిన వర్గాలవారికే కేటాయించారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98.5 శాతం అమలు చేశారన్నారు. ఈ ప్రాంతానికి త్వరలో సుజలస్రవంతి పథకం కింద గోదావరి జలాలు అందుతాయన్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రజలముంగిటకే ప్రభుత్వ సేవలను సీఎం అందుబాటులోకి తెచ్చారన్నారు. పైసా అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జామి జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, వేపాడ, ఎల్.కోట, ఎస్.కోట ఎంపీపీలు, జెడ్పీటీసీలు దొగ్గ సత్యవంతుడు, ఎస్.అప్పారావు, వెంకటలక్ష్మ ఛ సోమేశ్వరరావు, ఏఎమ్‌సీ చైర్మన్ మూకల కస్తూరి, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, మాజీ ఏఎమ్‌సీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావు, గ్రీనరీ అండ్‌బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ చలుమూరి సత్యారావు, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, వైస్ ఎంపీపీలు గేదెల వెంటకరావు, ఎన్నింటి విజయలక్ష్మి, సర్పంచ్ చిటికిరెడ్డి రామునాయుడు, ఎంపీటీసీలు నాగమణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నది వద్ద గుమిగూడిన గ్రామస్తులు

ఏమయ్యాడో... ఏమో..?

సరిగ్గా ఐదేళ్ల కిందట ట్రాక్టర్ ప్రమాదంలో చిన్నకుమారుడు చనిపోగా, ఇప్పుడు.. పాఠశాలకు వెళ్తున్న పెద్దకుమారుడు నదిలో కొట్టుకుపోయాడు. ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. గుండెలవిసేలా రోదిస్తున్నారు.

- వేగావతి నదిలో విద్యార్థి గల్లంతు
- మరువాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్తుండగా ఘటన
- ఐదేళ్ల కిందట ట్రాక్టర్ ప్రమాదంలో చిన్నకుమారుడు...
- ఇప్పుడు నీటిలో కొట్టుకుపోయిన పెద్ద కుమారుడు...
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
- ఘటనపై రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఆరా..



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వంగర: మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధిలోని చౌదరివలసకు చెందిన 8వ తరగతి విద్యార్థి చౌదరి శ్రీను (14) వేగావతి నదిలో శుక్రవారం గల్లంతయ్యాడు. మరువాడ జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లేందుకు నది దాటుతుండగా ప్రమాదంలో చిక్కుకున్నాడు. స్థానికులు, వంగర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇరువాడ–మరువాడ పంచాయతీల మధ్యన వేగావతి నది ప్రవహిస్తోంది. ఇరు పంచాయతీల వారు చంద్రపేట రేవు నుంచి నదిగుండా రాకపోకలు సాగిస్తారు. ఇది వీరికి నిత్యకృత్యం. ఇప్పటివరకు ఇక్కడ ఎలాంటి ప్రమాదం జరగలేదు. నదిలో శుక్రవారం నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. అదే సమయంలో శ్రీను సహచర స్నేహితులు చౌదరి తరుణ్, పెద్దిరెడ్డి మనోజ్‌లతో కలిసి పాఠశాలకు పయనమయ్యాడు. మరువాడ గ్రామానికి చెందిన గొర్లె కాపరి మహేష్... తరుణ్, మనోజ్‌లను అవతలి వైపునకు నది దాటించాడు. శ్రీనును దాటించేందుకు తిరిగి వచ్చేలోగా నదిలో దిగిపోయాడు. అంతే.. చూస్తుండగానే పుస్తకాల బ్యాగుతో పాటు శ్రీను నదిలో కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న చౌదరి ఉమామహేశ్వరి, కోట మీనా, కోట మానస, చౌదరి వాగ్దేవి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు పరుగున వచ్చి నదిలో వెతికినా ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు, తహసీల్దార్ డి.ఐజాక్‌తో పాటు అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నదిలో విద్యార్థి కోసం గాలించినా ఫలితం లేకపోయింది. విద్యార్థి గల్లంతుతో చౌదరివలస గొల్లుమంది. గ్రామస్తులందరూ నదీ తీరానికి చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. యువకులందరూ నదిలో దిగి రాత్రి వరకు వెతుకుతూనే ఉన్నారు.



చౌదరి శ్రీను(ఫైల్)

ఎప్పుడూ జరగలేదు..

విద్యార్థులు నిత్యం నదిగుండానే రాకపోకలు సాగిస్తారని, ప్రమాదం ఎప్పుడూ జరగలేదని గ్రామస్తులు చెబుతున్నారు. నదిలో ప్రవాహం పెరిగితే పిల్లలను పెద్దలు దగ్గరుండి నదిని దాటిస్తామని తెలిపారు. శ్రీను గాబరా పడి నదిలో దిగడం వల్లే ప్రమాదానికి గురై ఉంటాడని భావిస్తున్నారు.

కడుపుకోత...

చౌదరి మురళీ, లతలకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు ప్రవీణ్ ఐదేళ్ల కిందట జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందాడు. పెద్దవాడు శ్రీను ఇప్పుడు నదిలో కొట్టుకుపోవడంతో వారు శోకసంద్రంలో మునిగిపోయారు. విధి తమపై కన్నెర్రచేసిందంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు.

ప్రాజెక్టులోకి కొట్టుకుపోయాడా?

ప్రమాదం జరిగి ప్రదేశానికి సరిగ్గా నాలుగు కిలోమీటర్ల దూరంలో మడ్డువలస ప్రాజెక్టు ఉంది. రెండు కిలోమీటర్ల తర్వాత వేగావతి నది సువర్ణముఖిలో కలుస్తుంది. రెండు నదుల ప్రవాహం మడ్డువలస ప్రాజెక్టులోకి చేరుతుంది. నీటి ఉధృతికి విద్యార్థి ప్రాజెక్టులోకి కొట్టుకుపోయి ఉంటాడని చౌదరివలస గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ప్రాజెక్టులో వెతికేందుకు సిద్ధమవుతున్నారు.

ఎమ్మెల్యే కంబాల ఆరా.....

వేగావతి నదిలో విద్యార్థి చౌదరి శ్రీను గల్లంతు ఘటనపై రాజాం ఎమ్మెల్యే జోగులు ఆరా తీశారు. విద్యార్థి కుటుంబానికి భరోసా ఉండాలని మండల అధికారులకు సూచించారు. ఆచూకీ కోసం గాలించాలని కోరారు. కుటుంబానికి అండగా ఉంటామని జెడ్పీటీసీ కరణం రాధమ్మ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు గజపతినగరం విద్యార్థి



ఎం.నవీన్‌కుమార్ (గజపతినగరం బాలుర హైస్కూల్)

గజపతినగరం:

పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దుమ్మేరు జెడ్పీహైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో జరిగిన 25వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా క్రీడా పోటీల్లో గజపతినగరం బాలుర హైస్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థి ఎం.నవీన్‌కుమార్ ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు బైరిపురం వ్యాయామ ఉపాధ్యాయుడు రామారావు తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు కర్నాటక రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తలపడతాడని పేర్కొన్నారు. విద్యార్థిని హైస్కూల్ హెచ్ఎం డి.గౌరినాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

- బునియాది శిక్షా అభియాన్ తరగతులకు శ్రీకారం
- డీఈఓ వెంకటేశ్వరరావు



బునియాది శిక్షా అభియాన్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

విజయనగరం:

విద్యార్థుల్లో విద్యానైపుణ్యాల పెంపుదలకు, మెరుగైన ఫలితాల సాధించేందుకు బునియాది శిక్షా అభియాన్ పథకంలో కింద అందించే శిక్షణ దోహదపడుతుందని డీఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక కార్యాచరణతో పిరమాల్ ఫౌండేషన్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు సాగుతాయన్నారు. నీతి అయోగ్ లక్ష్యాల సాధనకు ఉద్దేశించిన శిక్షణ స్థానిక కస్బా హైస్కూల్ వేదికగా శుక్రవారం ప్రారంభమైంది. విద్యాశాఖాధికారులు, పిరమాల్ ఫౌండేషన్ బృంద సభ్యులు పాల్గొని శిక్షణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

100 రోజులు.. పాఠశాలలు

నీతీ అయోగ్ నిర్దేశించిన లక్ష్యాల మేరకు జిల్లాలో ప్రత్యేక శిక్షణ తరగతులు 100 రోజుల పాటు, 100 పాఠశాలల్లో నిర్వహిస్తామని ప్రొగ్రాం కో ఆర్డినేటర్ ప్రియాంక సింఘ్ తెలిపారు. కరోనా సమయంలో తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదైన జామి, గంట్యాడ, విజయనగరం మండలాల పరిధిలో పలు పాఠశాలలను గుర్తించామని చెప్పారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఆయా పాఠశాలలను సందర్శించి శిక్షణ అందిస్తాయని తెలిపారు. గణితం, ఇంగ్లిష్ నైపుణ్యాలు పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ వాసుదేవరావు, ప్రొగ్రాం కోఆర్డినేటర్ ప్రియాంక సింఘ్, పిరమాల్ ఫౌండేషన్ సభ్యులు లోకేష్, యోగేష్, ఆకాశ్, సాంద్రా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా ముగిసిన పవిత్రోత్సవాలు



యాగశాలలో నిర్వహిస్తున్న పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో గడిచిన మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అగ్ని ఆరాధన, పవిత్ర విసర్జన, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపించారు. కలశాలతో మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు చేపట్టి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి మంటపం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించి స్వామి పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. విశాఖకు చెందిన వైఖానస పండితుడు పాణింగపల్లి రంగనాథాచార్యులు, శిష్య బృందం ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు వేడుకగా ముగిశాయి. కార్యక్రమంలో ఈఓ ప్రసాదరావు, భక్తులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరిహారం

బొబ్బిలి: గ్రోత్ సెంటర్‌లోని బెర్రీ ఫెర్రో ఎల్లాయిస్‌లో లారీ ఢీకొని మృతి చెందిన మరడ నాగమణి కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం రూ.15లక్షల పరిహారాన్ని చెల్లించేందుకు అంగీకరించింది. ఈ మేరకు శుక్రవారం గ్రామ పెద్దలు, బెర్రీ యాజమాన్య ప్రతినిధులు సమావేశమై నిర్ణయించారు. అలాగే లారీ బీమా సదుపాయాలతో మరో రూ.15లక్షలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని పరిశ్రమ యాజమాన్యం అంగీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు. చర్చల్లో యాజమాన్య ప్రతినిధులు శ్రీనివాస రాజు, హెచ్‌ఆర్ భాస్కర రావు, జీఎం (కమర్షియల్) రాజేష్ ఆచారి, ఎం.ముగ్గివలస, మెట్టవలస సర్పంచులు ఈశ్వర రావు, మాధవ, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైల్వేకాలనీలో చోరీ

శృంగవరపుకోట: పట్టణంలోని రైల్వేకాలనీలో గురువారం రాత్రి ఒక ఇంట్లో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో ప్రవేశించిన దొంగలు రూ.10వేల నగదు, 15తులాల వెండి వస్తువులు పట్టుకుని ఉడాయించారు. రైల్వే ట్రాక్‌మన్‌గా పనిచేస్తున్న ఎవర్ని రమణ గురువారం ఇంటికి తాళం వేసుకుని డ్యూటీకి వెళ్లిపోయాడు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇంటి వెనుక కిటీకి నుంచి లోపలకి ప్రవేశించి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లోవరాజు చెప్పారు.

నెలాఖరులోగా మౌలిక వసతులు

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవన్
- కలెక్టరేట్‌లో ఎయిర్ పోర్ట్ నిర్వాసితుల సమస్యలపై సమీక్ష



సమీక్షిస్తున్న మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్

విజయనగరం అర్బన్: భోగాపురం ఎయిర్ పోర్టు నిర్వాసితులకు సంబంధించిన గృహ నిర్మాణాలను ఈ నెలాఖరులోగా త్వరగా పూర్తి చేయాలని మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవన్ ఆదేశించారు. గూడెపువలస గ్రామంలో దసరానాటికి గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టర్ చాంబర్‌లో భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్వాసితులకు సంబంధించి ఆర్అండ్ ఆర్ పనులు, మౌలిక వసతులపై కలెక్టర్ సూర్యకుమారితో కలిసి సమీక్షించారు. పోలిపల్లి, గూడెపువలస, బొల్లింకల పాలెం, రెల్లిపేట గ్రామాల్లో జరుగుతున్న పనులను వర్క్‌వారీగా సమీక్షించారు. అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా, పోస్టాఫీస్, అంగన్వాడీ భవనం వెల్‌నెస్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ, సచివాలయం, వెటర్నరీ ఆసుపత్రి, డంపింగ్ యార్డ్, శ్మశానం తదితర నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. అలాగే రామాలయం, గ్రామ దేవతల గుడులను కూడా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్ రహదారి పనులకు తక్షణమే టెండర్లను పిలవాలని ఆర్అండ్‌బీ ఈఈకి సూచించారు. పెండింగ్ కోర్ట్ కేసులపై ఆరా తీయగా అన్నింటికీ కౌంటర్లు వేయడం పూర్తయిందని బెంచ్ వద్ద పెండింగ్ ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఎయిర్‌పోర్ట్‌కు అవసరమయ్యే 2203 ఎకరాలకు గాను 2,183 ఎకరాలకు వెజిటేరియన్ క్లియరెన్స్ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన 10 శాతం కూడా త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్ఓ గణపతిరావు, ఆర్‌డీఓ సూర్యకళ, నేషనల్ హై వేస్ ప్రతినిధులు, ఆర్అండ్‌బీ ఎస్ఈ జయశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న చీఫ్ సెక్రటరీ



పైడితల్లిని దర్శిస్తున్న చీఫ్ సెక్రటరీ కరికాలవన్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారిని రాష్ట్ర మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదాశీస్సులతో పాటు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమానికి ముందు నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగం రెడ్డి బంగారునాయుడు, నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కేదారశెట్టి సీతారామమూర్తి, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి మండలి డైరెక్టర్ అనూరాధ, కార్పొరేటర్ చాణక్య చీఫ్ సెక్రటరీకి దుశ్శాలువతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అమ్మవారి పాలకమండలి సభ్యుడు తాడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో మూడో నిందితుడి అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ టి.త్రినాథ్ (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: జిల్లాలో తొలిసారిగా లైసర్జిక్ యాసిడ్ డయాథ్లమైడ్ (ఎల్ఎస్‌డీ) డ్రగ్‌ను పోలీసులు పట్టుకున్న కేసులో మూడో నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పట్టణానికి చెందిన ఇద్దరు నిందితులను ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిద్దరినీ విచారణ చేయడంతో బెంగళూరులో ఉన్న వ్యక్తి వారికి పంపినట్లు చెప్పగా ప్రత్యేక టీమ్ రంగంలోకి దిగింది. ఎట్టకేలకు నిందితుడు అరకు నుంచి రెండు కిలోల గంజాయి కొనుక్కొని విజయనగరం వస్తున్నాడన్న విషయం తెలుసుకున్న నిఘా వర్గాలు మాటు వేసి అదుపులోకి తీసుకున్నాయి. దీనికి సంబంధించి విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ టి.త్రినాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్ఎస్‌డీ డ్రగ్స్ కేసుకు సంబంధించి విశాఖకు చెందిన ప్రస్తుతం బెంగళూరులో నివాసం ఉంటున్న మూడో నిందితుడు కట్టా ఆంజనేయ కాళిదాసు అలియాస్ కిట్టూను శుక్రవారం అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇప్పటికే ఉల్లివీధికి చెందిన కొండపు సందీప్ రెడ్డి, కుమ్మరివీధికి చెందిన శఠగోపం గణేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కిట్టూని విచారించడంతో తాను కేరళ రాష్ట్రానికి చెందిన అఖిల్‌జీత్ దగ్గర ఎల్ఎస్‌డీ డ్రగ్ బ్లాట్స్‌ను కొనుగోలు చేసి సందీప్‌రెడ్డికి కొరియర్ ద్వారా పంపించినట్లు చెప్పాడు. అయితే కొరియర్ ద్వారా పంపిన డ్రగ్ అందిందో? లేదో? తెలుసుకోవడానికి సందీప్ రెడ్డికి ఎన్నిసార్లు ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయకపోవడంతో ఈ నెల 21న విశాఖ వచ్చానని చెప్పాడు. విశాఖ నుంచి అరకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తి వద్ద రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి, 23న శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దిగి సందీప్ రెడ్డిని కలిసేందుకు పట్టణంలోని ఉల్లివీధి మసీదు వద్ద కిట్టూ నిరీక్షిస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు డీఎస్పీ వివరించారు. కేసును మరింత లోతుగా విచారణ చేస్తున్నామని, కేరళకు చెందిన వ్యక్తితో పాటు మరికొందరిపైనా నిఘాపెట్టామన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నామని వివరించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఎస్సైలు దుర్గాప్రసాద్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



శంకరరావు మృతదేహం

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన కొణతల నూకరాజు(38) ఆర్థిక ఇబ్బందులతో ఇంటిలో ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనపై ఎస్సై ఎస్.ముకుందరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా గాజువాక సమీపంలో గల సింహగిరి కాలనీకి చెందిన నూకరాజు కుటుంబంతో కొద్ది సంవత్సరాల క్రితం లక్కవరపుకోట మండలం రంగారాయపురం వలస వచ్చి జీవిస్తున్నాడు. కొకోకోలా శీతలపానీయాల డీలర్‌గా పనిచేస్తున్న ఆయన ఇటీవల కాలంలో ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలయ్యాడు. దీంతో బాధ భరించలేక మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరివేసుకున్నాడు. ఇంతలో ఇంటికి వచ్చిన మృతుడి భార్య దేవి తలుపులు తీసి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో చుట్టుపక్కలవారి సహాయంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యసిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి 9వ తరగతి చదువుతున్న కుమార్తె సాహితి, 7వ తరగతి చదువుతున్న కుమారుడు భార్గవధర్మతేజ ఉన్నారు. మృతుడి తల్లి జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస గ్రామానికి చెందిన అమరాపు శంకరరావు(38) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకరరావు కొన్నేళ్లుగా మద్యానికి బానిసై ఎటువంటి పనులకు వెళ్లకుండా ప్రతిరోజూ భార్యను మద్యానికి డబ్బులు అడుగుతున్నాడు. ఈ నెల 19వ తేదీన రోజూలాగానే డబ్బులు అడగడంతో లేవని భార్య చెప్పింది. దీంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భగవత్ జ్ఞానాన్ని అవగాహన చేసుకోవాలి

- త్రిదండి అహోబిల రామానుజ జియర్ స్వామి



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న అహోబిల రామానుజ జియరు స్వామి

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ భగవత్ జ్ఞానాన్ని అవగాహన చేసుకోవాలని పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి అహోబిల రామానుజ జియరు స్వామి హితవు పలికారు. స్థానిక తోటపాలెంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వికాస తరంగిణి నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని, అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మికత మనిషికి ప్రశాంతతను చేకూరుస్తుందని జ్ఞానంపైనే దృష్టిసారించాలని సూచించారు. మంచిని పెంచాలని, చెడును విడనాడాలని బోధించారు. ఈ సందర్భంగా ఇటీవల చెన్నైలో నిర్వహించిన స్తోత్రపఠన పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్న గంట్యాడ సువ్రత ఆశ్రమ ప్రజ్ఞ విద్యార్థులను స్వామీజీ ఆశీర్వదించారు. కార్యక్రమంలో వికాసతరంగిణి ప్రతినిధి అరుణ, ఆలయ అర్చకులు ఫణిహారం రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సమరసత సేవా సంస్థ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

జామి: ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ బాధితులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. కిర్ల గ్రామానికి చెందిన 14 మంది నుంచి కె.వర ప్రసాద్ అనే వ్యక్తి ఒక్కొక్కరి వద్ద లక్ష రూపాయలు చొప్పున మొత్తం రూ.14 లక్షలు తీసుకుపోయాడని వాపోయారు. దీనిపై పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అతనిపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే అతడ్ని అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం డీటీ సునీతకు వినతిపత్రం అందజేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

శృంగవరపుకోట: మూలబొడ్డవర పంచాయతీ లచ్చందొరపాలెం గ్రామానికి చెందిన యువతి కనిపించటం లేదంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లోవరాజు తెలిపారు. ఈనెల 6వ తేదీన కంప్యూటర్ కోచింగ్ కోసమని విశాఖపట్నం వెళ్లిన ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

షిఫ్ట్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు



క్షతగాత్రుడు జనార్దన రావు వద్ద వైద్యాధికారి, సిబ్బంది

బొబ్బిలి: పట్టణంలోని ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద ఉన్న ఈపీడీసీఎల్ సబ్ స్టేషన్‌లో విద్యుదాఘాతంతో షిఫ్ట్ ఆపరేటర్ జరార్దన రావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే సీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారి జి శశిభూషణ రావు ప్రాథమిక చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ తరలించారు. బాడంగి మండలం వాడాడకు చెందిన జనార్దన రావు బొబ్బిలి 133 కేవీ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా శుక్రవారం విధులు నిర్వహిస్తుండగా ప్రమాదం జరిగింది. కంపెనీ నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్ట్ సిబ్బంది ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, క్షతగాత్రుడికి పూర్తి వైద్యం అందించాలని విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలగ సాయికృష్ణ కోరారు.

చాంపియన్ ట్రోఫీ విజేత జట్టుకు అభినందనలు



ఎస్ఈ నాగేశ్వరావుకు ట్రోఫీని అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: చాంపియన్ షిప్ ట్రోఫీ గెలిచిన టీమ్‌కు విద్యుత్‌శాఖ ఎస్ఈ పి. నాగేశ్వరావు అభినందనలు తెలిపారు. ఈనెల 17నుంచి 19వతేదీ వరకు ఇంటర్ సర్కిల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నెల్లూరు జిల్లాలో జరిగాయి. ఈపోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 24 జట్లు పాల్గొనగా విజయనగరం జిల్లా విద్యుత్ ఉద్యోగుల టీమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి చాంపియన్ షిప్ ట్రోఫీ గెలుచుకుంది. శుక్రవారం ఆ ట్రోఫీని ఎస్ఈ నాగేశ్వరావుకు క్రీడాకారులు అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ(విద్యుత్ ఉద్యోగుల క్రీడల ప్రధానకార్యదర్శి) నాగిరెడ్డి కృష్ణమూర్తి, పైడిరాజు, శ్రీను, గిరి, గణేష్, బాలకుమారి తదితరులు పాల్గొన్నారు.

సహోద్యోగుల సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి

జామి: ఎల్.కోట మండలం రంగాపురం సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ జ్యోత్స్నకుమారి బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతోంది. స్నేహితురాలికి వైద్య ఖర్చుల కోసం నియోజకవర్గంలో పనిచేస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రూ.28వేలు సేకరించి అందజేశారు. ఈ మొత్తాన్ని జేడీవలస గ్రామంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతులమీదుగా శుక్రవారం బాధితురాలికి అందజేశారు.

386 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం



మరువాడలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం



గంట్యాడ: పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు

బొండపల్లి: మండలంలోని మరువాడ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 386 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు శుక్రవారం దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన డోకుల శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు విజిలెన్స్ అధికారులుకు ఫిర్యాదు అందడంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 8 సంచుల్లో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ.బి.సింహచలం తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ దేవుడమ్మ, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడలో 220 కేజీలు

గంట్యాడ: అక్రమంగా తరలిస్తోన్న పీడీఎస్ బియ్యాన్ని గంట్యాడ మండల కేంద్రంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రి కాలనీకి చెందిన ఓవ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు, సిబ్బంది మాటు వేసి పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా పైల తవుడు అనే నిందితుడిని పట్టుకుని సుమారు 220 కేజీలు స్వాధీనం చేసుకున్నారు.

ఈ బండి ఎవరిది?



గజపతినగరం: పురిటిపెంట గ్రామంలో బాలాజీనగర్ సందు రోడ్డులో 15 రోజులుగా ఓ ద్విచక్రవాహనం నిలిపి ఉంచడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ 35 కె 6868 నంబరు గల హీరో ప్యాసన్ ప్లస్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటి ముందు విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఇది దొంగిలించిన వాహనమై ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులు విచారణ చేయాలని కోరుతున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,130–00
బంగారం(22సి. 10గ్రా.)	45,950–00
వెండి (కిలో)	62,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

నెల్లిమర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగానున్న వలంటీర్ పోస్టులకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నాలుగు ఖాళీలకు మొత్తం 9 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 8 మంది హాజరయ్యారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను ఎంపీడీఓ జి.గిరిబాల, తహసీల్దార్ కేవీ రమణరాజు, ఈఓపీఆర్‌డీ హెచ్. భానోజీరావు పరిశీలించి ఇంటర్వ్యూ చేశారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



క్యాంపస్ చాలెంజ్‌లో సంకేత ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న బ్రహ్మకుమారీలు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్‌లో అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవంలో భాగంగా సంకేత ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి నర్మద మాట్లాడుతూ, దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ శర్మ, బ్రహ్మకుమారీలు లత, దేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి...



కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పందుల నిర్మూలన, ప్లాస్టిక్ నిషేధంపై సచివాలయ కార్యదర్శులు దృష్టి సారించాలని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ ఆదేశించారు. స్థానిక మొయిద జంక్షన్‌లోనున్న సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో పందుల పెంపకం చేపట్టకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్, పాలథిన్ కవర్లు, సంచులు, కప్పులు వినియోగించకుండా దుకాణాలపై నిరంతరం దాడులు చేపట్టాలని సూచించారు. కార్యదర్శులంతా తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, యూనిఫారాలు ధరించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

నెల్లిమర్ల: నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ బంగారు సరోజిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు వినియోగించుకోవాలి



లబ్ధిదారుకు ఉచిత గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న అంబళ్ల శ్రీరాములనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఉచిత గ్యాస్ కనెక్షన్లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు సూచించారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో ఉజ్వల యోజన కింద 450 గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు కట్టె పొయ్యిలతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు పీఎం ఉజ్వల యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేష్, ఎర్రంనాయుడు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన

విజయనగరం ఫూల్‌బాగ్: పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పనులు చేపట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు, తదితరులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు 29వ డివిజన్ రామకృష్ణానగర్, 2వ వార్డు డబుల్‌కాలనీలో నిరసన ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రమణ, సురేష్, వెంకటేష్, శాంతమూర్తి, జగదాంబ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత స్థానాల్లో నిలవాలి

● కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: బాలికలు బాగా చదువుకుని తమ కాళ్లపై తాము నిలబడే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆకాంక్షించారు. బాలికల్లో చైతన్యం కల్పించడానికి సచివాలయ మహిళా పోలీసులు కృషి చేయాలని కోరారు. ప్రకృతి వైపరిత్యాలను ఎదుర్కొనడం, ప్రథమ చికిత్స అందించడం, పోలీస్ యాప్స్, రక్తహీనత నివారణా చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, కెరీర్ కౌన్సెలింగ్, సఖి కార్యక్రమం, తదితర అంశాలపై మహిళా పోలీసులకు రెవెన్యూ డివిజన్ల వారీగా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. విజయనగరం డివిజన్ సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మహిళా పోలీసుల పనితీరు బాగుందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో మహిళా పోలీసుల పాత్ర చాలా కీలకంగా మారిందని చెప్పారు. బాలికలు కూడా బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని, ఇందుకోసం ఆడపిల్లల దృక్పథంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రకాల ఆరోగ్య, మానసిక సమస్యల పరిష్కారానికి యోగా ఒక పరిష్కారమని సూచించారు. సఖి గ్రూపులను మరింత చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, శారీరక పరిశుభ్రత, మహిళలకు సంబంధించిన వివిధ రకాల సమస్యలపై అవగాహన కలిగించాలన్నారు. ప్రస్తుత రోజుల్లో ఆర్థిక విషయాల పట్ల అవగాహన కూడా ప్రతి ఒక్కరికీ అవసరమని తెలిపారు. లోన్‌యాప్స్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని చెప్పారు. ప్రస్తుతం వస్తున్న కొన్ని రకాల సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం వల్ల బాలికలు చిన్న వయసులోనే పక్కదారి పడుతున్నారని, ఈ విషయమై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విపత్తుల నివారణాధికారి బి.పద్మావతి, ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ, మహిళా శిశు సంక్షేమాధికారి బి.శాంతికుమారి, డీఎల్‌డీఓ నిర్మల, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద్, జిల్లా యువజన సమన్వయాధికారి విక్రమాదిత్య, సచివాలయ సేవల జిల్లా కోఆర్డినేటర్ అశోక్ పాల్గొన్నారు.



హాజరైన సచివాలయ మహిళా పోలీసులు

చేయూత లబ్ధిదారుల ఆనందం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

విజయనగరం:

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇచ్చిన మాటకు కట్టుబడి శుక్రవారం చేయూత లబ్ధిదారులకు నిధులు విడుదల చేయడంపై నగరంలోని 12వ డివిజన్‌కు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ రేగాన రూపాదేవి, డివిజన్ అధ్యక్షుడు నమ్మి గోపి, సింహాచలం ట్రస్ట్ బోర్డ్ మాజీ సభ్యురాలు డొంకాడ పద్మావతి, యువజన అధ్యక్షుడు మధుసూదనరావు, పార్టీ నాయకుడు బొంగ భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



రక్తదాతలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తులకు ఆదుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దివంగత సుందర గోవిందరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుందర హరీష్ ఆధ్వర్యంలో సుందరపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం ఏడాదిలో రెండు సార్లు రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రసూతి వైద్యాధికారి లేకపోవడంతో గర్భిణులకు వైద్యం అందించలేకపోతున్నామని వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రసూతి వైద్యాధికారిని వెంటనే నియమించాలని ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కొమ్ము్మరు సుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, కేబుల్ అప్పారావు, పడాల భాను, కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, కిలారి వెంకటరమణ, ఆళ్ల ఉదయబాబు, వైద్యులు శాలిని, అనిల్‌కుమార్, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

పేరు మార్పు అవమానకరమే..

● బీజేపీ నాయకురాలు పురందేశ్వరి



మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు పురందేశ్వరి

పూసపాటిరేగ: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చడమంటే ఆ మహానుభావుడ్ని అవమానించడమేనని బీజేపీ జాతీయ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మండలంలోని రెల్లివలసలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపోరు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో పలు సమస్యలు గాలికి వదిలేసి ఏప్పుడో పెట్టిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు ఎందుకు మార్చాల్సి వచ్చిందో చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకులకు ఉందన్నారు. ఎన్టీఆర్ కూడా సామాజిక వైద్యుడేనన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రానికి 25 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేవలం ఐదు లక్షల ఇళ్లు మాత్రమే మంజూరు చేశాయని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, నాయకులు గద్దె బాబురావు, బూర్లె శ్రీధర్, పతివాడ రామకృష్ణ, పి.రాజేష్, టీడీపీ నాయకులు ఇజ్జురోతు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని జిల్లా ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) ఎస్వీ రమణకుమారి అన్నారు. మండలంలోని గుంకలాంలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మురుగునీటి కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందుతాయని.. తద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధుల బారిన పడతారని తెలిపారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి ఎం.తులసి, అసిస్టెంట్ మలేరియా నివారణాధికారి డీవీ రమణ, సబ్ యూనిట్ అధికారి నర్సింహం, రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

నెల్లిమర్ల రూరల్: వరి పంటను ఆశిస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ తేజేశ్వరరావు, స్వాతి అన్నారు. మండలంలోని సతివాడలో వరి పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరి పంటకు తెగుళ్లు వ్యాపిస్తున్న నేపథ్యంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. కాండం కుళ్లు తెగుళ్లు ఆశిస్తున్నట్లు గుర్తించామని, దీని నివారణకు హెక్సాకొనజాల్ ఎకరానికి 400 ఎం.ఎల్ సరిపడా నీటిలో కలిపి మొదుళ్లు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ, ఏఓ పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

వృక్ష సంపద అందరి బాధ్యత

● వాకర్స్ డిప్యూటీ గవర్నర్ సుభద్రాదేవి



గురజాడ స్వగృహంలో మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు

విజయనగరం: ప్రాణకోటికి ఆధారమైన వృక్ష సంపదను అభివృద్ధి చేయడం అందరి బాధ్యతని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముల్లపూడి సుభద్రాదేవి అన్నారు. వనిత వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గురజాడ స్వగృహంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుభద్రాదేవి మాట్లాడుతూ, ఎన్ని మొక్కలు నాటామన్నది ప్రధానం కాదని, వాటిలో ఎన్ని వృక్షాలుగా ఎదగాయన్నది ముఖ్యమన్నారు. సాధారణంగా అందరూ సీజన్‌లో మొక్కలు నాటి వదిలేస్తారని, వాటిలో ఏ ఒక్కటి బతకనప్పుడు ఆ కార్యక్రమం వల్ల ఉపయోగం ఉండదన్నారు. మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ సాయి సంతోషిణి, కార్యదర్శి సీహెచ్ పార్వతి, ఎస్.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

విజయనగరం ఫూల్‌బాగ్: నెల్లూరులో ఈ నెల 24,25,26వ తేదీల్లో చేపట్టనున్న ఐద్వా మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కణపాక, వినాయకనగర్, రామకృష్ణానగర్‌లో సభలు నిర్వహించి, ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు సుజాత, సత్యవతి, దేవి, ఎం. జగదాంబ, జి.పుణ్యవతి, కుమారి, కృష్ణవేణి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకేత భాషా దినోత్సవం

విజయనగరం ఫూల్‌బాగ్: సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ బ్లైండ్ ఆధ్వర్యంలో ఎస్ఎంఆర్‌పీసీ చెవిటి పిల్లల పాఠశాలలో సంకేత భాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఎ.డి జగదీష్, పేర్ల శ్రీనివాసరావు, కె. ఉమాదేవి, బ్రహ్మకుమారీలు నర్మదాదేవి, అన్నపూర్ణ, వై. విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞతతో వ్యవహరించాలి

● సీఐ విజయనాథ్



సదస్సులో మాట్లాడుతున్న భోగాపురం సీఐ విజయ్‌నాథ్

డెంకాడ: ఇంజినీరింగ్ లాంటి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విజ్ఞతతో వ్యవహరించాలని భోగాపురం సీఐ కేకేవీ విజయ్‌నాథ్ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం శిక్ష పడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత స్థితిలో చూడాలని ఎన్నో వ్యయ,ప్రయాసలకోర్చి చదివిస్తున్న విషయాన్ని విద్యార్థులు మరువరాదన్నారు. ఎస్సై మహేష్ మాట్లాడుతూ, విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిర్మూలించేందుకు యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్స్, ర్యాగింగ్‌పై మెంటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, విద్యార్థి డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ షణ్ముఖరావు, ర్యాగింగ్ నిరోధక కన్వీనర్ ఆంజనేయులు, కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్‌సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా



పూసపాటిరేగలో ఈపంట నమోదు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న వ్యవసాయశాఖ జె.డి రామారావు, తదితరులు

● వ్యవసాయశాఖ జె.డి రామారావు

పూసపాటిరేగ: జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 28,240 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు సరఫరా చేసినట్లు వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వీటీ రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు ఈ పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుభరోసా కేంద్రాల ద్వారా 12,101 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 16,139 మెట్రిక్ టన్నులు ఎరువులు సరఫరా చేసినట్లు తెలిపారు. 495 రైతుభరోసా కేంద్రాల నుంచి రూ.19 కోట్ల విలువైన ఎరువులు విక్రయించినట్లు చెప్పారు. జిల్లాలో పంటలు వేసిన భూముల్లో 85 శాతం వరకు ఈక్రాప్ బుకింగ్ జరిగిందన్నారు. ఈనెల 27 లోపు ఈక్రాప్ బుకింగ్ శతశాతం పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 7,800 మెట్రిక్ టన్నుల యూరియా, 843 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1009 మెట్రిక్ టన్నుల పొటాష్, 1874 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 389 మెట్రిక్ టన్నుల సూపర్ ఫాస్ఫేట్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.నీలిమతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంపూర్ణ మౌలిక సదుపాయాలు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

● కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: అందరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. కార్పొరేషన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇందుకోసం ప్రధానోపాధ్యాయులు కాంప్లెక్స్ వారీగా ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ ఆధ్వర్యంలో ముందుగా వివిధ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను గుర్తించడం జరుగుతుందని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా ప్రాధాన్యతా క్రమంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలన్నదే ఏకైక లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, విద్యా కమిటీ సభ్యులు తాళ్లపూడి సంతోషికుమారి, బాలి పద్మావతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోండి..

● కలెక్టర్ సూర్యకుమారికి ఏబీవీపీ వినతి



కలెక్టర్ సూర్యకుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

విజయనగరం: నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ నిరుద్యోగులు, విద్యార్థులను దోచుకుంటున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్ ఎ.సూర్యకుమారిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిషత్ రాష్ట్ర నాయకుడు రాజాన రమణ మాట్లాడుతూ నీట్, జేఈఈ మెయిన్స్ కోచింగ్ పేర్లతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు. నగరంలోని చాలా కోచింగ్ సెంటర్లు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అటువంటి సెంటర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వంశీకుమార్, లోకేష్, దినేష్, మాధవ్, సాయికుమార్, తదతరులు పాల్గొన్నారు.

సక్రమంగా మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రమణమూర్తి సూచించారు. మండలంలోని సారిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించి మధ్యాహ్న భోజన నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం గోరుముద్ద పథకం కింద అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో భోజనాలు వండాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పైడిమాంబ చల్లదన మహోత్సవాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విజయనగరం టౌన్:

నగరంలోని కొత్త గవరవీధి రామమందిరం వద్ద కొలువైన పైడిమాంబ పంచమ వార్షికోత్సవ చల్లదన మహోత్సవాలు ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, ఉత్సవాల్లో భాగంగా పసుపుతో అమ్మవారి విగ్రహాలు తయారు చేస్తామన్నారు. 25న అమ్మవారి ఘటాలు ప్రతిష్ఠించడం, 108 మంది ముత్తైదువులతో విశిష్ఠ పూజలు.. సాయంత్రం అమ్మవారి తిరువీధి ఉత్సవాలు, పల్లకీ సేవ ఉంటుందన్నారు. 26న 101 మంది మహిళలతో 21 రకాల వస్తువులతో మహా కుంకుమాభిషేకం, సాయంత్రం అమ్మవారి అఖండ సారె ఊరేగింపు, రాత్రి 7 గంటలకు 101 దీపాలతో దీపారాధన ఉంటుందన్నారు. 27న భారీ ఎత్తున అన్నసమారాధన, సాయంత్రం ఘటాలతో, మేళ తాళాలతో భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అమ్మవారి దీక్షాపరులు పాల్గొన్నారు.

పీజీ డెంటల్ కోర్సులకు నేటినుంచి వెబ్ ఆప్షన్లు

సాక్షి, అమరావతి: పీజీ డెంటల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో వెబ్ ఆప్షన్ల నమోదుకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర కోటా సీట్లకు సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా సర్వీస్, నాన్–సర్వీస్ అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేయొచ్చు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సోమవారం సాయంత్రం నాలుగు గంటలలోగా విద్యార్థులు https:// mds.ntruhsadmissions.comలో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. ఈ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తితే అభ్యర్థులు 7416563063, 7416253073 నంబర్లను సంప్రదించవచ్చు.

ఆ రెండు వాహనాల డీలర్లకు నోటీసులు జారీ

- కొనుగోలుదారులకు న్యాయం చేస్తాం
- రవాణా శాఖ ప్రకటన

సాక్షి, అమరావతి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, వాహన కొనుగోలుదారులకు ఇబ్బందులు కలిగించడం వంటి అభియోగాలపై టయోటా వాహనాల డీలర్లు.. రాధామాధవ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, లీలాకృష్ణ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు నోటీసులు జారీ చేశామని రవాణా శాఖ తెలిపింది. మోటారు వాహనాల చట్టం కింద వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ ఈ నెల 12నే నోటీసులు జారీ చేసినట్టు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆ రెండు సంస్థల డీలర్‌షిప్‌ను రద్దు చేస్తున్నట్టుగా టయోటా కిర్లోస్కర్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఏడాది జూన్ 10న కొన్ని పత్రికల్లో ప్రకటన ద్వారా తెలిపిందని పేర్కొంది. ఆ రెండు సంస్థల డీలర్‌షిప్‌ల దరఖాస్తులను రవాణా శాఖ వెబ్‌సైట్‌లో జూన్ 13నే బ్లాక్ చేశామని చెప్పింది. అప్పటి నుంచి ఆ రెండు సంస్థల వాహనాల విక్రయాల లావాదేవీలేవీ రవాణా శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నిర్వహించడం లేదని వివరించింది. అయితే ఆ రెండు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా 32 వాహనాలను కొందరికి విక్రయించినట్టు తమ దృష్టికి వచ్చిందని రవాణా శాఖ తెలిపింది. దీంతో ఆ వాహనాలకు రిజిస్ట్రేషన్లు చేయించకపోవడంతో కొనుగోలుదారులు ఆ రెండు కంపెనీలపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టారని వివరించింది. కొనుగోలుదారులు మోసపోకూడదనే ఉద్దేశంతో వారికి ఓ అవకాశం కల్పిస్తున్నామని రవాణా శాఖ తెలిపింది. వాహనాల కొనుగోలుదారులు తమ వద్ద ఉన్న పత్రాలతో ఈ నెల 27న తమ పరిధిలోని ఉప రవాణా శాఖ అధికారి కార్యాలయానికి వెళ్తే వారి సమస్యను పరిష్కరిస్తారని పేర్కొంది.

సీఎం చెప్పినవన్నీ అక్షర సత్యాలే

- ప్రభుత్వం చేసిన లావాదేవీల నిబద్ధతను కాగ్ ప్రశ్నించనేలేదు
- యనమల అబద్ధాలపై మంత్రి బుగ్గన మండిపాటు



సాక్షి, అమరావతి : రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పినవన్నీ అక్షరసత్యాలేనని ఆర్థిక, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టంచేశారు. వీటిని జీర్ణించుకోలేకే టీడీపీ నేత, మాజీ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రివిలేజ్ నోటీసు ఇవ్వాలంటూ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని బుగ్గన మండిపడ్డారు. ప్రభుత్వం చేసిన లావాదేవీలను కాగ్ అసలు ప్రశ్నించలేదని, కేవలం విధానపరమైన అభ్యంతరాలనే వ్యక్తంచేసిందని బుగ్గన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏం తెలిపారంటే..

నివేదికలో తొలి నాలుగేళ్లు టీడీపీ పాలనపైనే..

టీడీపీ హయాంలో జరిగిందేమిటో.. గత మూడున్నర ఏళ్లలో ఆర్థిక నిర్వహణ ఎలా ఉందో అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రజలందరికీ సీఎం వివరించారు. కాగ్ తన నివేదికలో 2020–21 సంవత్సరపు ఆర్థిక పరిస్థితిపైనా, అంతకుముందు 2015–16 నుంచి 2020–21 సంబంధించిన ఆర్థిక అంశాలపైనా వ్యాఖ్యానించింది. నివేదికలోని అంశాల్లో తొలి నాలుగేళ్ల టీడీపీ పరిపాలనలోని ఆర్థిక వ్యవహారాలపైనే అనేది గ్రహించాలి. ఇందులో టీడీపీ పాలనలో జరిగిన ఆర్థిక ఉల్లంఘనలు, అవకతవకలున్నాయి. టీడీపీ పాలనలో ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.17వేల కోట్లు అదనంగా అప్పుచేస్తే దానిని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గుర్తించి తీవ్రంగా తప్పుబట్టింది. టీడీపీ పాలనలో అతిక్రమించి చేసిన అదనపు అప్పులను కారణంగా చూపి, ఇప్పుడు మా పాలనలో అప్పులు చేయరాదని నిర్దేశించింది. ఎఫ్ఆర్‌బీఎంను ఉల్లంఘించి అప్పులు ఎక్కువగా ఎవరు చేశారనేది ప్రజలు గ్రహించ లేరనుకుంటున్నారా? కాగ్ నివేదికలో ప్రధానంగా పేర్కొన్న అంశం.. లావాదేవీల సర్దుబాట్లకు సంబంధించినది. ప్రత్యేక బిల్లులపై ఆర్థికమంత్రి హోదాలో నేను గతంలోనే దీనిపై వివరంగా సమాధానం చెప్పాను.

ప్రత్యేక బిల్లులు యనమల సమయంలోనూ జరిగాయి..

సీఎఫ్ఎంఎస్ రిపోర్టింగ్ విధానంలో బుక్ అడ్జస్ట్‌మెంట్ లావాదేవీలను గుర్తించేందుకు మాత్రమే ప్రత్యేక బిల్లులు అంటారు. ఈ వ్యవహారంలో ఎలాంటి నగదు లావాదేవీలు జరగవని యనమలకు బాగా తెలుసు. కానీ, ఆయన ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, లేనిపోని అభాండాలు వేస్తున్నారు. 2018–19లో టీడీపీ ప్రభుత్వం ఇదే విధంగా 98,049 బుక్ అడ్జస్ట్‌మెంట్స్ లావాదేవీలను ప్రత్యేక బిల్లులుగా చూపిన విషయం మర్చిపోయారా? అప్పుడు ఆర్థికమంత్రి మీరే కదా? యనమల పేర్కొంటున్న రూ.26,839 కోట్ల ప్రత్యేక బిల్లులు నగదు లావాదేవీలు కావు. అవి కేవలం బుక్ అడ్జస్ట్‌మెంట్ మాత్రమే. ఈ లావాదేవీల సర్దుబాట్లకు కారణం సీఎఫ్ఎంఎస్‌లో సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సాఫ్ట్‌వేర్ మాడ్యూల్ లేకపోవడమే.

లావాదేవీల నిబద్ధతను కాగ్ ప్రశ్నించలేదు..

ఇక మా ప్రభుత్వం చేసిన లావాదేవీల నిబద్ధతను కాగ్ ప్రశ్నించనేలేదు. కేవలం విధానపరమైన విషయంలో మాత్రమే వారు అభ్యంతరం లేవనెత్తారు. ఈ సమస్యలన్నీ కూడా సీఎఫ్ఎంఎస్ వ్యవస్థను పటిష్ఠంగా రూపొందించకపోవడంవల్లే. ఈ కారణంగానే 2020–21లో ప్రత్యేక బిల్లుల ప్రక్రియను వినియోగించాం. దానిని సరిదిద్ది, గత 9 నెలలుగా కాగ్ సలహాల మేరకు స్పెషల్ బిల్లుల విధానం అనేది లేకుండా 'నిల్ అడ్జస్ట్‌మెంట్ బిల్లుల' పద్ధతిలో జమా ఖర్చుల నిర్వహణ జరుగుతోంది. ఇలా రూ 9,124.57 కోట్లకు సంబంధించిన 16,688 బుక్ అడ్జస్ట్‌మెంట్ లావాదేవీలు జరిగాయి.

యనమల తీరుకు చింతిస్తున్నా..

16,672 లావాదేవీల సర్దుబాట్లు ఒక పీడీ ఖాతా నుంచి మరో పీడీ ఖాతాలోకి మార్చేటపుడు తలెత్తిన లోపాలు మాత్రమే. ఏపీ ఫైనాన్స్ కోడ్ 271 (4) ఆర్టికల్ ప్రకారం.. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో ఆయా పీడీ అకౌంట్లలో ఖర్చుకాకుండా మిగిలిన నిధులను ఈ బుక్ అడ్జస్ట్‌మెంట్ లావాదేవీల ద్వారా ట్రెజరీ అధికారులు పూర్తిగా మురిగిపోయేటట్లుగా చేస్తారు. దీనికి సంబంధించి పదేపదే నేను వివరణలు ఇస్తున్నా అది విజ్ఞులైన యనమల ముందు బధిర శంఖారావంలా మారిపోయిందని చెప్పడానికి చింతిస్తున్నాను.

కోవిడ్‌వల్లే వృద్ధి తగ్గింది

ఇక 2020–21లో అతి తక్కువ వృద్ధిరేటు నమోదైందని కాగ్ వెల్లడించినట్లు యనమల చెప్పారు. కరోనాతో ఆ ఆర్థిక సంవత్సరం దేశమంతా అతలాకుతలమైంది. ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ప్రభావం చూపిందనే విషయాన్ని యనమల కావాలనే విస్మరించడం సబబేనా? అలాగే, కాగ్ నివేదికలో ద్రవ్యలోటు, రెవెన్యూ లోటు మన రాష్ట్రంలో బాగాలేదని, సరిచేసుకోవాల్సిన అవసరముందని వ్యాఖ్యానించింది. నిజానికి.. రాష్ట్ర విభజన, అనంతర టీడీపీ ఆర్థిక అస్తవ్యస్త పాలన, కోవిడ్ మహమ్మారి విలయతాండవం వంటి కారణాలవల్ల మన ఆర్థిక పరిస్థితి బాగా దెబ్బతిన్నది. అయినా మా ప్రభుత్వం మెరుగైన ఆర్థిక నిర్వహణ చేస్తూ ఇబ్బందులను చక్కదిద్దుతోంది. 2020–21 సంవత్సరానికి రెవెన్యూ వ్యయం 11 శాతం, రెవెన్యూ లోటు 34 శాతంగా ఉందని కాగ్ నివేదిక పేర్కొంది. ఆ సమయంలో కరోనా విలయతాండవం గురించి రాష్ట్ర ప్రజలకు తెలియని అంశం కాదు. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో సుమారు రూ.8 వేల కోట్లు తగ్గింది. ఆ సమయంలో మహమ్మారి కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.7,130 కోట్లు వ్యయంచేసింది.

యనమల అప్రజాస్వామికవాది..

సభను ఏకపక్షంగా నిర్వహిస్తున్నామని యనమల విమర్శించడం విడ్డూరంగా ఉంది. యనమలా.. మీకు రాజకీయ భిక్షపెట్టి, ఒక తండ్రిగా, ఒక గురువుగా చేరదీసిన ఎన్టీ రామారావుకే మీరు స్పీకర్‌గా ఉంటూ నామం పెట్టిన మహానుభావులు. ఎన్టీ రామారావుపై చెప్పులు వేయించిన చంద్రబాబు పార్టీకి దొడ్డిదారిన సహకరించిన అప్రజాస్వామికవాది మీరు. అలాంటి మీరు కూడా ప్రజాస్వామ్యం గురించి, చట్టసభల ఔన్నత్యాన్ని గురించి మాట్లాడే వారే!

మీ పాలన పుణ్యమే..

యనమలా.. మీ పాలన పుణ్యమా అని స్థానిక సంస్థలు చాలా కాలంగా డిస్కంలకు (విద్యుత్ సంస్థలకు) కరెంటు బిల్లులు చెల్లించడంలేదు. ఆ బకాయిలు ఇంచుమించు రూ.5,000 కోట్లకు చేరాయి. ఫలితంగా డిస్కంలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తున్నాయి. ఈ బకాయిలవల్ల డిస్కంలు స్థానిక సంస్థలకు కరెంటు సరఫరా నిలిపేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ బకాయిలన్నింటినీ 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించింది. కేంద్ర ఆర్థిక శాఖ ఇచ్చిన 14వ ఆర్థిక సంఘం మార్గదర్శకాల్లో ఉన్న సౌలభ్యాన్నే ఇందుకు వాడుకున్నాం. ఈ చెల్లింపులనూ యనమల రాద్ధాంతం చేస్తున్నారు. అయితే, మేం తీసుకున్న చర్యలను సమర్థిస్తూ అలా చేయడం సబబేనని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ బకాయిలు చెల్లించకపోతే కాగ్ తీవ్రంగా విమర్శించి ఉండేది.

ప్రజల ఖాతాల్లోకి రూ.57,512 కోట్లు జమ

ఆ కష్టకాలంలో రెక్కాడితే గాని డొక్కాడని ప్రజలందరూ ఉపాధి కోల్పోయి సురక్షితంగా ఉండటానికి తాపత్రయపడ్డారు. ఈ తరుణంలో వారందరి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. ఓ వైపు ఆదాయ వనరులు పడిపోతున్నా ఏమాత్రం జంకకుండా డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా ప్రజల ఖాతాల్లోకి నేరుగా రూ 57,512 కోట్లు జమచేసి వారిని ఆదుకున్నాం. ఇంత మొత్తంలో ఓ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఖాతాల్లో జమచేసిన సందర్భం కోవిడ్ సమయంలో ఎక్కడాలేదు.

అంతా పారదర్శకమే

- టీ–20 క్రికెట్ మ్యాచ్ టికెట్ల విక్రయాలపై హెచ్‌సీఏ అధ్యక్షుడు అజహర్ స్పష్టీకరణ
- మ్యాచ్ నిర్వహణపై సుప్రీం కమిటీ సమీక్ష

ఉప్పల్/సాక్షి, న్యూఢిల్లీ: క్రికెట్ మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో అన్ని రకాలుగా పారదర్శకత పాటించామని, తమ వైపునుంచి టికెట్లు బ్లాక్ అయ్యే అవకాశమే లేదని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు, భారత మాజీ కెప్టెన్ మహమ్మద్ అజహరుద్దీన్ స్పష్టం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య హైదరాబాద్‌లో ఆదివారం జరిగే మూడో టీ20 మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో నెలకొన్న గందరగోళంపై ఆయన ఈమేరకు స్పందించారు. జింఖానా మైదానంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని, మ్యాచ్ రోజున ఎలాంటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'టికెట్ల విక్రయం బాధ్యతను పేటీఎంకు అప్పగించాం. ఇందులో నేరుగా హెచ్‌సీఏ ప్రమేయం లేదు. ఆన్‌లైన్ టికెట్లను బ్లాక్ చేయడం ఎవరికీ సాధ్యం కాదు. హెచ్‌సీఏ టికెట్లను ఏ రకంగానూ బ్లాక్ చేయలేదు'అని చెప్పారు. ఆన్‌లైన్‌లో 11,450, 3,000 చొప్పున రెండుసార్లు, ఆఫ్‌లైన్‌లో 2,100 టికెట్లు విక్రయించామని చెప్పారు. తప్పనిసరిగా ఇవ్వాల్సిన స్పాన్సర్లు తదితరులకు 6 వేల టికెట్లు ఇచ్చినట్లు చెప్పారు. నిబంధల ప్రకారమే తమ క్లబ్ కార్యదర్శులకూ కాంప్లిమెంటరీలు ఇచ్చామని, ఈ విషయంలో తాను ఎలాంటి తప్పూ చేయలేదని అజహర్ పేర్కొన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

సజావుగా నిర్వహించేందుకు...

హెచ్‌సీఏలో కార్యకలాపాలు పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు నియమించిన కమిటీ మ్యాచ్ నిర్వహణకు సంబంధించి ఆన్‌లైన్‌లో సమీక్ష నిర్వహించింది. ఇందులో హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నిసార్ అహ్మద్ కక్రూ, ఏసీబీ డైరెక్టర్ అంజనీకుమార్, మాజీ క్రికెటర్లు వెంకటపతిరాజు, వంకా ప్రతాప్ పాల్గొన్నారు. మ్యాచ్‌ను సజావుగా నిర్వహించడమే ప్రధాన ఉద్దేశమని జస్టిస్ కక్రూ తెలిపారు. మ్యాచ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు కమిటీ హెచ్‌సీఏకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందన్నారు.

నెల రోజుల్లో లోపాలన్నీ సరిచేసుకోండి

- రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీలకు హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలు తమ లోపాలన్నింటినీ నెల రోజుల్లో సరిచేసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. తమ కాలేజీల్లో ప్రవేశాలు కావాలనుకుంటే ఇలా చేయడం తప్పదని పేర్కొంది. గడువులోపు లోపాలను సరిదిద్దుకోకపోతే ప్రవేశాల విషయంలో కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థులు ఎలాంటి హక్కును అభ్యర్థించలేరని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ తమ కాలేజీల గుర్తింపును ఆకస్మికంగా రద్దు చేశారని 16 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ విచారణ జరిపారు. ఉన్నత విద్యాశాఖ తరఫు న్యాయవాది కేవీ రఘువీర్ వాదనలు వినిపిస్తూ.. ఈ కాలేజీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని, మూడు నెలల్లో లోపాలను సరిచేసుకోవాలని మేలోనే నోటీసు ఇచ్చామన్నారు. అయినా ఆ కాలేజీలు లోపాలను సరిదిద్దుకోలేదని తెలిపారు.

వారికే రిటైర్మెంట్ వయసు పెంపు

- సంఘటిత నిధి నుంచి జీతాలు పొందే వారికే వర్తింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ సంఘటిత నిధి నుంచి వేతనాలు, అలవెన్సులు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంపు వర్తిస్తుందని ఆర్థిక శాఖ స్పష్టత ఇచ్చింది. మిగతా వారికి పదవీ విరమణ వయసు పెంపు వర్తించదని పేర్కొంది. అధికారం లేకపోయినా రిటైర్మెంట్ వయస్సు పెంచుతున్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని ఈ నెలాఖరులోగా నివేదికను ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ శుక్రవారం సర్క్యులర్ మెమో జారీ చేశారు.

నిస్సారంగా 'టాలెంట్ గుర్తింపు'



ఓ క్రీడాకారిణి బరువు పరిశీలిస్తున్న డీఎస్ఏ చీఫ్ కోచ్ మాధురీలత

శ్రీకాకుళం న్యూకాలనీ: శాప్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రొగ్రాం (టీఐపీ) జిల్లాలో నిస్సారంగా సాగింది. అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో క్రీడాకారులు ఉసూరుమన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా శుక్రవారం జరిగిన ఈ టీఐపీ ఎంపికల ప్రక్రియకు కేవలం జిల్లా నలుమూలల నుంచి కేవలం 75 మంది మాత్రమే హాజరయ్యారు. వీరంతా ప్రస్తుతం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పరిధిలోని శాప్/డీఎస్ఏ శిక్షకుల వద్ద తర్ఫీదు పొందుతున్న క్రీడాకారులే. గ్రామీణస్థాయి క్రీడాకారులకు టీఐపీ కార్యక్రమాన్ని, దీని ప్రాముఖ్యతను తీసుకెళ్లడంలో అధికారులు ఆసక్తి చూపించలేదనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

'చంద్రమ్మ పోరాటం మరువలేనిది'



కామ్రేడ్ పైల చంద్రమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

టెక్కలి: విప్లవోద్యమంలో దశాబ్దాల కాలం పాటు ఎనలేని పోరాటాలు చేసిన మహిళా ఉద్యమ నాయకురాలు కామ్రేడ్ పైల చంద్రమ్మ అని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం టెక్కలిలో కామ్రేడ్ పైల చంద్రమ్మ ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం అప్పలనాయుడు మాట్లాడుతూ.. విప్లవ జీవితంలో అత్యధికంగా జైలు జీవితం గడిపిన మహిళా ఉద్యమ నాయకురాలు చంద్రమ్మ అని పేర్కొన్నారు. చంద్రమ్మ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ పని చేయాలని అప్పలనాయుడు కోరారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో న్యూ డెమొక్రసీ జిల్లా కార్య దర్శి వంకల మాధవరావు, వి.కృష్ణ, జి.బాలకృష్ణ, బి.కూర్మారావు, పీడీఎస్‌యూ నాయకు లు ఎం.వినోద్, కుసుమ, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి సోమేష్, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీట్లు 1794.. ప్రవేశాలు 1454

- జిల్లాలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో 81 శాతం ప్రవేశాలు
- మొదటి కౌన్సెలింగ్ పూర్తి



క్లాస్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్–2022 మొదటి కౌన్సెలింగ్ పూర్తయ్యింది. ఉన్నత విద్యా మండలి ఈ మేరకు సీట్లను ప్రకటించింది. జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 1794 సీట్లకు 1454 ప్రవేశాలు జరిగాయి. ప్రభుత్వ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలు నిర్వహిస్తారు. ప్రైవేట్ కళాశాలలో 70 శాతం కన్వీనర్, 30 శాతం మేనేజ్‌మెంట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

కళాశాల	సీట్లు	ప్రవేశాలు	శాతం
బీఆర్ఏయూ కళాశాల	330	180	54.54
ఐతం, టెక్కలి	864	834	96.52
శ్రీ శివానీ, చిలకపాలెం	264	211	79.09
శ్రీ వెంకటేశ్వర, ఎచ్చెర్ల	336	229	68.00

ఇంజినీరింగ్ కాలేజీల్లో గతంలో ఎక్కువ సీట్లు ఉండేవి. అయితే చాలా కాలేజీల్లో కనీస సదుపాయాలు కనిపించేవి కావు. దీంతో జాతీయ సాంకేతిక విద్యా మండలి, ఉన్నత విద్యామండలి కళాశాలల నిర్వహణ, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. కొన్నేళ్ల కిందట చిలకపాలెం, చినరావుపల్లి, టెక్కలి, పలాస, శ్రీకాకుళం పట్టణ సమీప ప్రాంతాల్లోని ఐదు ఇంజినీరింగ్ కాలేజీలో ప్రవేశాలు లేక మూతబడ్డాయి. ఇక నిర్వహణలో ఉన్న కళాశాలల్లో వరసగా 30 శాతం మూడేళ్ల ప్రవేశాలు జరగని బ్రాంచ్‌లు సైతం మూసివేశారు. దీంతో ప్రతి కళాశాలలో 50 శాతం పైబడి ప్రవేశాలు జరుగుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్ బ్రాంచ్‌లు ఉండగా, ఈ ఏడాది సివిల్, ట్రిపుల్ ఈ ప్రారంభించారు. ప్రవేశాలు అనుకున్న స్థాయిలో జరగకపోయినా రెండో విడతలో మెరుగ్గా ప్రవేశాలు జరిగే అవకాశం ఉంది.

సీఎస్ఈకి ప్రాధాన్యత..

జిల్లాలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో సివిల్, సీఎస్‌డీ, సీఎస్ఈ, సీఎస్ఎం, ఈసీఈ, ఐఎన్ఏ, మెకానికల్, ఏఐ వంటి బ్రాంచ్‌లు ఉండగా, ఎక్కువ మంది విద్యార్థులు సీఎస్ఈ, ఏఐ, ఈసీఈ వంటి బ్రాంచ్‌లకు ప్రాధాన్యత నిచ్చారు. జిల్లాలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు 6709 మంది రాయగా, శ్రీకాకుళం సహాయ కేంద్రంలో 4265 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, పట్టణ ప్రాంతాల్లో పేరున్న ఇంజినీరింగ్ కాలేజీలకు ప్రాధాన్యమిచ్చారు. రెండో కౌన్సెలింగ్‌లో కాలేజీ, బ్యాచ్‌ల మార్పు, ఏపీ ఈఏపీ సెట్‌లో ర్యాంకు వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు హాజరయ్యే అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం సీట్లు లభించిన విద్యార్థులు ఈ నెల 27 లోపు కళాశాలలకు సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. 26 నుంచి ఇంజినీరింగ్ క్లాస్ వర్క్ ప్రారంభం కానుంది.

కాలేజీలకు రిపోర్టు చేయాలి



సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలలకు రిపోర్టు చేయాలి. ఈ నెల 26 నుంచి ఇంజినీరింగ్ క్లాస్‌వర్క్ ప్రారంభమవుతుంది. తుది విడత కౌన్సెలింగ్ వరకు విద్యార్థులు కళాశాలలు, బ్రాంచ్‌ల మార్పునకు అవకాశం ఉంటుంది. కళాశాలలకు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు అందజేయటం, ఫీజుల చెల్లింపు వంటివి చేయనవసరం లేదు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

– జి.దామోదర్‌రావు, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయ కర్త.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



విజేతలుగా నిలిచిన విద్యార్థినులతో జేసీ విజయ సునీత, ఏపీసీ జయప్రకాష్, ఇంటాక్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: బాలబాలికలు ఉన్నతమైన క్రమశిక్షణ, నడవడికను అలవర్చుకుని సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని జాయింట్ కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. శ్రీకాకుళం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ వేదికగా శుక్రవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కేజీబీవీ విద్యార్థినులకు ఇంటాక్ సంస్థ హెరిటేజ్ క్విజ్ పోటీలను నిర్వహించింది. కార్యక్రమానికి హాజరైన జేసీ మాట్లాడుతూ లక్ష్యాన్ని పెట్టుకుని దాన్ని సాధించేందుకు నిరంతరం పాటుపడాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర, జిల్లా సంస్కృతి, కళలు, వారసత్వ సంపద గురించి నేటి తరం విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన కొత్తూరు, జి.సిగడాం, సంతకవిటి, కంచిలి కేజీబీవీ విద్యార్థినులకు జేసీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్ఓ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంఐసీ కోఆర్డినేటర్ బి.శోభ, జీసీడీఓ జ్యోతి ఇంటాక్ ప్రతినిధులు బాడాద దేవభూషణరావు, పి.జగన్నాథరావు, ఎం.ప్రసాదరావు, రమణమూర్తి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు అవగాహన కల్పించాలి'

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం ఏడీఏ బాబాజీ అన్నారు. కొత్తూరులో ఐసీఆర్‌పీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రెండు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం బడి కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని సూచించారు. రబీలో సాగు చేయాల్సిన అపరాల విత్తనాలు అవసరమైన రైతులను గుర్తించాలని సూచించారు. రబీలో రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని చెప్పారు.

కార్యక్రమంలో ఏడీఏ రాజగోపాలరావు, ఎంటీలు సూర్యనారాయణ, గోవిందరావు, పీఆర్‌పీ నాగేంద్రలతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల వేళ

- పాతపట్నం నీలమణి దుర్గ ఉత్సవాలకు ఏర్పాట్లు
- 26 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- దసరా రోజున వాహనాలకు ప్రత్యేక పూజలు



శ్రీనీలమణిదుర్గ అమ్మవారి ఆలయం



ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీనీలమణిదుర్గ అమ్మవారు

పాతపట్నం: ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని పాతపట్నంలో వెలసిన నీలమణి దుర్గ అమ్మవారి సన్నిధిలో ఉత్సవాలకు వేళయ్యింది. అమ్మవారిని జిల్లా వాసులతో పాటు, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన భక్తులు నిత్యంకొలుస్తుంటారు. కోల్‌కతా, కటక్, భువనేశ్వర్, బరంపూర్, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పర్లాకిమిడి, గుణుపూర్ వంటి పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వస్తుంటారు.

400 ఏళ్ల చరిత్ర

నీలమణి దుర్గ అమ్మవారి ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో ఈ ప్రాంతం దట్టమైన అడవి. ఒడిశా పర్లాకిమిడి మహారాజులు పరిపాలన కోసం ఈ ప్రాంతం మీదుగానే టెక్కలి వెళ్లేవారు. 1674వ సంవత్సరంలో గజపతి మహారాజుకు చెందిన కూలీలు పొలం దున్నుతుండగా అమ్మవారి విగ్రహం నాగలికి తగిలి బయటపడిందని స్థానికంగా చెబుతుంటారు. అనంతరం అమ్మవారు మహారాజు కలలో కనిపించి ఆలయాన్ని నిర్మించాలని సూచించడంతో ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని ప్రతీతి.


అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. రోజుకో అవతారంలో అమ్మ దర్శనమిస్తారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు కుంకుమ పూజ, కలశ పూజ, అష్టోత్తర శతనామ పూజలు జరుగుతాయి. సాయంత్రం 3 గంటలకు సహస్ర నామ పూజ, కుంకుమపూజ ఉంటాయని ఆయల కార్య నిర్వహణ అధికారి టి.వాసుదేవరావు తెలిపారు.

వాహనాలకు ప్రత్యేక పూజలు

దసరా రోజున కొత్త వాహనాలతో ఈ ఆలయ ప్రాంగణం నిండిపోతుంది. దసరా రోజున వాహనాలకు ఇక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే 26న సర్వాలంకృత శ్రీనీలమణి దుర్గ, 27న బాలా త్రిపురసుందరి, 28న గాయత్రీదేవి, 29న లలితాత్రిపుర సుందరి, 30న అన్నపూర్ణాదేవి, అక్టోబర్ 1న మహాలక్ష్మిదేవి, 2న సరస్వతీ దేవి, 3న దుర్గాదేవి(దుర్గాష్టమి), 4న మహిషాసురమర్ధిని, 5న రాజరాజేశ్వరిగా అలంకరణ ఉంటుందని ఆలయ ఈఓ తెలిపారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



పాతపట్నం నీలమణి దుర్గ దసరా ఉత్సవాలకు దేవదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఒక క్రమ పద్ధతిలో ఆలయంలోనికి పంపడానికి క్యూలైన్‌తో కూడిన స్టీల్ గేట్లు ఏర్పాట్లు చేస్తున్నాం. సీఐ ఎం.వినోద్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందో బస్తు కోసం పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు పోలీస్ స్టేషన్‌ల నుంచి పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు.

– టి.వాసుదేవరావు, కార్యనిర్వాహణాధికారి, పాతపట్నం

'కేంద్ర నిధులతో అనేక సంక్షేమ పథకాలు'

లావేరు: కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలవుతున్నాయని కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. మండలంలోని బెజ్జిపురం గ్రామంలో శుక్రవారం బీజేపీ ప్రజాపోరు యాత్ర జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఆమె తొలుత గ్రామంలోని ఎన్టీఆర్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ బీజేపీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

న్యాయమైన ఆశయం



కార్తీక

పెద్దవాళ్లు, చుట్టుపక్కల వాళ్లు చేసేది చూసి పిల్లలు అనుకరిస్తుంటారు. కొంతమంది అనుకరణతో ఆగిపోకుండా వాళ్లలాగే తామూ ఎదగాలన్న లక్ష్యాన్ని పెట్టుకుని ఆ దిశగా అడుగులు వేస్తుంటారు. ఈ కోవకు చెందిన అమ్మాయే 23 ఏళ్ల కార్తీక గెహ్లాట్. తండ్రి ఉద్యోగరీత్యా డ్రైవర్. న్యాయమూర్తులను కోర్టుకు తీసుకెళ్లడం ఆయన పని. చిన్నప్పటి నుంచి నాన్న నడిపే కారులో ఎంతో హుందాగా ఉండే న్యాయమూర్తులను దగ్గర నుంచి చూసిన కార్తీక తను కూడా జడ్జీ కావాలనుకుంది. నేను పెద్దయ్యాక నల్లకోటు ఆఫీసర్ అవుతాను అని అనుకరించి చూపిస్తూండేది. అది చూసిన వారంతా చిన్నపిల్ల చేష్టలనుకునేవారు. కానీ నేడు కార్తీక జుడీషియల్ సర్వీసెస్ పరీక్షలో మంచి మార్కులతో 66 ర్యాంకు సాధించి పిల్లచేష్టలు కాదు, మరికొన్నేళ్లలో జడ్జిని కాబోతున్నానని చెప్పకనే చెబుతూ అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది.

జోధ్‌పూర్‌కు చెందిన రాజేంద్ర గెహ్లాట్ ముద్దుల కూతురే కార్తీక గెహ్లాట్.

31ఏళ్లుగా ప్రధాన న్యాయమూర్తులెందరికో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు రాజేంద్ర. రాజస్థాన్ హైకోర్టులో పనిచేస్తున్న ఎంతోమంది జడ్జీలను, లాయర్లను చూస్తూ పెరిగిన కార్తీక తాను కూడా పెద్దయ్యాక జడ్జి కావాలనుకునేది. ఆరోతరగతిలో ఉండగా నల్లకోటు వేసుకుని న్యాయస్థానంలో పనిచేయాలని గట్టిగా నిర్ణయించుకుంది. అప్పటి నుంచి ఆదిశగా అడుగులు వేస్తూ... జోధ్‌పూర్‌లోని సెయింట్ ఆస్టిన్ సీనియర్ సెకండరీ స్కూల్లో పాఠశాల విద్య పూర్తిచేసింది. ఇంటర్మీడియట్ తరువాత జై నారాయణ్ వ్యాస్ యూనివర్సిటీలో ఐదేళ్ల బిబిఏ.ఎల్ఎల్.బి. పూర్తిచేసింది. ఈ ఏడాదే డిగ్రీ పూర్తిచేసినప్పటికీ జడ్జీ అయ్యేందుకు 2019 నుంచి సన్నద్ధమవడం ప్రారంభించింది. ఒక పక్క సెమిస్టర్ పరీక్షల కోసం చదువుతూనే, మరోపక్క ప్రిలిమినరీ, మెయిన్స్‌కు ప్రిపేర్ అయ్యేది. కరోనా సమయంలో ఆఫ్ లైన్ క్లాసులు అందుబాటులో లేకపోవడంతో, ఆన్‌లైన్ గతులకు హాజరవుతూ సిలబస్ పూర్తిచేసింది. ఇదే సమయంలో అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి గోవింద్ మాథూర్, జిల్లా సెషన్స్ జడ్జి మండల్ ప్రసాద్ బోహ్రాల వద్ద లా గైడెన్స్, అడ్వకేట్ ధర్మేంద్ర వద్ద ఏడాదిన్నర పాటు టెక్నికల్ గైడెన్స్, మాజీ ఐఏఎస్ అధికారి, తన మాజీ స్కూలు ప్రిన్సిపాల్ వంటి వారందరి సలహాలు సూచనలతో రోజుకి నాలుగు గంటలు కష్టపడి చదివేది. పరీక్ష తేది ప్రకటించిన తరువాత ప్రిపరేషన్‌ను పది నుంచి పన్నెండు గంటలకు పెంచింది. సోషల్ మీడియా వినియోగం ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో అన్నింటికీ దూరంగా ఉండి తన లక్ష్యంపై దృష్టిపెట్టి రాజస్థాన్ జుడీషియల్ సర్వీసెస్ పరీక్షలో 66వ ర్యాంకు సాధించింది. దీంతో తన చిన్ననాటి కల జడ్జీ కావడానికి మొదటి అడుగు వేసింది.

పెళ్లికాదని భయపడుతున్నారు

చాలామంది తల్లిదండ్రులు తమ కూతుర్లు లా చదువుతామంటే ఇష్టపడరు. లా చదివిన అమ్మాయిలకు పెళ్లిళ్లు కావు అని భయపడతారు. ఇలాంటి అపోహలు పోవాలంటే ప్రతి ఒక్కరికి చట్టం గురించిన ప్రాథమిక అవగాహన ఉండాలి. అప్పుడు తమ హక్కుల గురించి ధైర్యంగా పోరాడగలుగుతారు. నలుగురు సంతానంలో నేను ఒకదాన్ని. ప్రారంభంలో నా నిర్ణయాన్ని ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. తర్వాత కష్టపడి చదవడం చూసి ప్రోత్సహించారు. వారి సహకారంతో ఈ రోజు ఇంతమంచి ర్యాంకును సాధించగలిగాను. నన్ను ప్రేరణగా తీసుకుని నా తోబుట్టువులు సైతం లా చదివేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. నా ప్రిపరేషన్‌లో ఆన్‌లైన్ యాప్స్‌తో పాటు, ఏకాగ్రతతో చదవడానికి సంగీతం చాలా బాగా ఉపయోగపడ్డాయి.

– కార్తీక

> నేను న్యాయమూర్తులను కోర్టుకు తీసుకెళ్లడాన్ని అప్పుడప్పుడు కార్తీక చూసేది. అలా చూస్తూ పెరిగిన ఆమె 12 ఏళ్ల వయసులో ఒకరోజు నేను కూడా త్వరలో నల్లకోటు వేసుకుని జడ్జిని అవుతానని చెప్పింది. అప్పుడు నేను పెద్దగా పట్టించుకోలేదు. కార్తీక మాత్రం అప్పటి నుంచి జడ్జిఅవ్వాలన్న కలను నిజం చేసుకునేందుకు కష్టపడుతూనే ఉంది. వాళ్ల అమ్మకూడా తనని అన్ని విధాల సాయపడుతూ అండగా ఉండడంతో ఈ రోజు తన కలను సాకారం చేసుకుంది. ఏళ్లుగా ఎంతో మంది జడ్జీలను వెనుకసీట్లోకూర్చోపెట్టి తిప్పాను. భవిష్యత్‌లో నా కూతురు కూడా వారిలా వెనుక సీట్లో కూర్చోబోతున్నందుకు సంతోషంగా ఉంది.
>
> – కార్తీక తండ్రి రాజేంద్ర గెహ్లాట్




తల్లిదండ్రులతో కార్తీక

సెలవులకు ముందు

దసరా సెలవులు మొదలు కానున్నాయి.
పిల్లలు క్వార్టర్లీ ఎగ్జామ్స్ రాశారు.. కొందరు రాస్తున్నారు.
అందరూ మార్కులు ఎన్నొచ్చాయో ఇంట్లో చెబుతారు.
ఎక్కువ రావచ్చు.. తక్కువ రావచ్చు. పిల్లలతో ఎలా మాట్లాడాలి?
మరో ఆరు నెలల కాలంలో వారు చదువులో ఎదగడానికి ఇప్పుడు మాట్లాడేదే ముఖ్యం.
వారిని నొప్పించవద్దు. మరింత బాగా చదివేలా ఒప్పిద్దాం.

మార్కులు ఎన్ని వచ్చాయి?



ప్రతీకాత్మక చిత్రం

దసరా సెలవులు వచ్చేశాయి. వాటి గురించి పిల్లలు హుషారుగా ఎదురు చూసే ముందు పరీక్షలు వస్తాయని వారికి తెలుసు. అవి రాయాలి. మార్కులు తెచ్చుకోవాలి. తల్లిదండ్రుల, టీచర్ల మెప్పు పొందాలి. ఆ తర్వాత సెలవుల్ని ఎంజాయ్ చేయాలి.

తల్లిదండ్రులు కూడా పరీక్షలు బాగా రాయి... సెలవుల్లో ఫలానా చోటుకు తీసుకెళతాము అని చెబుతుంటారు. బాగా రాయడం అంటే బాగా రాయాలనే పిల్లలందరూ అనుకుంటారు. కాని సబ్జెక్ట్‌లన్నీ ఒకటి కాదు. పిల్లలందరూ ఒకటి కాదు. అన్ని సబ్జెక్టుల్లో అందరు పిల్లలూ ఒక్కలా తెలివి ప్రదర్శించలేరు. తెలివైన పిల్లలు కూడా ఇష్టపడని, సరిగా రాయని సబ్జెక్ట్‌లు ఉంటాయి. ఇవాళ్టి పరీక్షలకు గత రెండు మూడు వారాల్లో ఏవైనా ఇంట్లో అవాంతరాలు, పిల్లలకు అనారోగ్యాలు వస్తే వాటి ప్రభావం ఉంటుంది. పరీక్షల సమయంలో తెలిసిన ప్రశ్నకు జవాబు తెలిసినా సరిగ్గా రాయకపోవడం ఉంటుంది. పరీక్షలు అయ్యాక పిల్లలు తెచ్చే జవాబు పత్రాలు, వాటిలో కనిపించే మార్కుల వెనుక ఎన్నో విషయాలు ఉంటాయి. కాని తల్లిదండ్రులకు మాత్రం పిల్లల మార్కులు వందకు వంద, ఎనభైకు ఎనభై, యాభైకు యాభై, ఇరవై అయిదుకు ఇరవై అయిదు కనిపిస్తేనే ఆనందం. సంతోషం. బాగా చదివినట్టు లెక్క. మార్కులు మాత్రమే పిల్లలు బాగా చదివినట్టు నిరూపిస్తాయా?

సంతృప్తికి హద్దు

పూర్వం తల్లిదండ్రులు పరీక్షల్లో 60 శాతం మార్కులు వస్తే సంతోషపడేవారు. తర్వాత అది ఎనభైకి చేరింది. ఆ తర్వాత తొంభై శాతం మార్కులు తెచ్చిన పిల్లలను నలుగురికీ గర్వంగా చూపేవారు. ఇవాళ వంద శాతం తెచ్చుకుంటే తప్ప తల్లిదండ్రుల ముఖాలలో చిర్నవ్వు కనిపించడం లేదు. తల్లిదండ్రుల ఎదుట ముఖం చెల్లుబాటు అయ్యేందుకు, తల్లిదండ్రుల తిట్లు (కొందరు కొడతారు) తప్పించుకునేందుకు ఆ సబ్జెక్ట్‌లు వచ్చినా రాకపోయినా మంచి మార్కులు తెచ్చుకోవాలనే వొత్తిడి పిల్లలు ఎలా తట్టుకోవాలి?

ప్రోత్సాహకాలు

పిల్లలు బాగా చదివితే ప్రోత్సాహకాలు ఇచ్చి తల్లిదండ్రులు వారిని ఉత్సాహపరచాలి. రోజూ వారితో పాటు కాసేపు కూచుని వారు చదువుకుంటూ ఉంటే మెచ్చుకోవాలి. వారికి సందేహాలుంటే తాము తీర్చగలిగితే తీర్చాలి. లేదా వారి అనుమతితో (వారు వద్దంటే వద్దు) ట్యూషన్లు పెట్టాలి. అన్నింటి కంటే ముఖ్యం ఇప్పుడు మార్కులు తక్కువ వచ్చాయి కాబట్టి దసరా సెలవుల వంటి సందర్భాల్లో కూచోబెట్టి బలవంతంగా చదవమని శిక్ష విధించకూడదు. పిల్లలు వారి సరదా సమయాలను ఎంజాయ్ చేయనివ్వాలి. అదే సమయంలో బాగా చదవడం వారి బాధ్యత అని వారికి తెలియచేయాలి.

టీచర్లు సమర్థులేనా?

పిల్లలు మార్కులు తెచ్చారు. వాటిని తల్లిదండ్రులు చూశారు. కొన్ని పేపర్లలో మంచి మార్కులు వచ్చాయి. కొన్నింటిలో తక్కువ వచ్చాయి. వెంటనే ఇరుగింటి వారి ముందు పొరిగింటి వారి ముందు తిట్టడం మొదలుపెట్టకూడదు. 'గ్రేడ్స్ షేమింగ్'... అంటే ఇతర పిల్లల మార్కులు కనుక్కొని మన పిల్లల కంటే ఎక్కువ వచ్చి ఉంటే అవమానించవద్దు. వారికి ఎందుకు వచ్చాయి నీకు ఎందుకు రాలేదు అని దబాయించవద్దు. మొదట పిల్లలతో మాట్లాడాలి. స్నేహంగా కూచోబెట్టుకోవాలి. సమస్య ఏమిటో అడగాలి. కొన్ని సబ్జెక్ట్‌లు ఎందుచేతనో పిల్లలకు పట్టుబడవు. కొందరు ఇంగ్లిష్‌లో బాగా చదివి లెక్కల్లో పూర్‌గా ఉంటారు. కొందరు సైన్స్ బాగా చదివి తెలుగు తప్పులు రాస్తారు. ఏ సబ్జెక్ట్‌లో వారికి ఎటువంటి సమస్య ఉందో తెలుసుకోవాలి. స్కూల్లో ఆ సబ్జెక్ట్‌లు చెప్పే టీచర్లతో వారికి స్నేహం ఉందా లేదా ఆ టీచర్లు ఆసక్తిగా చెబుతున్నారా కటువుగా చెప్తున్నారా తెలుసుకోవాలి. వీక్‌గా ఉన్న సబ్జెక్ట్‌లు ఇంట్లోగాని ట్యూషన్ ద్వారా గాని చెప్పే అవకాశం గురించి ఆలోచించాలి. ఇవన్నీ లేకుండా మార్కులు తక్కువ వచ్చాయని దండనకు దిగడం పిల్లల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తుంది.

పిల్లలూ తప్పులు చేస్తారు

పిల్లలు కూడా తప్పులు చేస్తారు. నిర్లక్ష్యంగా ఉంటారు. సరిగా చదవకుండా ఎలాగోలా రాయొచ్చులే అనుకుంటారు. తీరా పరీక్షలు రాశాక తెల్ల మొఖం వేస్తారు. మార్కులు వచ్చాక చేసిన తప్పు తెలుసుకుంటారు. వారు కూడా తమకు వచ్చిన మార్కులకు సిగ్గు పడతారు. ఆ స్థితి గమనించి తల్లిదండ్రులు 'పర్వాలేదు. ఈసారి జాగ్రత్త పడు' అని చెప్పేలా ఉండాలి. ఇప్పుడు క్వార్టర్లీ రాశారు కనుక హాఫ్ ఇయర్లీ వరకూ ఇంప్రూవ్ కావాలని... యాన్యువల్ ఎగ్జామ్స్‌కు ది బెస్ట్‌గా ఎదగవచ్చని ధైర్యం చెప్పాలి. అందుకు తాము సాయం చేస్తామని భరోసా ఇవ్వాలి. తక్కువ మార్కులు వచ్చి అసలే ఇబ్బంది పడుతున్న పిల్లలను ఇంకా ఇబ్బంది పెట్టకూడదు.

వాస్తవాన్ని అంగీకరించమని చెప్పాలి

కష్టపడి చదివి రాయవలసినంత రాయి.. మార్కుల సంగతి ఆ తర్వాత అని పిల్లలకు తల్లిదండ్రులు చెప్పకపోతే పిల్లల ఆలోచనలు పరి పరి విధాలుగా పోయే అవకాశం ఉంది. తమ వాస్తవిక పరిస్థితిని వారు అంగీకరించి దానిని తల్లిదండ్రులకు చెప్పే వాతావరణం ఇంట్లో ఉండాలి. 'అమ్మో మార్కులు తక్కువ వచ్చాయి. తిడతారు. ఎక్కువ వచ్చాయని అబద్ధం చెబుదాం' అని పిల్లలు అనుకుంటే ఆ తల్లిదండ్రులు ఫెయిల్ అయినట్టు లెక్క. ఒక్కోసారి మార్కులు తక్కువ వస్తే పిల్లలు ఇళ్ల నుంచి పారిపోయారంటే ఆ తల్లిదండ్రులు ఇంకా దారుణమైన పెంపకం వహిస్తున్నట్టు. పిల్లలు ఎలాంటి ఇబ్బంది అయినా తల్లిదండ్రులతో చెప్పే స్నేహం అవసరం. అందుకు సమయం ఇస్తున్నామా లేదా అని తల్లిదండ్రులు పరీక్షించుకోవాలి.

క్వార్టర్లీ పరీక్షలు మీ పిల్లల పరిస్థితిని, వారి పట్ల మీ అవగాహనను తెలియచేశాయి.

వార్షిక పరీక్షలకు పిల్లలతో పాటు మీరు వారితో కలిసి ప్రయాణించడానికి ప్రేమతో, ఓర్పుతో, స్నేహంతో దారి వేసుకోండి.

పిల్లలను ఉత్సాహపరిస్తే అద్భుతాలు చేస్తారు. బెదరగొడితే చతికిల పడతారు. గమనించండి.

కిచెన్‌టిప్స్



- వెల్లుల్లిపాయలకు కొద్దిగా వైట్ వెనిగర్ రాసి నిల్వచేస్తే పాడవకుండా ఎక్కువ రోజులపాటు నిల్వ ఉంటాయి.
- వెండి ఆభరణాలను ఇరవై నిమిషాలపాటు కోలిన్ లిక్విడ్‌లో నాన బెట్టి, తరువాత షాంపూతో కడిగితే మురికి అంతా పోయి కొత్తవాటిలా మెరిసిపోతాయి.



- ఆమ్లెట్ వేసే ముందు పెనం మీద ఉప్పు చల్లితే అంటుకోకుండా ఉంటుంది



- అన్నం వార్చినప్పుడు వచ్చిన గంజిలో కాస్త తేనె, నారింజ రసం లేదా కొద్దిగా నిమ్మ రసం, ఉప్పు కలుపుకుని తాగితే రుచిగా ఉండడంతోపాటు ఆరోగ్యానికి కూడా మంచిది.
- పూరీలు బాగా పొంగాలంటే, గోధుమ పిండిలో కొద్దిగా బొంబాయి రవ్వ లేదా బియ్యపు పిండి కలపాలి.



- చపాతీలు తెల్లగా మెత్తగా ఉండాలంటే పిండిలో రెండు చెంచాల పాలు, ఒక చెంచా బియ్యం పిండి, కొంచెం నూనె వేసి ఐస్ వాటర్‌తో పిండిని కలపాలి.



స్త్రీ శక్తి

అక్షరాలు అంటే వెన్నెల్లో ఆడుకునే అందమైన అమ్మాయిలే కాదు...
అగ్నిజ్వాలలు కూడా. ఆ వెలుగు ఎన్నో రకాల చీకట్లను పారదోలుతుంది.
'షీ ఈజ్-ఉమెన్ ఇన్ స్టీమ్' పుస్తకంలో ఎన్నో జీవితాలు ఉన్నాయి. ఎన్నో పోరాటాలు ఉన్నాయి.
స్ఫూర్తినిచ్చే ఎన్నో విజయాలు ఉన్నాయి...

స్ఫూర్తినిచ్చే సూపర్‌స్టార్స్

డెబ్బై అయిదేళ్ల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకొని ఎల్సా మేరి డిసిల్వా 'షీ ఈజ్-ఉమెన్ ఇన్ స్టీమ్' అనే పుస్తకాన్ని తీసుకువచ్చారు. 'స్టెమ్' (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మాథమెటిక్స్)కు విస్తరణ ఈ స్టీమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆర్ట్స్ అండ్ మ్యాథమేటిక్స్).

సైన్స్ నుంచి సమాజసేవ వరకు వివిధ రంగాలలో విశేష కృషి చేసిన డెబ్బై అయిదు మంది మహిళలను ఈ పుస్తకం ద్వారా పరిచయం చేశారు డిసిల్వా. పరిచయం అనడం కంటే వారి పర్సనల్, ప్రొఫెషన్ స్ట్రగుల్‌ను కళ్లకు కట్టారు అనడం సబబుగా ఉంటుంది.





ఈ పుస్తకంలో చోటు చేసుకున్న వివిధ రంగాల మహిళలు...

అదితి చతుర్వేది-టెక్నాలజీ పాలసీ, ఆనంది అయ్యర్-క్లైమెట్ సైన్స్ అండ్ కమ్యునికేషన్, అంజలి మల్హోత్ర-ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యునికేషన్ టెక్నాలజీ, అను ఆచార్య-హెల్త్ సైన్స్, అనుపమ్ కపూర్-హ్యూమన్ రిసోర్స్, అనుశ్రీ మాలిక్-ఎన్విరాన్‌మెంట్ సైన్స్, అపూర్వ బెడేకర్-మెడికల్ డివైజ్, అర్చన చుగ్-బయోలాజికల్ సైన్స్, ఆర్తి కశ్యప్-డిజైన్ అండ్ టెక్నాలజీ, అజ్రా ఇస్మాయిల్-డిజైన్ అండ్ టెక్నాలజీ, విజయలక్ష్మీ బిస్వాల్-హెల్త్ సైన్సెస్, బినేష్ పయట్టటి-ఎన్విరాన్‌మెంట్ సైన్స్, బిను వర్మ-ఎడ్యుకేషన్, బృంద సోమయ-ఆర్కిటెక్చర్, చంద నింబకర్-బయోలాజికల్ సైన్స్, చెర్లీ పెరైర-ఎన్జీవో, దీప్తి గుప్త-ఇంజనీరింగ్, దర్శన జోషి-ఫిజిక్స్, మనిషా ఆచార్య-ఇన్నోవేషన్, రాఖీ చతుర్వేది-బయోలాజికల్ సైన్స్, శుభాంగి ఉమ్‌బర్కర్-కెమికల్ సైన్స్, అర్చన శర్మ-ఇంజనీరింగ్, భారతి సింఘల్-బయోలాజికల్ సైన్స్, కల్పన నాగ్‌పాల్-ఫార్మాస్యూటికల్ సైన్స్, ప్రీతి షరన్-ఇంజనీరింగ్, షమిత కుమార్-ఎన్విరాన్‌మెంట్ సైన్స్, దుర్బసేన్‌గుప్త- బయోకెమిస్ట్రీ, ఏక్తా వివేక్ వర్మ-జెండర్ బేస్డ్ వాయిలెన్స్, గాయత్రి జోలి-డిజైన్ అండ్ టెక్నాలజీ, గీత మెహత-డిజైన్ అండ్ టెక్నాలజీ, గీతారాయ్-బయోలాజికల్ సైన్స్, జీవన్‌జ్యోతి పండ-బయోలాజికల్ సైన్స్, కైయిత్కి అగర్వాల్-ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యునికేషన్ టెక్నాలజీ, కరణ్ శైవ-సస్టేనబుల్ డెవలప్‌మెంట్, కవితా గోంసాల్‌వేజ్-డిజైన్ అండ్ టెక్నాలజీ, కిరణ్ బాలా-ఎన్విరాన్‌మెంట్ సైన్స్, కిరణ్ మన్రల్-ఆర్ట్స్ అండ్ కమ్యునికేషన్, లిజీ ఫిలిప్-సివిల్ ఇంజనీరింగ్, మాధవీలత గాలి-సివిల్ ఇంజనీరింగ్, మిథాలి నికోర్-ఎకనామిక్స్, మోనాలి హజ్ర-ఎన్విరాన్‌మెంట్ సైన్స్, మోనాలీసా ఛటర్జీ-ఫార్మాస్యూటికల్ సైన్స్, నమ్రత రాణా-క్లైమెట్ సైన్స్ అండ్ కమ్యునికేషన్స్, నందితా దాస్ గుప్త-ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, నీలమ్-సోషల్ ఇంపాక్ట్, నిహారిక మల్హోత్ర-హెల్త్ సైన్స్, నిష్మ వాంగూ-నానోసైన్స్ అండ్ నానో టెక్నాలజీ, పద్మ పార్థసారథి-ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యునికేషన్ టెక్నాలజీ, ప్రీతి అఘలయం-కెమికల్ ఇంజనీరింగ్, అర్పిత మోండల్-ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, జైదీప్ మల్హోత్ర-హెల్త్ సైన్స్, రాధిక-హెల్త్ సైన్స్, రంజని విశ్వనాథ్-కెమికల్ సైన్స్, రశ్మి పుట్చ-డిజైన్ అండ్ టెక్నాలజీ, రీతూపర్ణ మండల్-సెమీ కండక్టర్స్, రుమ పాల్-హెల్త్ సైన్స్, సంఘమిత్ర బందోపాధ్యాయ-న్యూరోసైన్స్, షెలక గుప్త-కెమికల్ ఇంజనీరింగ్, శిలో శివ్-ఆర్ట్స్ అండ్ కమ్యునికేషన్, శిల్పి శర్మ-ఎన్విరాన్‌మెంట్ సైన్స్, షీతల్ కక్కర్ మెహ్రా-సోషల్ ఇంపాక్ట్, శ్రుతి పాండే-ఆర్కిటెక్చర్, శ్యామల రాజారామ్-ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, శిమ్మి దర్నిజ-ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, శ్రీదేవి ఉపాధ్యాయుల-కెమికల్ ఇంజనీరింగ్, సుసన్-బయోలాజికల్ సైన్స్, స్వర్ణలత జె-కమ్యూనిటి సర్వీస్, తృప్తిదాస్-ఎన్విరాన్‌మెంట్ సైన్స్, వందన నసల్-ఫిజిక్స్, వనమాల జైన్-డిజైన్ అండ్ టెక్నాలజీ, వర్ష సింగ్-సైకాలజీ, విశాఖ చందేరె-క్లీన్ ఎనర్జీ, యమ దీక్షిత్- క్లైమేట్ సైన్స్ అండ్ కమ్యునికేషన్, జైబున్నిసా మాలిక్ - కంప్యూటర్ సైన్స్.

'ఎన్నో ఏళ్లుగా కార్పొరేట్, డెవలప్‌మెంట్ సెక్టర్‌లో పనిచేసిన నేను వివిధ రూపాల్లో ఉండే పురుషాధిక్యతను చూశాను. మహిళ అనే కారణంతో వారి ప్రతిభను పట్టించుకోని వారిని చూశాను. రకరకాల అనుభవాలు ఈ పుస్తకం తీసుకురావడానికి కారణం అయ్యాయి' అంటోంది పుస్తక రచయిత్రి ఎల్సా మేరి డిసిల్వా.

'షీ-ఈజ్' బుక్‌సిరీస్‌లో ఇంకా ఎన్నో పుస్తకాలు రానున్నాయి. మహిళాశక్తిని ప్రపంచానికి చాటనున్నాయి.

బ్యూటిప్స్

సిల్కీ షైనింగ్ ప్యాక్

నిర్జీవంగా... ఎండుగడ్డిలా ఉండే కేశాలను సిల్కీగా, షైనింగ్‌గా మార్చుకునేందుకు ఇంట్లో దొరికే వాటితో ప్యాక్‌ను ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం...

టీస్పూను అలోవెరా జెల్, టీస్పూను కాఫీ పొడి, టీస్పూను సాధారణ షాంపు, విటమిన్ ఈ క్యాప్సూల్‌ను ఒక గిన్నెలో వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు చివర్ల వరకు కండీషనర్‌లా అప్లైచేసి గంట తరువాత నీటితో కడిగేయాలి. వారానికి కనీసం రెండుసార్లు ఇలా చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉండడంతోపాటు సిల్కీగా మెరిసిపోతుంది.










ఒకటి రెండు రోజుల్లో దసరా సెలవులు మొదలవుతున్నాయి. ఈ మూడు నెలల నుంచి బుద్ధిగా బడికి వెళ్లి చదువుకుంటున్న పిల్లలు ఈ సెలవుల్లో కాస్త ఆటవిడుపు కోరుకోవడం సహజం. అమ్మమ్మ గారి ఊరికో, నానమ్మల దగ్గరకో, మేనత్త, మేనమామలు, పిన్నమ్మలు, పెద్దమ్మల దగ్గరకు వెళ్లగలిగే వాళ్లు ఎలానూ అందుకు ముందునుంచే ప్లాన్ చేసుకుని ఉంటారు. అయితే, కొందరికి మాత్రం ఊళ్లకు వెళ్లే అవకాశం లేకనో లేదా బంధువుల ఇళ్లకు వెళ్లడానికి అంతగా ఇష్టపడకపోవడం వల్లో టూర్లకు ప్లాన్ చేసుకుంటారు. టూర్ అనగానే ప్లానింగ్‌తోపాటు కొన్ని జాగ్రత్తలు, మరికొన్ని మెలకువలు ...

హ్యాపీ టూర్

పక్కా ప్లాన్

ఈ రోజులలో కుటుంబ సమేతంగా టూర్లకు వెళ్లాలంటే ఎక్కడకు వెళ్లాలనే దానిపై అంత తొందరగా ఏకాభిప్రాయానికి రావడం కష్టం. ఎందుకంటే కుటుంబ సభ్యులలో ఒక్కొక్కరికి ఒక్కో ప్రదేశం అంటే ఇష్టం ఉండచ్చు కాబట్టి ఎక్కడకు వెళ్లాలి, ఎంతదూరం వెళ్లాలి అనేది నిర్ణయించుకోవాలి. దానితోపాటు మరి కొన్ని ఇతర అంశాల పట్ల ముందస్తు జాగ్రత్త, అవగాహన అవసరం. అవేమిటో చూద్దాం.

కుటుంబ సభ్యులు, పిల్లలు లేదా వృద్ధులతో కలసి వెళ్ళేటపుడు ముందుగా అందరూ కలసి ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి. వెళ్లే ప్రదేశం పెద్దవాళ్లకు కూడా ఆసక్తి కలిగిస్తుందా లేదా పిల్లల వరకేనా అనేది ఆలోచించాలి. పెద్దవాళ్లకు ఇబ్బందిగా ఉంటుంది అనుకుంటే వారిని ఇంట్లోనే ఉంచడం మంచిది. సాధారణం గా పిల్లలు అడ్వెంచరస్ ప్రదేశాలను, పెద్దలు ఆటవిడుపు అంటే రిలాక్స్ అయేలా ఉండే ప్రదేశాలను చూడాలని కోరుకుంటారు కాబట్టి కుటుంబం అందరికీ ఇష్టమైన ప్రదేశాన్ని ఎంచుకోవడం మంచిది.

ప్రయాణపు ఖర్చును ప్లాన్ చేసుకోవాలి. మీరు గనక ఎక్కువ మందితో ప్రయాణిస్తూ ఉంటే టూర్‌కి బడ్జెట్ ప్లానింగ్ తప్పనిసరి.

ఎంతమంది వెళ్ళాలి? దారి ఖర్చులు ఎవరు పెట్టుకోవాలి, ఎంత పెట్టుకోవాలి, దానిని అందరూ కలసి ఎలా షేర్ చేసుకోవాలి.. వంటి వాటిని ముందుగానే నిర్ణయించుకోవాలి. అయితే పిల్లలు లేదా పెద్దవాళ్లు అకస్మాత్తుగా అనారోగ్యం బారిన పడవచ్చు. అందుకోసం కూడా కొంత మొత్తాన్ని కేటాయించుకోవడం మంచిది.



రూట్ మ్యాప్: మీరు వెళ్ళవలసిన ప్రదేశం రూట్ బాగా తెలుసుకోండి. కొత్త రూట్ లు అన్వేషించటం అందరికీ సరదాయే. కాని రూట్ తప్పితే, పిల్లలు, వృద్ధులతో సమస్య వస్తుంది. కనుక తెలిసిన రోడ్‌లపై ప్రయాణించండి. అయితే మరొక దారి కూడా మీకు తెలిసి ఉండాలి. వెళ్ళే మార్గంలో కల హోటళ్ళు, మెడికల్ షాప్‌ల గురించి కూడా తెలుసుకుంటే మంచిది.

చెక్ లిస్ట్: ప్రయాణానికి అవసరమైన అన్ని వస్తువులనూ సేకరించండి. వాటిలో ఫస్ట్ ఎయిడ్ కిట్, రోజువారీ వేసుకునే మందులు, నీళ్ల సీసాలు, కింగ్ వాటర్ వంటి అత్యవసరాలు మరువకండి. కొన్ని అదనపు దుస్తులు, పాత న్యూస్ పేపర్ లు, వేస్ట్ క్లాత్ ఒకటి పెట్టుకోండి.

వాగ్వాదాలు వద్దు: సాధారణంగా కుటుంబంలో వివిధ వయసులవారు వివిధ అభిరుచుల వారూ వుంటారు. ఎవరేం చెప్పినా, ప్రశాంతంగా విని చర్చ చేయండి. మార్గంలో మీకు ఇష్టం లేని ప్రదేశం, కుటుంబ సభ్యులకు ఇష్టమైన ప్రదేశం వంటివి తారసపడితే, వారి ఆనందాలు పాడు చేయక వాటిని వారికి చూపండి. కుటుంబ సభ్యుల ఐడియాలు కూడా వింటూ ట్రిప్ అందరికీ ఆనందం కలిగించేలా ఉండేట్లు చూసుకోండి.

పిల్లలతో ప్రయాణమా? చిన్న పిల్లలతో ప్రయాణం సులభం కాదు. బ్యాగ్‌ని హ్యాండిల్ చేయాలో లేదా పిల్లవాడిని హ్యాండిల్ చేయాలో అర్థం కాదు. మీరు పిల్లలతో ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు కష్టం మరింత పెద్దదిగా కనిపిస్తుంది.అయితే, మహిళలు తమ బిడ్డతో ప్రయాణించేటప్పుడు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటారు. అందువల్ల మీరు ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారు అనే దాని గురించి మీ దగ్గర పూర్తి సమాచారం ఉంటే మంచిది. ఉదాహరణకు, అక్కడి వాతావరణం, ఆహారం, పానీయాలు, విద్యుత్, నీటి వ్యవస్థ, భద్రత, అక్కడి అలవాట్లు వంటివి. ఇందుకోసం ఇంటర్నెట్‌లో వెదకవచ్చు లేదా తరచు ప్రయాణాలు చేసే స్నేహితుల సహాయం తీసుకోవచ్చు. అదేవిధంగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండటం అవసరం.

రివ్యూలు చదవండి: హోటల్‌ను బుక్ చేస్తున్నప్పుడు, దాని రివ్యూలను చదవండి లేదా వీలైతే, వాటి ఫోటోలను చూడండి. హోటల్ లేదా గది పిల్లలకు నచ్చేలా ఉందో లేదో తనిఖీ చేసుకోవాలి.

తక్కువ బరువు... ఎక్కువ సౌకర్యం: లెస్ లగేజ్... మోర్ కంఫర్ట్ అనే ఆంగ్ల సూక్తి అందరికీ తెలిసిందే. అంటే టూర్లు వేసేటప్పుడు మన దగ్గర ఎంత తక్కువ సామాను ఉంటే మన ప్రయాణం అంత సులభం అవుతుంది. కాబట్టి వీలైనంత వరకు స్మార్ట్ ప్యాకింగ్ చేయాలి. కానీ ఓవర్ ప్యాకింగ్‌ను నివారించాలి. పిల్లల ఆహార పదార్థాలు, రోజువారీ వేసుకునే మందులు, బొమ్మలు మొదలైన వాటిని చేతికి అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

చివరగా... ప్రయాణ సమయంలో హీల్స్ లేదా స్టైలిష్ షూలకు బదులుగా స్పోర్ట్స్ షూసే సౌకర్యంగా ఉంటాయని గుర్తుంచుకోండి.



హెల్త్ టిప్స్

పాలకూర రక్తాన్ని పలుచగా చేయడంలో సహాయ పడుతుంది. పాలకూర తరచు తీసుకోవడం వల్ల శరీరంలో రక్త సరఫరా పెరుగుతుంది. దీంతో హార్ట్ ఎటాక్‌లు రాకుండా ఉంటాయి. జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి.



ఆయాసం ఉన్నవారు రెండు చిటికల పసుపు, చిటికడు మెత్తటి ఉప్పు రోజూ తీసుకోవడం మంచిది. వేడి టీలో తొమ్మిది చుక్కల నిమ్మరసం, అర చెంచా తేనె కలిపి తాగడం చాలా మంచిది.

ఆయాసం బాగా ఎక్కువగా ఉన్నప్పుడు వంద గ్రాముల వామును వేడి చేసి పల్చని గుడ్డలో మూటగట్టి వీపు పైన, గొంతు పైన ఇరువైపులా కాపడం పెడుతుంటే కఫం కరిగి బయటకు వచ్చి శ్వాస కుదుటపడుతుంది. అదేవిధంగా లేత ముల్లంగి, వెలగపండు, తేనె వెల్లుల్లి తీసుకోవడం మంచిది. అయితే మినుములు, చేప, సొరకాయ, దుంపకూరలు, బచ్చలి కూర, నూనె పదార్థాలు, పుల్లటి పదార్థాలు, ఐస్ క్రీములు, కూల్ డ్రింక్స్, చన్నీటి స్నానం, మంచులో లేదా చల్లటి గాలిలో తిరగడం మంచిది కాదు.

నిమ్మరసం రోజు తాగటం వలన మ్యూకస్ ఉత్పత్తి నియంత్రించబడి గురకలను తగ్గిస్తుంది. ఒక చెంచా తాజా నిమ్మరసాన్ని రోజు ఉదయాన తాగటం వలన రాత్రి కలిగే ఈ గురకల నుండి ఉపశమనం పొందుతారు. అంతేకాకుండా, చక్కెర కలపని ఒక గ్లాసు నిమ్మరసం మీ శ్వాస గొట్టాలను శుభ్రంగా ఉంచి దగ్గు, జలుబులకు దూరంగా ఉంచుతుంది.

వెయిట్ లాస్

ఆరోగ్యంగా తగ్గండి



బరువు తగ్గాలి అంటే వ్యాయామం, డైటింగ్ ఒక్కటే సరిపోదు. సరైన వ్యాయామంతో పాటు ఆరోగ్యకరమైన తిండి, నిలకడగా వ్యాయామాలు చేయడం కొంచెం ఓపిక అవసరం. బరువు తగ్గడానికి అయినా పెరగడానికి అయినా వ్యాయామాల పాత్ర 20 శాతం ఉంటే, ఆహారం పాత్ర 80 శాతం ఉంటుంది. సాధారణ మనిషికి రోజుకు 2,200 క్యాలరీలు అవసరం. బరువు తగ్గాలనుకునే వారు తక్కువ తమకు అవసరమైన దానికన్నా తక్కువ క్యాలరీలు ఉండే ఆహారం తీసుకోవాలి. అంటే మన శరీరానికి 2,200 క్యాలరీలు అవసరమనుకుంటే, అంతకన్నా కొద్దిగా తక్కువ క్యాలరీలు ఉండేలా చూసుకోవాలి. ఉదాహరణకు రోజుకు 2000 క్యాలరీలు ఇచ్చే ఆహారం తీసుకోవాలి. అది కూడా ఆరోగ్యకరమైన ఆహారం... అంటే కూరగాయలు, పళ్ళు, మాంసకృత్తులు, ఓట్స్ లాంటివి తీసుకోవాలి. ● ముందుగా ఇంతకుముందు తింటున్న ఆహార పరిమాణాన్ని కొంచెం తగ్గించాలి. తీపి పదార్థాలు, శీతల పానీయాలు, బయట తిండి పూర్తిగా తగ్గించాలి. తోపుడు బండి వాళ్ల దగ్గరి నుంచి ఫైవ్ స్టార్ హోటల్ వాళ్ల వరకూ అందరూ తమ ఆహారం రుచిగా ఉండాలి అనే కోరుకుంటారు గాని ఆరోగ్యంగా ఉండాలి అని కాదు. ఆరోగ్యం అంటే శుభ్రత ఒకటే కాదు, తక్కువ క్యాలరీలు అని కూడా. ● ఎంతసేపు చేస్తున్నాము అన్నదానికన్నా ఎంత తీవ్రతతో చేస్తున్నాము, ఎన్ని క్యాలరీలు కరిగిస్తున్నాం అన్నది ముఖ్యం. ఉదా – ఒక గంటన్నర నడవడం వల్ల 500 క్యాలరీలు కరిగితే, 45 నిముషాలపాటు చేసే వర్క్ వుట్స్ వల్ల కూడా 500 క్యాలరీలు కరుగుతాయి. కాబట్టి చేసే వ్యాయామాల వల్ల రోజుకు ఎన్ని క్యాలరీలు కరుగుతాయో అంచనా వేసుకుని అందుకు తగ్గట్టు తినడం వల్ల మాత్రమే ఆరోగ్యంగా బరువు తగ్గగలం. లేదంటే బరువు తగ్గినా, నీరసం, అనారోగ్యం పాలవక తప్పదు.



కేరెంటింగ్

మీ పిల్లలకు ఈ అలవాట్లు నేర్పిస్తున్నారా?

- భోజనానికి ముందు కాళ్లూ, చేతులు కడుక్కోవడం, పడుకునే ముందు పళ్ళు తోముకోవడం /టాయిలెట్ వాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం అలవాటు చేయాలి.
- ఇవి శారీరక శుభ్రతకు సంబంధించినవి అయితే, పిల్లలకు టేబుల్ మ్యానర్స్, ఫోన్ మ్యానర్స్ నేర్పించడం, పెద్దవాళ్లతో గౌరవంగా, తోటివారితో మర్యాదగా నడుచుకోవడం, ఇతరులకు సాయం చేయడం వంటి అలవాట్లు చేయడం అత్యవసరం.
- అంతేకాదు, మంచి పుస్తకాలు చదవడం, చదివిన పుస్తకాలలోని విషయాలను చర్చించడం, వాటిని కాగితం మీద రాయించడం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, క్యారమ్స్ లేదా వారికి ఆసక్తి ఉన్న ఏవైనా ఆటలను, అభిరుచులను గుర్తించి ప్రోత్సహించడం, ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి వాటిని పిల్లలకు నేర్పించడం వల్ల పెద్దయ్యేకొద్దీ వారిలో ఆ మంచి లక్షణాలు పెంపొందుతాయి. మంచి పౌరులుగా గుర్తింపు పొందుతారు.

సినిమా

ఘోస్ట్‌కు అతిథులు


● అఖిల్


● నాగచైతన్య

'ది ఘోస్ట్' ఫంక్షన్‌కు అతిథులు ఖరారయ్యారు. నాగార్జున హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ది ఘోస్ట్'. సోనాల్ చౌహాన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో గుల్ పనాగ్, అనిఖా సురేంద్రన్ కీలక పాత్రలు పోషించారు. నారాయణ్‌దాస్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు, శరత్ మరార్ నిర్మించిన చిత్రం ఇది. ఆదివారం కర్నూలులో జరగనున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథులుగా నాగచైతన్య, అఖిల్ హాజరు కానున్నారు. అక్టోబరు 5న రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె. రాబిన్ (పాటలు భరత్–సౌరభ్), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకటేశ్వరరావు చల్లగుళ్ల.

బీసీ సెంటర్లో మొగాలి తాలియా..


● రవితేజ

'యే ఊరూవాడ ధూమ్ ధాము చెయ్యండ్రో..', 'బడా ఎంటర్‌టైన్మెంట్ వాలా ఆగయా, బీసీ సెంటర్లో మొగాలి తాలియా..' అంటూ సాగుతుంది 'మాస్ రాజా' సాంగ్. రవితేజ హీరోగా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ధమాకా'. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలోని 'మాస్ రాజా..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. భీమ్స్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా నికాష్ అజీజ్ పాడారు. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

ప్రేక్షకులకు థ్యాంక్స్

– కోటి


● అభిలాష్, కోటి, రవి శ్రీ దుర్గాప్రసాద్

''నేను ఈ రోజు ఇంత పెద్ద మ్యూజిక్ డైరెక్టర్ కావడానికి కారణమైన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని సంగీత దర్శకుడు, నటుడు కోటి అన్నారు. అభిలాష్ సుంకర, దీపిక ఆరాధ్య జంటగా రవి శ్రీ దుర్గా ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పగ పగ పగ'. సుంకర బ్రదర్స్ సమర్పణలో సత్యనారాయణ సుంకర నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. శుక్రవారం జరిగిన సక్సెస్ మీట్‌లో కోటి మాట్లా డుతూ– ''పగ పగ పగ' సినిమాకు మ్యూజిక్ చేద్దామని వెళ్లాను.. అయితే దాంతోపాటు నాతో యాక్టింగ్ కూడా చేయించారు. మా సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది.. ఇంకా పెద్ద హిట్ చేయాలి'' అన్నారు. ''మా సినిమాని చూడని వారు చూసి, మమ్మల్ని ఆశీర్వదించాలి'' అన్నారు రవి శ్రీ దుర్గా ప్రసాద్. ''మా స్టంట్ మాస్టర్ యూనియన్ సపోర్ట్ వల్లే ఈ సినిమా తీశాం. ప్రేక్షకుల స్పందన చూసి, మా కష్టం మరచిపోయాం'' అన్నారు నిర్మాతలు.

మాస్ పోస్టర్

చిరంజీవి హీరోగా మోహన్ రాజా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గాడ్ ఫాదర్'. ఈ చిత్రంలో నయనతార, సల్మాన్ ఖాన్, సత్యదేవ్ కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 'గాడ్ ఫాదర్' చిత్రం నుంచి మాస్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రబృందం. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్‌బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 5న తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.


● సమంత
దేవ్ మోహన్


● చిరంజీవి

శాకుంతలం రిలీజ్ ఎప్పుడంటే...

శకుంతల, దుష్యంత మహారాజు ప్రణయ గాథతో గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శాకుంతలం'. శకుంతలగా సమంత, దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించగా, 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. 'దిల్' రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, గుణ టీమ్ వర్క్స్ పై నీలిమ గుణ నిర్మించిన చిత్రం ఇది. 'శాకుంతలం' సినిమాను నవంబరు 4న విడుదల చేయనున్నట్లుగా శుక్రవారం చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మోహన్‌బాబు, ప్రకాష్‌రాజ్, మధుబాల, గౌతమి, అదితీ బాలన్, అనన్యా నాగళ్ల, జిస్సు సేన్ గుప్తా కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు.

రాబరీ నేపథ్యంలో...

పృథ్వీరాజ్, అనూ మెహతా జంటగా పి. నాగమణి సమర్పణలో ప్రవీణ శివరాజ్ ఓ సినిమా నిర్మించారు. రాబరీ నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ద్వారా పి. మణిరాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పి. మణిరాజ్ మాట్లాడుతూ – ''కొత్త తరహా కథ, కథనంతో తెరకెక్కిన ఈ చిత్రానికి ఓ ఆసక్తికరమైన టైటిల్ పరిశీలనలో ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. నవంబరులో సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు.


● అనూ మెహతా, మణిరాజ్, పృథ్వీరాజ్

సలార్ షురూ


● ప్రభాస్

ప్రముఖ దివంగత నటుడు కృష్ణంరాజు ఈ నెల 11న కన్ను మూసిన సంగతి తెలిసిందే. పెదనాన్న మరణించడంతో ప్రభాస్ తన తాజా చిత్రాల షూటింగ్ డేట్స్‌ని మళ్లీ ప్లాన్ చేయాల్సి వచ్చింది. పది రోజుల బ్రేక్ తర్వాత 'సలార్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు హీరో ప్రభాస్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా రూపొందుతున్న సినిమా 'సలార్'. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతిబాబు కీ రోల్ చేస్తున్నారు. బుధవారం నుంచి ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు ప్రభాస్. హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. వచ్చే నెల మొదటివారం వరకూ ప్రభాస్ ఈ సినిమా షూటింగ్‌తోనే బిజీగా ఉంటారని తెలిసింది. ఆ తర్వాత నాగ్ అశ్విన్ దర్శకత్వంలో చేస్తున్న 'ప్రాజెక్ట్ కె' సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు ప్రభాస్. ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్‌గా, అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక 'సలార్' చిత్రం వచ్చే ఏడాది సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది. 'ప్రాజెక్ట్ కె' 2024లో రిలీజ్ కానుందని తెలిసింది. అలాగే ప్రభాస్ నటించిన 'ఆది పురుష్' వచ్చే ఏడాది జనవరి 12న రిలీజ్ కానుంది.


● ప్రీ రిలీజ్ వేడుకలో పొన్నియిన్ సెల్వన్ చిత్రబృందం

అప్పుడు పెళ్లి ఆగిపోతుందేమోనని భయపడ్డా!

– సుహాసినీ మణిరత్నం

''నలభై రెండేళ్లుగా మీరు (ప్రేక్షకులు) నాపై చూపించిన ప్రేమని 'పొన్నియిన్ సెల్వన్'పై చూపించండి. ఈ సినిమా ఓ పది శాతం షూటింగ్ చెన్నైలో జరిగితే మిగిలినదంతా రాజమండ్రి, హైదరాబాద్‌లో చేశాం.. కాబట్టి ఇది మీ (తెలుగు) సినిమా.. మీరు ఆదరించాలి'' అని నటి సుహాసినీ మణిరత్నం అన్నారు. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష, ఐశ్వర్యా లక్ష్మి, ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్, విక్రమ్ ప్రభు, శోభిత ధూళిపాళ, కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్' ('పీయస్-1'). మణిరత్నం దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ నిర్మించాయి. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడంలో తెరకెక్కిన ఈ సినిమా తొలి భాగం 'పీయస్-1' ఈ నెల 30న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో 'దిల్' రాజు రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో **సుహాసినీ మణిరత్నం మాట్లాడుతూ–** ''పెళ్లికి ముందు మణిరత్నంగారు ఓ పెద్ద బ్యాగ్ నాకు గిఫ్ట్‌గా ఇచ్చారు. అందులో 'పొన్నియిన్ సెల్వన్' నవల ఐదు భాగాలుగా ఉంది. చదివి ఒక్క లైన్‌లో కథ చెప్పమన్నారు. నేను ఐదు భాగాలను చదివి ఐదు లైన్లుగా రాసి ఇచ్చాను. ఇలాగేనా రాసేది? అన్నారాయన. అప్పుడు మా పెళ్లి ఆగిపోతుందేమో? అని భయపడ్డాను.. కానీ పెళ్లయింది. మా పెళ్లయిన 34 ఏళ్లకి 'పొన్నియిన్ సెల్వన్' తీశారాయన. దానికి ముఖ్య కారణమైన సుభాస్కరన్‌గారికి థ్యాంక్స్'' అన్నారు.

ఐశ్వర్యా రాయ్ మాట్లాడుతూ– ''పొన్నియిన్ సెల్వన్' టీమ్‌తో ఇక్కడ ఉండటం గర్వంగా ఉంది. ప్రతిభావంతులైన మంచి యూనిట్‌తో పని చేయడం గౌరవంగా ఉంది. నా తొలి సినిమా ('ఇద్దరు') మణిరత్నం సార్‌తో చేశాను. ఆయన కలల ప్రాజెక్ట్ 'పొన్నియిన్ సెల్వన్'లోనూ భాగం కావడం హ్యాపీ'' అన్నారు.

నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ రోజుల్లో ఒక హీరోని పెట్టుకుని సినిమా తీయాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి.. అలాంటిది ఇంతమంది హీరోలు, హీరోయిన్లని పెట్టి మణిరత్నంగారు 'పొన్నియిన్ సెల్వన్'ని రెండు భాగాలుగా తీయడం గ్రేట్. ఇప్పుడు సినిమాకు ప్రాంతం, భాషతో సంబంధం లేదు.. బాగుంటే ఇండియా మొత్తం ఆదరిస్తోంది. 'ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్, కార్తికేయ 2' చిత్రాల్లా 'పొన్నియిన్ సెల్వన్ 1' కూడా ఇండియా మొత్తం అద్భుతం సృష్టిస్తుందని నమ్ముతున్నాను. ఇండియాలో రెహమాన్‌గారు ఉన్నారని చెప్పుకునేందుకు భారతీయుడిగా గర్వపడతాం'' అన్నారు.

ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ– ''38 ఏళ్ల క్రితం నా ప్రయాణం తెలుగులో ప్రారంభమైంది. రమేశ్ నాయుడు, చక్రవర్తి, రాజ్–కోటి, సత్యంగార్లు సంగీతానికి ఒక పునాది వేశారు. ఇన్నేళ్లుగా నా సంగీతాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్. 'పొన్నియిన్ సెల్వన్' సినిమాని అందరూ చూసి, ఎంజాయ్ చేయండి'' అన్నారు.

''పొన్నియిన్ సెల్వన్' లాంటి మంచి టీమ్‌తో పని చేయడం హ్యాపీ. చాన్స్ ఇచ్చిన మణిరత్నం సార్‌కి థ్యాంక్స్'' అన్నారు **త్రిష.**

''పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో అందరూ హీరోలే, అందరూ హీరోయిన్లే. నా డ్రీమ్ డైరెక్టర్ మణిరత్నంగారు అంత అద్భుతంగా మా పాత్రలను తీర్చిదిద్దారు'' అన్నారు **విక్రమ్.**

''మణిరత్నంగారి నలభై ఏళ్ల కల ఈ సినిమా. ఇది 'బాహుబలి' సినిమాలా ఉంటుందా? అని అడుగుతున్నారు. ఒక 'బాహుబలి'ని మనం చూశాం.. ఇంకో 'బాహుబలి' అవసరం లేదు. ఇండియాలో ఎన్నో కథలు ఉన్నాయి.. వాటిని మనం ప్రజలకు చెప్పాలి. ఇలాంటి ఒక గొప్ప సినిమాని మీరు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు **కార్తీ.**

''మా నాన్న ఎడిటర్ మోహన్‌గారు 'హిట్లర్, హనుమాన్ జంక్షన్, క్షేమంగా వెళ్లి లాభంగా రండి' వంటి చిత్రాలు నిర్మించారు. 'పొన్నియిన్ సెల్వన్' ఒక అద్భుతం'' అన్నారు **'జయం' రవి.**

ఐశ్వర్యా లక్ష్మి, శరత్ కుమార్, విక్రమ్ ప్రభు, అనంత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,021	58,099
నిఫ్టీ ▽	302	17,327

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,838	▽	2
డోజోన్స్	29,449	▽	628
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,019	▽	141
డాక్స్	12,284	▽	247
షాంఘై	3,088	▽	21
నికాయ్	27,154	▽	159

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

సోలార్‌ టెక్‌ సంస్థతో ఆర్‌ఐఎల్‌ జత

కేలక్స్‌లో 20 శాతం వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: సోలార్‌ టెక్‌ సంస్థ కేలక్స్‌లో 20 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు డైవర్సిఫైడ్‌ దిగ్గజం రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌(ఆర్‌ఐఎల్‌) పేర్కొంది. ఇందుకు 1.2 కోట్ల డాలర్లు(రూ. 97 కోట్లు) వెచ్చించినట్లు వెల్లడించింది. పెరోవ్‌స్కైట్‌ ఆధారిత సోలార్‌ సాంకేతికతగల కేలక్స్‌లో వాటాను సొంతం చేసుకోవడం ద్వారా నూతన ఇంధన తయారీ సామర్థ్యాలను పటిష్ట పరచుకోనుంది. పూర్తి అనుబంధ సంస్థ రిలయన్స్‌ న్యూ ఎనర్జీ ద్వారా కేలక్స్‌ కార్పొరేషన్‌తో వాటా కొనుగోలుకి తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆర్‌ఐఎల్‌ తెలియజేసింది. ఈ కాలిఫోర్నియా సంస్థ భాగస్వామ్యంతో అధిక సామర్థ్యంగల చౌక వ్యయాల సోలార్‌ మాడ్యూల్స్‌ను తయారు చేయగలమని వివరించింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఆర్‌ఐఎల్‌ సమీకృత ఫొటోవోల్టాయిక్‌ ప్లాంటును ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే.

నెస్లే ఇండియా భారీ పెట్టుబడులు

- 2025కల్లా రూ. 5,000 కోట్లు
- కొత్త ప్లాంట్లు, కొనుగోళ్లపై దృష్టి




న్యూఢిల్లీ: గ్లోబల్‌ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే ఎస్‌ఏ దేశీయంగా భారీ పెట్టుబడి ప్రణాళికలు ప్రకటించింది. రానున్న మూడున్నరేళ్లలోగా అంటే 2025కల్లా రూ. 5,000 కోట్లను ఇన్వెస్ట్‌ చేయనున్నట్లు కంపెనీ సీఈవో మార్క్‌ ష్నీడర్‌ వెల్లడించారు. తద్వారా దేశీ బిజినెస్‌కు జోష్‌నివ్వడంతోపాటు కొత్త వృద్ధి అవకాశాలను అందుకోనున్నట్లు తెలియజేశారు. నిధులను పెట్టుబడి వ్యయాలుగా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. కొత్త ప్లాంట్ల ఏర్పాటు, ఇతర సంస్థల కొనుగోళ్లు, ప్రొడక్టు పోర్ట్‌ఫోలియో విస్తరణ తదితరాలను చేపట్టనున్నట్లు వివరించారు. కంపెనీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 9 ప్లాంట్లను నిర్వహిస్తోంది. కొత్తగా తయారీ యూనిట్లను నెలకొల్పేందుకు తగిన ప్రాంతాలను అన్వేషిస్తున్నట్లు నెస్లే ఇండియా చైర్మన్, ఎండీ సురేష్‌ నారాయణన్‌ పేర్కొన్నారు. పెట్టుబడులకు అధికారిక సంస్థల నుంచి అనుమతులు లభించాల్సి ఉండగా.. మరింత మందికి ఉపాధి లభించే వీలుంది. ప్రస్తుతం 6,000 మంది సిబ్బంది ఉన్నారు.

టాప్‌–10లో ఒకటి...

నెస్లేకు ప్రాధాన్యతగల టాప్‌–10 మార్కెట్లలో ఒకటైన ఇండియాలో 2025కల్లా రూ. 5,000 కోట్లు వెచ్చించనున్నట్లు ష్నీడర్‌ తెలియజేశారు. కంపెనీ గత ఆరు దశాబ్దాలలో రూ. 8,000 కోట్లను వెచ్చించినట్లు ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశీయంగా 110 ఏళ్ల క్రితమే కార్యకలాపాలు ప్రారంభమైనప్పటికీ 1960 నుంచీ తయారీకి తెరతీసినట్లు వివరించారు.

బీవీఆర్‌ మోహన్‌ రెడ్డి 'ఇంజనీర్డ్‌ ఇన్‌ ఇండియా'



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: సైయంట్‌ వ్యవస్థాపకులు బీవీఆర్‌ మోహన్‌ రెడ్డి రచించిన 'ఇంజనీర్డ్‌ ఇన్‌ ఇండియా–ఫ్రమ్‌ డ్రీమ్స్‌ టు బిలియన్‌ డాలర్‌ సైయంట్‌' పుస్తకాన్ని పెంగ్విన్‌ ఇండియా ప్రచురించింది. ఓ వ్యాపారవేత్తగా ఎదగాలని, దేశ నిర్మాణంలో తన వంతు పాలుపంచుకోవాలని కలలుకంటూ ఐఐటీ కాన్పూర్‌ నుంచి 1974లో బయటకు అడుగుపెట్టిన ఓ యువకుని సాహసోపేత కథ ఇది అని పెంగ్విన్‌ తెలిపింది. భారత్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి ముందు అనుభవలేమి, మూలధన అవసరాలను సమకూర్చుకోవడమనే అవరోధాలను సైతం అధిగమించి మోహన్‌ రెడ్డి సాగించిన స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ఇది వెల్లడిస్తుందని వివరించింది.

మహీంద్రా, బీఐఐ రూ.4,000 కోట్లు

ఈవీ కో కంపెనీలో పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్‌ స్పోర్ట్స్‌ యుటిలిటీ వాహన విభాగం కోసం మహీంద్రా గ్రూప్, బ్రిటిష్‌ ఇంటర్నేషనల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌(బీఐఐ) రూ.4,000 కోట్లు పెట్టుబడి చేయాలని నిర్ణయించాయి. మహీంద్రా ఈవీ విభా గం అయిన ఈవీ కో కంపెనీలో బ్రిటిష్‌ ఇంటర్నేషనల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ రూ.2,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు ఇప్పటికే ప్రకటించింది. ఇద్దరు భాగస్వాముల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రణాళికాబద్ధమైన ఉత్పత్తులకు 2023–24 నుంచి 2026–27 మధ్య నూతన ఎలక్ట్రిక్‌ వాహన కంపెనీ మొత్తం రూ.8,000 కోట్ల మూలధనాన్ని కలిగి ఉంటుంది. వ్యాపారాన్ని పటిష్టం చేయడం కోసం ఈవీ కో కంపెనీలోకి మరింత మంది పెట్టుబడిదార్లను తీసుకు వస్తామని మహీంద్రా గ్రూప్‌ తెలిపింది.

ఎలక్ట్రిక్‌ వాటా 25 శాతం..

ఎలక్ట్రిక్‌ ఎస్‌యూవీ అయిన ఎక్స్‌యూవీ 400 మోడల్‌ను మహీంద్రా ఇటీవలే ఆవిష్కరించింది. అయిదు రకాల ఈ–ఎస్‌యూవీలను భారత్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్ల కోసం పరిచయం చేస్తామని యూకేలో జరిగిన ఓ కార్యక్రమంలో కంపెనీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎక్స్‌యూవీతోపాటు బీఈ పేరుతో పూర్తి ఎలక్ట్రిక్‌ బ్రాండ్‌ శ్రేణిలో ఈ నూతన మోడళ్లను పరిచయం చేయనుంది. ఎలక్ట్రిక్‌ ప్యాసింజర్‌ కార్ల విభాగంలో కంపెనీ ఇప్పటి వరకు లేదు. అయితే ఎలక్ట్రిక్‌ త్రిచక్ర వాహన విభాగంలో సంస్థకు ఏకంగా 70% వాటా ఉంది. 2027 నాటికి సంస్థ విక్రయించే అన్ని ఎస్‌యూవీల్లో ఎలక్ట్రిక్‌ వాటా 25% ఉంటుందని భావిస్తోంది.

మార్కెట్లకు డాలరు షాక్‌

- ఆర్థిక మాంద్యం, వడ్డీ రేట్ల భయాలు జత
- సెన్సెక్స్‌ 1,021– నిఫ్టీ 302 పాయింట్లు డౌన్‌
- 58,099– 17,327 వద్ద ముగిసిన ఇండెక్సులు
- తొలుత రికార్డ్‌ కనిష్టం 81.23ను తాకిన రూపీ
- ప్రభుత్వ, ప్రైవేట్‌ బ్యాంకింగ్, రియల్టీ డీలా

కేంద్ర బ్యాంకులన్నీ మూకుమ్మడిగా వడ్డీ రేట్లను పెంచుతుండటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యం బారిన పడనున్న అంచనాలు ఊపందుకున్నాయి. మరోపక్క రష్యా- ఉక్రెయిన్‌ యుద్ధ భయాలు ఉండనే ఉన్నాయి. దీంతో గ్లోబల్‌ స్థాయిలో ఆందోళనకు లోనైన ఇన్వెస్టర్లు మరోసారి స్టాక్‌ మార్కెట్లలో అమ్మకాలకు తెరతీశారు. ఈ ప్రభావం దేశీ మార్కెట్లనూ దెబ్బతీసింది.



ముంబై: దేశీయంగా ట్రేడర్లు విక్రయాలకు దిగడంతో ప్రధానంగా వడ్డీ ప్రభావిత రంగాలు కుదేలయ్యాయి. బ్యాంకింగ్, రియల్టీ కౌంటర్లు బేర్‌మన్నాయి. వెరసి సెన్సెక్స్‌ 1,021 పాయింట్లు పతనమై 58,099 వద్ద నిలిచింది. ఈ బాటలో నిఫ్టీ 302 పాయింట్లు కోల్పోయింది. 17,327 వద్ద ముగిసింది. ద్రవ్యోల్బణం కట్టడయ్యేవరకూ వడ్డీ పెంపునకే కట్టుబడనున్నట్లు ఫెడరల్‌ రిజర్వ్‌ సంకేతాలివ్వడంతో ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్‌ దూకుడు చూపుతోంది. రెండు దశాబ్దాల గరిష్టం 111.6ను తాకింది. దీంతో దేశీ కరెన్సీ సైతం మరోసారి డీలా పడింది. ఇంట్రాడేలో ఏకంగా 81.23కు జారింది. మరోపక్క 3 శాతాన్నిదాటి బలపడుతున్న యూఎస్‌ ట్రెజరీ ఈల్డ్స్‌ సైతం విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలకు కారణంకానున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. దీంతో సమీప భవిష్యత్‌లో బలహీన ట్రెండుకే అధిక అవకాశాలున్నట్లు జియోజిత్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ రీసెర్చ్‌ హెడ్‌ వినోద్‌ నాయర్‌ అభిప్రాయపడ్డారు.

అన్ని రంగాలూ వీక్‌..: ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ డీలాపడ్డాయి. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్‌ బ్యాంకింగ్, రియల్టీ, మీడియా, ఆయిల్‌– గ్యాస్, వినియోగ వస్తువులు 4–2% మధ్య క్షీణించాయి. నిఫ్టీ దిగ్గజాలలో పవర్‌గ్రిడ్, హిందాల్కో, అపోలో హాస్పిటల్స్, అదానీ పోర్ట్స్, ఎన్‌టీపీసీ, యూపీఎల్, ఎస్‌బీఐ, బజాజ్‌ ఫిన్‌ ద్వయం, ఎంఅండ్‌ఎం, ఇండస్‌ఇండ్, టాటా కన్జూమర్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, యాక్సిస్, ఆర్‌ఐఎల్‌ 8–2% మధ్య నష్టపోయాయి. కేవలం దివీస్, సన్‌ ఫార్మా, సిప్లా, టాటా స్టీల్, ఐటీసీ 2–0.6% మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్లు నేలచూపు: ప్రధాన ఇండెక్సులను మించుతూ చిన్న, మధ్యతరహా కౌంటర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్‌ క్యాప్స్‌ 2 శాతం చొప్పున వెనకడుగు వేశాయి. ట్రేడైన షేర్లలో 2,580 నష్టపోగా, 896 బలపడ్డాయి. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 2,900 కోట్ల విలువైన స్టాక్స్‌ విక్రయించగా.. దేశీ ఫండ్స్‌(డీఐఐలు) రూ. 299 కోట్లు ఇన్వెస్ట్‌ చేశాయి. గత రెండు రోజుల్లోనూ ఎఫ్‌పీఐలు రూ. 2,971 కోట్ల అమ్మకాలు చేపట్టగా.. డీఐఐలు రూ. 562 కోట్లు ఇన్వెస్ట్‌ చేశాయి.

రూ. 5 లక్షల కోట్లు హుష్‌

ప్రపంచవ్యాప్తంగా బలహీనపడ్డ సెంటిమెంటుతో దేశీ స్టాక్‌ మార్కెట్లకూ షాక్‌ తగిలింది. అన్నివైపులా అమ్మకాలు ఊపందుకోవడంతో ప్రధాన ఇండెక్సులతోపాటు మిడ్, స్మాల్‌ క్యాప్స్‌ సైతం 2 శాతం స్థాయిలో క్షీణించాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే లిస్టెడ్‌ కంపెనీల మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌(విలువ)కు ఒక్క రోజులోనే రూ. 4.9 లక్షల కోట్లమేర చిల్లు పడింది. ఫలితంగా బీఎస్‌ఈ మార్కెట్‌ క్యాప్‌ రూ. 2,76,64,567 కోట్లకు పరిమితమైంది. కాగా.. వరుసగా మూడు రోజులపాటు మార్కెట్లు నీరసించడంతో మార్కెట్‌ విలువలో రూ. 6,77,647 కోట్లు ఆవిరైంది. వడ్డీ రేట్ల పెంపు, డాలరు పుంజుకోవడం, రష్యా యుద్ధ భయాలకుతోడు ప్రధానంగా ప్రపంచ ఆర్థిక మాంద్య అంచనాలు ఇన్వెస్టర్లను రక్షణాత్మక పెట్టుబడులవైపు ఉసిగొల్పుతున్నట్లు పలువురు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

రూపాయి మరింత 'పాయే..'



డాలర్‌ మారకంలో రూపాయి విలువ వరుసగా రెండవరోజు శుక్రవారం ఇటు ఇంట్రాడేలోనూ, అటు ముగింపులోనూ కొత్త చరిత్రాత్మక కనిష్టాలను చూసింది. ఇంటర్‌ బ్యాంక్‌ ఫారెక్స్‌ మార్కెట్‌లో 30 పైసలు నష్టపోయి 81.09 వద్ద ముగిసింది. ఇంట్రాడే ఒక దశలో 81.23 స్థాయిని కూడా చూసింది. అంతర్జాతీయంగా డాలర్‌ పటిష్టత రూపాయిపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. రూపాయి విలువ గురువారం ఏడు నెలల్లో ఎప్పుడూ లేని విధంగా ఒకేరోజు 83 పైసలు పడిపోయి 80.79 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఇంట్రాడేలో 80.96 స్థాయిని చూసింది. అయితే మరుసటి రోజూ 81 స్థాయి దిగువకు పతనం కావడం గమనార్హం. వరుసగా మూడు ట్రేడింగ్‌ సెషన్లలో రూపాయి విలువ 124 పైసలు నష్టపోయింది.

బులియన్‌ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	49,432	▼	462
బంగారం (99.5 స్వచ్ఛత)	49,234	▼	460
వెండి (కిలో)	56,100	▼	1,243

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

24-9-2022	
విశాఖ	435–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్‌ ధర (డజను)	66.00
23-9-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్	408–00
వరంగల్	410–00
రిటైల్‌ ధర	4.70

సాక్షి స్పోర్ట్స్‌

సెమీఫైనల్లో అర్జున్‌ ఇరిగేశి

జూలియస్‌ బేర్‌ జనరేషన్‌ కప్‌ ఆన్‌లైన్‌ ర్యాపిడ్‌ చెస్‌ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు అర్జున్‌ ఇరిగేశి సెమీ ఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్‌ ఫైనల్లో టైబ్రేకర్‌ ద్వారా క్రిస్టోఫర్‌ యూ (అమెరికా)పై విజయం సాధించాడు. నాలుగు ర్యాపిడ్‌ గేమ్‌ల తర్వాత అర్జున్, క్రిస్టోఫర్‌ 2–2తో సమంగా నిలిచారు. దాంతో బ్లిట్జ్‌ టైబ్రేక్‌ నిర్వహించగా... తొలి గేమ్‌లో అర్జున్‌ గెలిచాడు. రెండో గేమ్‌ను డ్రా చేసుకున్న అతను సెమీస్‌ చేరాడు. అయితే మరో భారత ఆటగాడు ఆర్‌.ప్రజ్ఞానంద క్వార్టర్స్‌లో ఓటమిపాలయ్యాడు. జర్మనీకి చెందిన విన్సెంట్‌ కీమర్‌ చేతిలో 1–3తో ప్రజ్ఞానంద ఓడాడు. తొలి గేమ్‌ను ఓడి రెండు గేమ్‌లు డ్రా చేసుకున్న ప్రజ్ఞానంద తప్పనిసరిగా గెలవాల్సిన నాలుగో గేమ్‌లో కూడా పరాజయంపాలయ్యాడు. వరల్డ్‌ నంబర్‌వన్‌ మాగ్నస్‌ కార్ల్‌సన్‌ (నార్వే), లీమ్‌ క్వాంగ్‌ లీ (వియత్నాం) కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించారు. ఆరోనియన్‌పై కార్ల్‌సన్, నీమన్‌పై క్వాంగ్‌ లీ గెలుపొందారు. సెమీస్‌లో కార్ల్‌సన్‌తో కీమర్, క్వాంగ్‌ లీతో అర్జున్‌ తలపడతారు.



భారత్‌ గెలుపు మెరుపులు


రోహిత్

- 8 ఓవర్ల పోరులో టీమిండియా 6 వికెట్లతో గెలుపు
- చెలరేగిన రోహిత్, రాణించిన అక్షర్‌
- రేపు హైదరాబాద్‌లో ఆఖరి సమరం

నాగ్‌పూర్: తడిసిన మైదానంలో ఆలస్యమైన ఆటలో భారత్‌ 6 వికెట్లతో ఘన విజయం సాధించింది. రెండో టి20లో ఆస్ట్రేలియాపై నెగ్గిన టీమిండియా 1–1తో సమం చేసి... సిరీస్‌ వేటలో నిలిచింది. వర్షం వల్ల 8 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత ఆసీస్‌ 5 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. మాథ్యూ వేడ్‌ (20 బంతుల్లో 43 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) చెలరేగాడు. ఓపెనర్, కెప్టెన్‌ ఫించ్‌ (15 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్‌) ధాటిగా ఆడాడు. అక్షర్‌ పటేల్‌ 2 వికెట్లు తీశాడు. అనంతరం భారత్‌ 7.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' రోహిత్‌ శర్మ (20 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర ఆటతో గెలిపించాడు. జంపాకు 3 వికెట్లు దక్కాయి. సిరీస్‌ ఫలితాన్ని తేల్చే చివరి టి20 ఆదివారం హైదరాబాద్‌లో జరుగుతుంది.


అక్షర్

వేడ్‌ దూకుడు

తక్కువ ఓవర్లు కావడంతో టాస్‌ నెగ్గగానే భారత కెప్టెన్‌ రోహిత్‌ బౌలింగ్‌ ఎంచుకున్నాడు. ఇన్నింగ్స్‌ రెండో ఓవర్‌లో కోహ్లి అద్భుత ఫీల్డింగ్‌కు గ్రీన్‌ (5) రనౌట్‌ కాగా... అదే ఓవర్లో మ్యాక్స్‌వెల్‌ (0)ను అక్షర్‌ బౌల్డ్‌ చేశాడు. టి20 స్పెషలిస్ట్‌ హిట్టర్‌ టిమ్‌ డేవిడ్‌ (2)ను కూడా అక్షరే తన తదుపరి ఓవర్లో క్లీన్‌బౌల్డ్‌ చేశాడు. ప్రమాదకరమైన బ్యాటర్లిద్దరిని తేలిగ్గా అవుట్‌ చేసినప్పటికీ కెప్టెన్‌ ఫించ్, మాథ్యూ వేడ్‌ ధాటిగా ఆడి స్కోరు పెంచారు. హర్షల్‌ పటేల్‌ బౌలింగ్‌నైతే వేడ్‌ ఉతికి ఆరేశాడు. అతను వేసిన ఇన్నింగ్స్‌ ఆరో ఓవర్లో 2 బౌండరీలతో 12 పరుగులు రాగా... ఆఖరి ఓవర్‌ (8)లో అయితే చుక్కలే చూపించాడు. డీప్‌ మిడ్‌ వికెట్, కవర్స్, డీప్‌ స్క్వేర్‌ లెగ్‌ దిశగా కొట్టిన మూడు సిక్సర్లు ప్రేక్షకుల చేతుల్లో పడ్డాయి. దీంతో ఆ ఒక్క ఓవర్‌లోనే 19 పరుగులు ఇవ్వడంతో ఆస్ట్రేలియా 91 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది.

బ్యాటింగ్‌ జోరు...

హాజల్‌వుడ్‌ తొలి ఓవర్లోనే రోహిత్‌ 2, రాహుల్‌ ఒక సిక్సర్‌ బాదేయడంతో 20 పరుగుల వచ్చాయి. ఇద్దరు పుల్, హెలికాప్టర్‌ షాట్‌లతో దంచేశారు. కమిన్స్‌ వేసిన రెండో ఓవర్లో 'హిట్‌మ్యాన్‌' హుక్‌ షాట్‌తో మరో సిక్స్‌ కొట్టాడు. మూడో ఓవర్లో స్పిన్నర్‌ జంపాను దింపగా అతనికి సిక్సర్‌ ధాటిని చూపాడు. ఈ ఓవర్లో రాహుల్‌ (10)ను అవుట్‌ చేసిన జంపా తన మరుసటి ఓవర్లో కోహ్లి (11)ని, సూర్యకుమార్‌ (0)ను వరుస బంతుల్లో పెవిలియన్‌ చేర్చాడు. మరోవైపు రోహిత్‌ తన పనిని బౌండరీలతో యథేచ్ఛగా కానిచ్చేయడంతో జట్టు లక్ష్యం వైపు సాగింది. హార్దిక్‌ పాండ్యా (9) అవుటైనా... ఆఖరి ఓవర్లో 10 పరుగులు అవసరమైన దశలో దినేశ్‌ కార్తీక్‌ రెండు బంతుల్లోనే సిక్స్, ఫోర్లతో ముగించాడు. దీంతో 4 బంతులు మిగిలుండగానే భారత్‌ లక్ష్యాన్ని చేరుకుంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: ఫించ్‌ (బి) బుమ్రా 31; గ్రీన్‌ రనౌట్‌ 5; మ్యాక్స్‌వెల్‌ (బి) అక్షర్‌ 0; డేవిడ్‌ (బి) అక్షర్‌ 2; వేడ్‌ నాటౌట్‌ 43; స్మిత్‌ రనౌట్‌ 8; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (8 ఓవర్లలో 5 వికెట్లకు) 90.** **వికెట్ల పతనం:** 1–14, 2–19, 3–31, 4–46, 5–90. **బౌలింగ్:** పాండ్యా 1–0–10–0, అక్షర్‌ 2–0–13–2, చహల్‌ 1–0–12–0, బుమ్రా 2–0–23–1, హర్షల్‌ 2–0–32–0.

భారత్‌ ఇన్నింగ్స్: రాహుల్‌ (బి) జంపా 10; రోహిత్‌ నాటౌట్‌ 46; కోహ్లి (బి) జంపా 11; సూర్యకుమార్‌ (ఎల్బీ) (బి) జంపా 0; పాండ్యా (సి) ఫించ్‌ (బి) కమిన్స్‌ 9; దినేశ్‌ కార్తీక్‌ నాటౌట్‌ 10; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (7.2 ఓవర్లలో 4 వికెట్లకు) 92.** **వికెట్ల పతనం:** 1–39, 2–55, 3–55, 4–77. **బౌలింగ్:** హాజల్‌వుడ్‌ 1–0–20–0, కమిన్స్‌ 2–0–23–1, జంపా 2–0–16–3, సామ్స్‌ 1.2–0–20–0, అబాట్‌ 1–0–11–0.

'ప్రపంచకప్‌ గెలవకపోవడమే లోటు'

- జులన్‌ గోస్వామి వ్యాఖ్య
- నేడు ఆఖరి మ్యాచ్‌ ఆడనున్న పేస్‌ దిగ్గజం
- లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో భారత్‌ చివరి వన్డే



లండన్: రెండు దశాబ్దాలకు పైగా భారత మహిళా క్రికెట్‌ మూలస్తంభాల్లో ఒకరిగా నిలిచిన దిగ్గజ పేస్‌ బౌలర్‌ జులన్‌ గోస్వామి ఆటకు ముగింపు పలుకుతోంది. నేడు భారత్, ఇంగ్లండ్‌ మధ్య జరిగే చివరి వన్డేతో రిటైర్‌ కానున్న జులన్‌ ఆఖరిసారిగా లార్డ్స్‌ మైదానంలో బరిలోకి దిగనుంది. భారత్‌ ఇప్పటికే సిరీస్‌ను గెలుచుకున్న నేపథ్యంలో అందరి దృష్టీ జులన్‌పైనే ఉంది. ఆమెకు విజయంతో ఘనంగా వీడ్కోలు ఇవ్వాలని హర్మన్‌ బృందం భావిస్తోంది. ఈ నేపథ్యంలో తన కెరీర్‌ విశేషాల గురించి జులన్‌ శుక్రవారం మీడియాతో మాట్లాడింది. వన్డే లేదా టి20 ప్రపంచకప్‌లలో తాము ఒకటి గెలిచి ఉంటే బాగుండేదని ఆమె వ్యాఖ్యానించింది. '2005, 2017 వన్డే వరల్డ్‌కప్‌లలో మేం ఫైనల్‌ చేరాం. వీటిలో ఒకటి గెలిచి ఉండాల్సింది. ప్రతీ క్రికెటర్‌కి అదే లక్ష్యం ఉంటుంది. నాలుగేళ్ల పాటు ఎంతో కష్టపడి అక్కడి దాకా వచ్చాక కప్‌ గెలిస్తే కల నిజమయ్యేది. టి20 ప్రపంచకప్‌ సహా మేం మూడు ఫైనల్స్‌ ఆడినా ఒక్కటి గెలవలేకపోయాం. అది చాలా బాధిస్తుంది. నా కెరీర్‌లో అదే లోటు' అని జులన్‌ చెప్పింది. గత రెండేళ్లుగా చాలా సార్లు రిటైర్మెంట్‌ గురించి ఆలోచిస్తూ వచ్చానని, చివరకు ఇప్పుడు తప్పుకుంటున్నానని జులన్‌ భావోద్వేగంతో చెప్పింది. 'రెండేళ్లుగా ప్రతీ సిరీస్‌ నాకు చివరి సిరీస్‌లాగానే అనిపించేది. కోవిడ్‌ వల్ల మ్యాచ్‌లు వాయిదాపడుతూ రావడంతో పాటు వరుసగా గాయాలపాలయ్యాను. శ్రీలంక సిరీస్‌తోనే ముగిద్దామనుకున్నా. అయితే ఫిట్‌గా లేక ఆ సిరీస్‌ ఆడలేదు. దాంతో మళ్లీ ఎన్‌సీఏకు వెళ్లాను. రాబోయే టి20 వరల్డ్‌కప్‌కు ముందు ఇదే చివరి వన్డే సిరీస్‌ కాబట్టి ఆటను ముగిస్తున్నా' అని ఈ బెంగాల్‌ పేసర్‌ పేర్కొంది. కోల్‌కతాలో 1997 వన్డే వరల్డ్‌కప్‌ ఫైనల్లో బాల్‌బాయ్‌గా పని చేసిన తర్వాత దేశానికి ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నానని, ఇన్నేళ్లు కొనసాగగలనని అనుకోలేదన్న జులన్‌... కెరీర్‌లో తొలి మ్యాచే అన్నింటికంటే ప్రత్యేకమైందని గుర్తు చేసుకుంది. వచ్చే ఏడాది జరిగే తొలి మహిళల ఐపీఎల్‌లో పాల్గొనడం గురించి తాను ఇప్పుడే చెప్పలేనని జులన్‌ స్పష్టం చేసింది.

దిలీప్‌ తిర్కీకి పగ్గాలు

హాకీ ఇండియా అధ్యక్షుడిగా దిగ్గజ ఆటగాడు



న్యూఢిల్లీ: భారత హాకీ సమాఖ్య (హాకీ ఇండియా – హెచ్‌ఐ)కు తొలిసారి ఒక ఆటగాడు అధ్యక్షుడయ్యాడు. భారత్‌ తరఫున 412 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన దిగ్గజం, మాజీ కెప్టెన్‌ దిలీప్‌ తిర్కీ ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. తిర్కీకి పోటీగా మరెవరూ బరిలో నిలవకపోవడంతో పోటీ లేకుండా ఈ మాజీ ఆటగాడికి అధ్యక్షుడయ్యే అవకాశం లభించింది. అధ్యక్ష పదవికి తుది ఫలితాలు అక్టోబర్‌ 1న రావాల్సి ఉన్నా... పోటీకి దిగిన రాకేశ్‌ కట్యాల్, భోలానాథ్‌ సింగ్‌ శుక్రవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో తిర్కీ ఎంపికను ప్రకటించారు. ప్రపంచ హాకీ అత్యుత్తమ డిఫెండర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన 44 ఏళ్ల తిర్కీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడాన్ని అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్‌) లాంఛనంగా ఆమోదించింది. మూడు ఒలింపిక్స్‌లలో పాల్గొన్న తిర్కీ అర్జున, పద్మశ్రీ అవార్డులు అందుకున్నాడు. ఏ దేశం తరఫునైనా 400 మ్యాచ్‌లు ఆడిన ఏకైక ఆటగాడిగా తిర్కీ గుర్తింపు పొందాడు. బిజూ జనతాదళ్‌ తరఫున 2012నుంచి 2018 వరకు తిర్కీ రాజ్యసభ సభ్యుడిగా కూడా పని చేశాడు. ఆటగాడిగా తనకున్న అపార అనుభవంతో భారత హాకీని మరింత ఉన్నత స్థాయికి చేర్చేందుకు ప్రయత్నిస్తానని ఈ సందర్భంగా తిర్కీ ప్రకటించాడు.

యశస్వి డబుల్‌ సెంచరీ

రెండో ఇన్నింగ్స్‌లో వెస్ట్‌జోన్‌ 376/3

కోయంబత్తూర్: సౌత్‌జోన్, వెస్ట్‌జోన్‌ మధ్య జరుగుతున్న దులీప్‌ ట్రోఫీ ఫైనల్‌ మ్యాచ్‌ ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో 57 పరుగుల ఆధిక్యం కోల్పోయిన వెస్ట్‌... దానిని దాటి మూడో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి 319 పరుగుల ఆధిక్యంలో నిలవడం విశేషం. రెండో ఇన్నింగ్స్‌లో వెస్ట్‌ 3 వికెట్ల నష్టానికి 376 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్‌ (244 బంతుల్లో 209 బ్యాటింగ్; 23 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్‌ సెంచరీతో చెలరేగగా, శ్రేయస్‌ అయ్యర్‌ (113 బంతుల్లో 71; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ప్రస్తుతం యశస్వితో పాటు సర్ఫరాజ్‌ (30 బ్యాటింగ్‌) క్రీజ్‌లో ఉన్నాడు. అంతకు ముందు ఓవర్‌నైట్‌ స్కోరు 318/7తో ఆట కొనసాగించిన సౌత్‌జోన్‌ తమ తొలి ఇన్నింగ్స్‌లో 327 పరుగులకు ఆలౌటైంది.


బ్రూక్‌

ఇంగ్లండ్‌ భారీ విజయం

కరాచీ: రెండో టి20లో ఇంగ్లండ్‌పై రికార్డు విజయం సాధించిన పాకిస్తాన్‌ తర్వాతి పోరులోనే చతికిలపడింది. శుక్రవారం జరిగిన మూడో టి20లో ఇంగ్లండ్‌ 63 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. ముందుగా ఇంగ్లండ్‌ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్‌ (35 బంతుల్లో 81 నాటౌట్; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), బెన్‌ డకెట్‌ (42 బంతుల్లో 70 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్‌) అర్ధ సెంచరీలతో పాటు విల్‌ జాక్స్‌ (22 బంతుల్లో 40; 8 ఫోర్లు) రాణించాడు. అనంతరం పాక్‌ 20 ఓవర్లలో 8 వికెట్లకు 158 పరుగులు సాధించింది. షాన్‌ మసూద్‌ (40 బంతుల్లో 66 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) చివరి వరకు పోరాడినా లాభం లేకపోయింది. ఏడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్‌ 2–1తో ఆధిక్యంలో నిలవగా, నాలుగో టి20 ఇదే వేదికపై ఆదివారం జరుగుతుంది.

క్లుప్తంగా

'స్మార్ట్ యోజన' కేసులో సీఐడీ కస్టడీకి మరో ఇద్దరు

ఆరిలోవ (విశాఖ తూర్పు) : స్మార్ట్ యోజన వెల్ఫేర్ సొసైటీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన కేసులో మరో ఇద్దరిని సీఐడీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ నెల 22న కస్టడీలోకి తీసుకున్న పోలీసులు వారిని 25 వరకు విచారణ చేయనున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం కేంద్రాలుగా స్మార్ట్ యోజన వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నుంచి 7 వేల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇది బోగస్ సంస్థ అని, వారు ఇచ్చిన ఆర్డరు కాపీలు నకిలీవని తేలడంతో మోసపోయిన బాధితులు పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దీంతో ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. సీఐడీ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి స్మార్ట్ యోజన వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ ఇందుపూడి సుధాకర్‌ను ఈ నెల 11న అరెస్టు చేశారు. ఈ కేసులో సుధాకర్ ఏ1 ముద్దాయిగా ఉన్నాడు. ఏ2, ఏ3 ముద్దాయిలుగా ఉన్న రుత్తుల హరిబాబు, కంచవరపు శివను ఈ నెల 19న అరెస్టు చేసి కాకినాడ కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించారు. వారిని విచారణ కోసం సీఐడీ అధికారులు గురువారం తమ కస్టడీలోకి తీసుకున్నట్లు విశాఖ రీజియన్ కార్యాలయ సీఐ బుచ్చిరాజు తెలిపారు.

విజయ పాలు లీటర్‌కు రూ.2 పెంపు

- 26 నుంచి అమల్లోకి..

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్(విజయ పాలు) పాలు లీటర్‌కు రూ.2 పెరగనున్నాయి. పెరిగిన ధరలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయని విజయ యాజమాన్యం పేర్కొంది. ప్రస్తుతం విజయ లోఫాట్(డీటీఎం) అర లీటర్ ప్యాకెట్ రూ.25 ఉండగా, సోమవారం నుంచి రూ.26కు విక్రయించనున్నారు. విజయ ఎకానమి(టీఎం) అరలీటర్ ప్యాకెట్ రూ.27 నుంచి రూ.28కు పెరిగింది. విజయ స్పెషల్(ఫుల్ క్రీమ్) పాలు అర లీటర్ రూ.33 నుంచి రూ.34కు పెరిగింది. ఇక కృష్ణా మిల్క్ యూనియన్ అత్యధికంగా విక్రయించే విజయ గోల్డ్ ప్రస్తుతం రూ.34 ఉండగా, రూ.35కు పెరగనుంది. నెల వారీ పాల కార్డు కొనుగోలు చేసిన వినియోగదారులకు అక్టోబర్ 9 వరకు పాత ధరలే వర్తిస్తాయని యాజమాన్యం పేర్కొంది.

ఏపీవీవీపీ వైద్యులకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లు

- మార్గదర్శకాలు విడుదల

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్‌లో శాశ్వత వైద్యుల రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర జారీ చేశారు. వైద్యుల నుంచి వచ్చిన వినతులు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ప్రతిపాదనల మేరకు బదిలీలకు అనుమతిస్తున్నట్టు పేర్కొన్నారు. అక్టోబర్ ఒకటో తేదీ నాటికి గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు, మైదాన, గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు రిక్వెస్ట్ బదిలీలకు అర్హులు. ఆన్‌లైన్ విధానంలోనే బదిలీల ప్రక్రియ చేపడతారు. ఏ స్పెషాలిటీ పోస్టులో అదే స్పెషాలిటీ వారినే అనుమతిస్తారు. మిస్ మ్యాచ్ పోస్టింగ్‌లను అనుమతించరు. కంటి చూపు సంబంధిత సమస్యలతో బాధపడే వారికి, మానసిక సమస్యలతో బాధపడుతున్న పిల్లలు ఉన్నవారు, ఆరోగ్య సమస్యలు, వికలాంగులు, ఇతర ప్రత్యేక పరిస్థితులకు బదిలీల్లో ప్రాధాన్యత ఉంటుంది. ఖాళీల ప్రదర్శన, ఉద్యోగుల బదిలీ దరఖాస్తులు, పోస్టింగ్‌ల కోసం స్థానాల ఎంపిక, మెరిట్ లిస్ట్ ప్రదర్శన ఇలా మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లో చేపడతారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ చైర్మన్‌గా, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్, ఏపీవీవీపీ కమిషనర్‌లు సభ్యులు ఉన్న కమిటీ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో బదిలీలపై త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామని ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వినోద్ 'సాక్షి' కి తెలిపారు.

అక్రమ రవాణా కట్టడికి చర్యలు

- సీఐడీ విభాగం అదనపు డీజీ

సాక్షి, అమరావతి : మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను సీఐడీ విభాగం అదనపు డీజీ పీవీ సునీల్‌కుమార్ ఆదేశించారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో కొత్తగా నెలకొల్పిన 'మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాల' అధికారులకు వెబినార్ ద్వారా శుక్రవారం ప్రారంభించిన రెండో విడత శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సీఐడీ మహిళా భద్రతా విభాగం ఎస్పీ కేజీవీ సరిత మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని ఏహెచ్‌టీయూ అధికారులకుగానీ, డయల్ 100కు, చైల్డ్‌లైన్ 1098, సీఐడీ హెల్ప్‌లైన్‌లకు గానీ వెంటనే చేరవేసేలా అవగాహన కల్పించాలని చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అడవి అలుగులు C/o పాపికొండలు!



- పాపికొండలు అభయారణ్యంలో 20వరకు అలుగుల సంచారం
- వీటి వీపుపై ఉండే పెంకులకు చైనాలో మంచి డిమాండ్
- వేటాడితే కఠిన శిక్ష తప్పదని హెచ్చరిక



తన సంతానాన్ని వీపుపై తీసుకువెళ్తున్న అలుగు



అలుగు పెంకులు

బుట్టాయగూడెం: అడవికి రాజు సింహం... అది ఎంతటి జీవినైనా వేటాడి నమిలేస్తుందని నమ్ముతాం... కానీ, సింహం కూడా తినలేనంత గట్టిగా ఉండే అరుదైన వన్యప్రాణులు ఉన్నాయి. అటువంటి వాటిలో అడవి అలుగు ఒకటి. అలుగు వీపుపై ఉండే పెంకులు కత్తిలాగా పదును కలిగి ఉంటాయి. ఇవి సింహం కూడా నమలలేనంత గట్టిగా ఉంటాయి. అటువంటి అరుదైన అడవి అలుగులు ఏలూరు జిల్లా పరిధిలోని పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో గల పాపికొండల అభయారణ్యంలో సంచరిస్తున్నాయి. వీటిని పాంగోలిన్ అని కూడా పిలుస్తారు. చైనీస్ పాంగోలిన్, ఏషియా పాంగోలిన్, సుండా పాంగోలిన్, పాతమాన్ పాంగోలిన్ అని నాలుగు రకాల అలుగులు ఉంటాయి. వీటి మూతి ముంగిసను పోలి ఉంటుంది. నాలుగు కాళ్లతో ఉండే ఈ అలుగు సుమారు 20 ఏళ్లు జీవిస్తుంది. చీమలు, పురుగులను ఆహారంగా తీసుకుంటుంది. ఎక్కువ శాతం దట్టమైన అడవి, అధికంగా వర్షాలు కురిసే ప్రాంతాలతోపాటు ఎడారి ప్రాంతాల్లో ఇవి జీవనం సాగిస్తుంటాయి. తొలిసారిగా 1821లో ఈ జంతువుల సంచారాన్ని గుర్తించినట్లు వైల్డ్ లైఫ్ అధికారులు తెలిపారు. అరుదైన ఈ వన్యప్రాణులు పాపికొండల అభయారణ్యం ప్రాంతంలో సుమారు 20 వరకు సంచరిస్తున్నాయని వెల్లడించారు.

అలికిడి అయితే బంతిలా ముడుచుకుపోతాయి...

అలుగులు పగలు కంటే రాత్రి సమయంలోనే ఎక్కువగా సంచరిస్తుంటాయి. అలికిడి అయితే అవి బెదిరి కదలకుండా గట్టిగా బంతిలా ముడుచుకుని ఉండిపోతాయి. వీటికి ఎదురు దాడి చేసే గుణం కూడా ఉంటుంది. ఇవి రెండేళ్లకు ఒకసారి పిల్లలకు జన్మనిస్తాయి. కోతి మాదిరిగానే తన పిల్లలను వీపుపై ఎక్కించుకుని తిప్పుతూ పోషిస్తాయి. అలుగు పెంకులను చైనాలో మందుల తయారీకి ఉపయోగిస్తారని అధికారులు తెలిపారు. వీటికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, ఒక్కో అలుగు రూ.20లక్షల వరకు ధర పలుకుతోందని చెప్పారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన శిక్షలు తప్పవు



వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎవరైనా వేటాడితే కఠిన శిక్షలు తప్పవు. పాపికొండల అభయారణ్య ప్రాంతంలో సంచరిస్తున్న అలుగుల వేట కోసం బయట ప్రాంతాల నుంచి స్మగ్లర్లు వస్తున్నట్లు గుర్తించి నిఘా పెట్టాం. ఇటీవల ఇద్దరు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేశాం. అలుగులను వేటాడితే ఏడేళ్ల వరకు జైలు శిక్షతోపాటు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా జరిమానా విధిస్తారు.

– జి.వేణుగోపాల్, వైల్డ్‌లైఫ్ డిప్యూటీ రేంజ్ అధికారి, పోలవరం, ఏలూరు జిల్లా

ప్రైవేటు వర్సిటీల జాబితాలో 'ఓం శ్రీ గాయత్రి విశ్వకర్మ' లేదు

- రాష్ట్ర ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఒంగోలులో విజ్ఞాన్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలోని ఓం శ్రీ గాయత్రి విశ్వకర్మ విశ్వవిద్యాలయం ప్రభుత్వం అనుమతించిన ప్రైవేటు వర్సిటీల జాబితాలో లేదని రాష్ట్ర ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ మెంబర్ సెక్రటరీ, సీఈవో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ప్రైవేటు వర్సిటీల్లో చేరేముందు అనుమతులు సహా అన్ని అంశాలను పరిశీలించుకోవాలని సూచించారు. 'ఒంగోలులో ఓం శ్రీ గాయత్రి విశ్వకర్మ విశ్వవిద్యాలయం ప్రభుత్వం, ఇతర నియంత్రణ సంస్థల నిబంధనలను పాటించకపోవడం వల్ల దాన్ని ప్రభుత్వం విశ్వవిద్యాలయాల జాబితాలో చేర్చలేదు. సొసైటీ దీన్ని సవాలు చేస్తూ హైకోర్టు కెళ్లగా.. అన్ని నిబంధనలను పాటించి, లోపాలను సరిదిద్దుకుని, అనుమతులు పొందాలని ధర్మాసనం ఆదేశించింది. దీనికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. అందువల్ల విద్యార్థులు ఆ విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ పొందేముందు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము..' అని పేర్కొన్నారు.

మత్స్య, ఆక్వా పెట్టుబడుల హబ్‌గా ఏపీ

- సీఐఐ జాతీయ కమిటీ కో చైర్మన్ అరబింద్‌దాస్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మత్స్య, ఆక్వా రంగాల్లో పెట్టుబడుల హబ్‌గా నిలవబోతోందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) జాతీయ కమిటీ కో చైర్మన్ అరబింద్‌దాస్ చెప్పారు. సముద్ర ఉత్పత్తులు, ఎగుమతుల్లో అగ్రగామిగా ఏపీని నిలబెట్టే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సీఐఐ కట్టుబడి ఉందన్నారు. సీఐఐ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మత్స్య, ఆక్వారంగాల సుస్థిరాభివృద్ధిపై విజయవాడలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. ఆక్వారంగంలో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దేందుకు సీఐఐ కృషి చేస్తుందన్నారు. మత్స్యరంగంపై ఆధారపడి జీవిస్తున్నవారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలతో పాటు తీరం వెంబడి పెద్దఎత్తున మౌలికసదుపాయాల కల్పనకు కృషిచేస్తున్న ప్రభుత్వ తీరు ప్రశంసనీయమన్నారు.

తీరం వెంబడి చేపల కేజ్ కల్చర్‌కు ప్రోత్సాహం

ఏపీ మారిటైమ్ బోర్డ్ డిప్యూటీ సీఈవో లెఫ్టినెంట్ సి.డి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు పెంచేందుకు కోల్డ్ చైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిషింగ్ హార్బర్లు, ఇంటిగ్రేటెడ్ సీ పార్కుల ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. తీరం వెంబడి చేపల కేజ్ కల్చర్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఒక పాలసీని తీసుకొచ్చేందుకు పరిశీలిస్తోందని చెప్పారు. మత్స్య, ఆక్వారంగాల్లో నైపుణ్యత కలిగిన మానవ వనరుల అభివృద్ధి లక్ష్యంగా ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్స్యశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ ఎస్.ఏంజెలి మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యరంగాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. సీఐఐ రాష్ట్రశాఖ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ మత్స్య రంగాభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వానికి లోతైన, వ్యూహాత్మక ఆలోచన ఉందని చెప్పారు. ఈ రంగంపై ఆధారపడిన వర్గాల జీవనోపాధికి, ముఖ్యంగా మహిళలకు ఉద్యోగకల్పన, మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ తమకు స్ఫూర్తినిస్తున్నట్లు తెలిపారు. మత్స్యశాఖతో పాటు ఈ రంగంలోని వాటాదారులందరితో సీఐఐ కలిసి పనిచేస్తుందని చెప్పారు. వాటర్‌బేస్ లిమిటెడ్ సీఈవో రమాకాంత్, డెల్టా ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫిష్ బాస్కెట్‌గా రాష్ట్రం



సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ నిర్దిష్టమైన ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగా ఫిష్ బాస్కెట్‌గా రాష్ట్రం నిలిచిందన్నారు. హేచరీలు, విత్తన పెంపకం, బ్రూడ్ బ్యాంకులు, బ్రూడ్ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్లు, న్యూక్లియర్ బ్రీడింగ్ సెంటర్లు, పంట అనంతర నష్టాన్ని తగ్గించడానికి తగిన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని వివరించారు. పంటకోతకు ముందు, అనంతర మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేటురంగ పాత్ర చాలా కీలకమన్నారు. సప్లయి చైన్‌ను బలోపేతం చేయడం ద్వారా చేపలు, ఆక్వా ఉత్పత్తులకు అదనపు విలువ జోడింపునకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

వికేంద్రీకరణపై 25న రౌండ్ టేబుల్ సమావేశం

- ఉత్తరాంధ్ర మేధావులు, అన్ని పార్టీలు, వర్గాల వారికీ ఆహ్వానం
- ఉత్తరాంధ్ర అభివృద్ధి కోరే వారందరూ గొంతు వినిపించాలి
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సాక్షి, విశాఖపట్నం: అధికార వికేంద్రీకరణపై రాజకీయాలకతీతంగా ఈ నెల 25న నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని పార్టీలు, అన్ని వర్గాల వారినీ ఆహ్వానిస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. బీచ్ రోడ్డులోని గాదిరాజు ఫంక్షన్ హాల్లో జరిగే ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర మేధావులు, ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలతో పాటు అన్ని వర్గాల వారూ పాల్గొనాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోరే వారందరూ వికేంద్రీకరణకు మద్దతుగా గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు. వారు శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఒక్క ప్రాంతానికి అభివృద్ధి కేంద్రీకృతం కాకూడదని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార వికేంద్రీకరణకు సంకల్పించారని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. ప్రాంతాల మధ్య విభేదాలు రగిలించేందుకే చంద్రబాబు డైరెక్షన్‌లో రైతుల పాదయాత్ర జరుగుతోందన్నారు. ఈ ప్రాంత మనోభావాలు రాష్ట్ర ప్రజలకు తెలిపేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా ఆ యాత్రను విరమించుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన విశాఖలో రాజధానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, జల, వాయు, రోడ్డు రవాణా మార్గాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా విశాఖను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అమరావతి రైతుల యాత్రకు కవచంగా ఉంటామని సీఎం రమేష్ అనడంపై మంత్రి స్పందిస్తూ.. అమరావతిలో భూములున్న వారంతా ఈ యాత్రకు కవచంగానే ఉంటారని, చంద్రబాబు పెద్ద కవచంగా ఉన్నప్పుడు వీళ్లంతా ఎందుకని ఎద్దేవా చేశారు. 2018లో బీజేపీ రాయలసీమ డిక్లరేషన్‌లో కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటు చేయాలని పేర్కొనలేదా అని ప్రశ్నించారు. రాజధాని అమరావతి అన్న పుస్తకాన్ని ఆవిష్కరించినప్పుడు పవన్‌కల్యాణ్ మాట్లాడిన మాటలను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. సుజనాచౌదరి, సీఎం రమేష్‌ను దూతలుగా పంపించి, చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని ప్రత్యేక హోదా రాకుండా చేసిన ఘనుడు చంద్రబాబని చెప్పారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అమరావతికి వ్యతిరేకం కాదని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీలోనే చెప్పారని, అయినా.. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకే చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాదయాత్రలు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

కోతులు తెచ్చిన తంటా...


స్విచ్‌యార్డులో పేలిన ఇన్సులేటర్లు..

- ఆరు గంటల పాటు సీలేరుకు నిలిచిన విద్యుత్ సరఫరా

సీలేరు/పరవాడ: కోతులు తెచ్చిన తంటాతో శుక్రవారం ఉదయం 6 గంటలకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సీలేరు గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జల విద్యుత్ కేంద్రం యూనిట్లలో ఉత్పత్తి అయిన విద్యుత్ స్విచ్‌యార్డు ద్వారా పలు ప్రాంతాలకు సరఫరా అవుతుంది. అయితే స్విచ్ యార్డులో విద్యుత్ తీగలపై కోతులు దూకడంతో హైవోల్టేజ్‌తో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు పరిశీలించగా ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన క్లాంప్, 11 కేవీకి సంబంధించిన 2 ఇన్సులేటర్‌లు, 33 కేవీకి సంబంధించిన ఒక ఇన్సులేటర్ హైవోల్టేజ్‌తో పేలిపోయింది. ఎర్త్ సమస్య కూడా తలెత్తింది. అధికారులు పేలిపోయిన వాటి స్థానంలో కొత్తవి అమర్చేందుకు 6 గంటల పాటు శ్రమించారు. మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం

అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలో సింహాద్రి ఎన్టీపీసీలో మూడో యూనిట్‌లో గురువారం అర్ధరాత్రి నుంచి విద్యుదుత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేశారు.500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడో యూనిట్‌లో అమర్చిన బ్రాయిలర్‌లో చేపడుతున్న స్వల్ప మరమ్మతుల నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యుదుత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేశారు. సోమ, మంగళవారం నాటికి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకొంటున్నామని, 1, 2, 4 యూనిట్ల నుంచి యథావిధిగా విద్యుదుత్పత్తి జరుగుతుందని అధికారులు తెలిపారు.



స్విచ్‌యార్డులో పేలిన ఇన్సులేటర్



గాయాలపాలైన కోతి

సిద్ధార్థ మెడికల్ కాలేజీ హాస్టల్ నిర్మాణానికి రూ.6 కోట్లు

సాక్షి, అమరావతి/లబ్బీపేట(విజయవాడ తూర్పు) : విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థుల కోసం హాస్టల్ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. సిద్ధార్థ వైద్య కళాశాలకు పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు అందించిన నూతన బస్సును మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనం ప్రాంగణంలో శుక్రవారం కృష్ణబాబు ప్రారంభించారు. బస్సు తాళాలు, పత్రాలను వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావుకు ఆయన అందించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా సిద్ధార్థ వైద్య కళాశాల, బోధనాసుపత్రిని మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పట్ల మెడికోలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి డాక్టర్ అమ్మన్న, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, సభ్యులు స్వప్న అట్లూరి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చౌకగా.. వేగంగా..!

- మధుమేహ వ్యాధిని గుర్తించేందుకు ఏయూ అద్భుత ఆవిష్కరణ
- టైప్–2 షుగర్ పరీక్ష కోసం నానో బయోసెన్సార్ తయారీ
- ఒక స్ట్రిప్ ఆరు నెలల వినియోగం

సాక్షి, విశాఖపట్నం: మారుతున్న జీవనశైలి కారణంగా మధుమేహం బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎప్పటికప్పుడు షుగర్ లెవల్స్‌ను తెలుసుకునేందుకు ఖర్చుతో కూడిన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి భిన్నంగా టైప్–2 షుగర్‌ను క్షణంలోనే తెలుసుకునేలా, అతి తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండేలా ఆంధ్రా యూనివర్సిటీ బయోకెమిస్ట్రీ విభాగం పోర్టబుల్ నానో బయోసెన్సార్ పరికరాన్ని ఆవిష్కరించింది. ఏయూ బయోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పూసర్ల అపరంజి పూర్తి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో తయారు చేసిన ఈ పరికరం పెన్‌డ్రైవ్ తరహాలో సుమారు 5 సెం.మీ. పరిమాణంలో ఉంటుంది. దీనికి వినియోగించే స్ట్రిప్ ఒక సెం.మీ. మాత్రమే ఉంటుంది. సాధారణంగా షుగర్ స్ట్రిప్స్‌ను ఒకసారి వాడి పడేయాలి. కానీ, ఈ లేబుల్ ఫ్రీ స్ట్రిప్‌ను బయో ఫ్యాబ్రికేషన్‌తో తయారు చేయడం వల్ల ఆరు నెలలపాటు ఎన్నిసార్లు అయినా వినియోగించుకోవచ్చు. ఈ బయోసెన్సార్ పరికరంలో ఒక చుక్క బ్లడ్ వేస్తే.. సెకను వ్యవధిలోనే కచ్చితమైన మధుమేహం వివరాలు వచ్చేస్తాయి. ఈ డివైజ్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌కు అనుసంధానం చేస్తే షుగర్ లెవల్స్ వివరాలు డిస్‌ప్లే అవుతాయి. మరోవైపు ఈ డివైజ్ ద్వారా కేవలం మధుమేహం మాత్రమే కాకుండా కోవిడ్, క్యాన్సర్, బీపీ, ఫ్యాట్, థైరాయిడ్ తదితర వ్యాధులకు పరీక్షలు చేసేలా, గాలిలో కాలుష్యాన్ని కనుగొనేలా అభివృద్ధి చేయాలని ఏయూ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం యాంటీజన్ యాంటీబాడీ ఇమ్మొబలైజేషన్ మెథడ్ ద్వారా చిప్స్ తయారీకి పరిశోధనలు కొనసాగుతున్నాయి. క్యాన్సర్ పరీక్షలకు అనుగుణంగా పరికరాన్ని అభివృద్ధి చేసేందుకు బార్క్, కోవిడ్, ఇతర వ్యాధులకు సంబంధించిన స్ట్రిప్స్ తయారీ కోసం ఢిల్లీకి చెందిన పలు సంస్థలు ఏయూతో చర్చలు జరుపుతున్నాయి.



పోర్టబుల్ నానో బయో సెన్సార్

ఆప్టిక్ ఫైబర్ టెక్నాలజీతో..

కోవిడ్ సమయంలో ప్రతి పరీక్షకు ఎక్కువ ఖర్చు చేసేవారు. అందువల్ల పోర్టబుల్ నానో బయోసెన్సార్ పరికరం తయారు చేయాలన్న ఆలోచన మొదలైంది. వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి సహకారంతో ఏయూ ల్యాబ్‌లోనే పరిశోధనలు ప్రారంభించి సఫలీకృతులయ్యాం. ఆప్టిక్ ఫైబర్ టెక్నాలజీతో అన్ని పరీక్షలను ఈ పరికరం ద్వారా తెలుసుకునేలా చేస్తున్నాం. ప్రస్తుతం ఒక డివైజ్ మల్టిపుల్ స్ట్రిప్స్ వాడుతున్నాం. భవిష్యత్తులో ఒక పరికరం.. ఒకే చిప్ అనే విధంగా పరిశోధనలు చేస్తున్నాం.

– డాక్టర్ అపరంజి, ఏయూ బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్

ఏయూ చరిత్రలో తొలి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్

ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్రలో ఒక పరిశోధన పేటెంట్ పొంది, సాంకేతికత బదలాయింపు జరిగిన తొలి పరికరం ఇదే కావడం విశేషం. ఈ పరికరాన్ని వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విశాఖకు చెందిన అక్షయ ఇన్నోటెక్ సంస్థ ఇటీవల ఏయూతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా సాంకేతికతను బదలాయింపు చేసుకుని త్వరలోనే ప్రజలకు అతి తక్కువ ధరకు ఈ పరికరాన్ని అందుబాటులోకి తీసుకురానుంది.



పనస పొట్టు.. షుగర్ ఆటకట్టు!

పచ్చి పనసపొట్టు పిండితో మధుమేహాన్ని నియంత్రించొచ్చని శాస్త్రీయ పరిశోధన

సాక్షి, హైదరాబాద్: మధుమేహ చికిత్సలో ప్రభావవంతమైన వైద్య పోషకాహార చికిత్సగా పచ్చి పనసపొట్టు పిండి పనిచేస్తుందని ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఓ అధ్యయనం నిరూపించింది. శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య విజ్ఞాన సంస్థలో జరిగిన ఈ అధ్యయనంలో పచ్చి పనసపొట్టు పిండి ప్రయోజనాలను గుర్తించారు. పచ్చి పనసపొట్టు పిండికి మధుమేహ రోగుల్లో బ్లడ్ షుగర్ స్థాయిలను నియంత్రించే శక్తి ఉందని నిర్ధారించారు. ఈ అధ్యయన ఫలితాలను 'జాక్‌ఫ్రూట్365' సంస్థ వ్యవస్థాపకుడు జేమ్స్ జోసెఫ్ పలువురు వైద్య నిపుణులతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. నిత్యం తగిన మోతాదులో పచ్చి పనసపొట్టు పిండిని తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటున్నట్లు వైద్య బృందం సైతం నిర్ధారించిందన్నారు.

ఫలితాలు ప్రోత్సాహకరం: వైద్య నిపుణులు

ఈ అధ్యయనాన్ని మధుమేహ రోగులకు ప్రోత్సాహకరమైన వార్తగా ఫెర్నాండేజ్ ఆసుపత్రి కన్సల్టెంట్ న్యూట్రిషియనిస్ట్ డాక్టర్ లతా శశి మీడియా సమావేశంలో మాట్లాడుతూ అభివర్ణించారు. అహ్మదాబాద్‌కు చెందిన డయాబెటాలజిస్ట్ డాక్టర్ వినోద్ అభిచందానీ వర్చువల్ పద్ధతిలో మాట్లాడుతూ పచ్చి పనసపొట్టు పిండిని తన రోగులు వినియోగించడం ద్వారా వారు ఆరోగ్య ప్రయోజాలను పొందారన్నారు. ఇదే తరహా సూచనలను అమెరికన్ డయాబెటిక్ అసోసియేషన్ సైతం చేసిందన్నారు. పచ్చి పనసపొట్టు పిండిలో పీచు పదార్థాలు అధికంగా లభిస్తాయని, దీనివల్ల తీసుకొనే కేలరీలు తగ్గడంతోపాటు గ్లైసెమిక్ లోడ్ తక్కువగా ఉంటుందన్నారు. జాక్‌ఫ్రూట్365 సంస్థ అందించే గ్రీన్ జాక్‌ఫ్రూట్ ఫ్లోర్‌ను ఒక టేబుల్ స్పూన్ మోతాదులో ప్రతిరోజూ భోజన సమయంలో వినియోగించడం వల్ల కార్బోహైడ్రేట్లు, కేలరీల స్వీకరణ తగ్గుతుందన్నారు. మెడికల్ న్యూట్రిషన్ థెరపీలో పచ్చి పనసపొట్టు పిండి సామర్థ్యంపై క్లినికల్ అధ్యయనం చేసేందుకు శ్రీకాకుళం మెడికల్ కాలేజీని తాము ఎంచుకున్నట్లు డాక్టర్ అంతర్యామి మహారాణా చెప్పారు.

రోజుకు 30 గ్రాముల పచ్చి పనసపొట్టు తీసుకుంటే..

'జాక్‌ఫ్రూట్365' సంస్థ వ్యవస్థాపకుడు జేమ్స్ జోసెఫ్ పేర్కొన్న వివరాల ప్రకారం... ఈ అధ్యయనం కోసం షుగర్ మాత్రలు వాడుతున్న 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఉన్న మొత్తం 40 మంది టైప్–2 మధుమేహ రోగులను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూప్‌లోని రోగులకు మూడు టేబుల్‌స్పూన్‌లకు సమానమైన 30 గ్రాముల పచ్చి పనసపొట్టు పిండిని 12 వారాలపాటు అందించారు. అలాగే మరో గ్రూప్‌లోని రోగులకు అంతే పరిమాణంలో పిండి తరహా పదార్థాన్ని అందించారు. ఈ అధ్యయన కాలంలో మధుమేహ రోగుల్లోని హెచ్‌బీఏ1సీ స్థాయిల్లో మార్పులతోపాటు ఫాస్టింగ్ ప్లాస్మా, గ్లూకోజ్, పోస్ట్ ప్రాండియల్ ప్లాస్మా గ్లూకోజ్ (పీపీజీ), లిపిడ్ ప్రొఫైల్, శరీర బరువును పరీక్షించారు. అలాగే గ్రీన్ జాక్‌ఫ్రూట్ ఫ్లోర్‌ను రోగుల రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించారు. ఫలితాల ప్రకారం పచ్చి పనసపొట్టు పిండి తీసుకున్న రోగుల్లో హెచ్‌బీఏ1సీ, ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్, పోస్ట్ ప్రాండియల్ గ్లూకోజ్‌లో గణనీయంగా క్షీణత కనిపించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.